నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:16 సంచిక:2 180 ఏప్రిల్ - జూన్ 2026 హైదరాబాద్

- సామూహిక చేతన 'తెలంగాణే'
- "ఆయుధం దొరికినప్పుడు ఏమీ చేయలేని బలహీనుడు కూడా..."
- సామాజిక మాధ్యమాలలో తెలుగు భాషావినియోగం–ఒక పరిశీలన
- చెరబండరాజు స్మరణలో సావిత్రి కవిత్వం
- కాక్రోచ్ జనతా పార్టీ- మరో యువ వాగ్ధానం
- కడపజిల్లా కైఫియత్తులు–భాషాపరిశీలన

నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

ఏప్రిల్-జూన్, 2026

సంచిక : 02

సంపుటి : 16

గౌరవ సంపాదకులు

ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహా మండలి

అల్లం నారాయణ

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ చింతా గణేష్

ప్రిన్సిపాల్ (పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

సంపాదకురాలు

స్నేహలత ఎం.

సంపాదకవర్గం

ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,

ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

డా॥ చంద్రయ్య, ఎస్. అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥ శివరాత్రి సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥ ఇమ్మిడి మహేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : క్రాంతి

రచనలు పంపాల్సిన చిరునామా

స్నేహలత ఎం.,

ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: nadusthunnatelangana@gmail.com

ఫోన్ నెం.: 9290745490

సంపాదకుని ఉత్తరం

ఆఖరి వీరుడు రాసిన
చివరి ప్రేమలేఖ
అక్షరాల తడి ఆరిపోనేలేదు.

సాయం సంధ్య వెలిగించిన
అంతిమ కిరణం
తూర్పు వాకిట్లో రాజుకుంటుంది.

యుద్ధం సరిహద్దు రేఖను దాటింది
లొద్దిమాను ఒడిలో
నిద్రిస్తున్న ఒంటరిపక్షి
నక్షత్రాల వెలుగులో
సూర్యోదయాన్ని కలగంటుంది

జూలై 15, 2026

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

తెలంగాణ తొవ్వ

సంపాదకీయం

సామూహిక చేతన 'తెలంగాణే' — **డా. చంద్రయ్య శివన్న** — 5

సామాజికం

కాక్రోచ్ జనతా పార్టీ: మరో యువ వాగ్దానం — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 6

తొవ్వ ముచ్చట

ఆయుధం దొరికినప్పుడు ఏమీ చేయలేని బలహీనుడు కూడా బలవంతుడైన వేటగాడిగా మారుతాడు-బూదూరి సుదర్శన్ — ఇంటర్వ్యూయర్: డి.రాఘవేంద్ర — 9

సాహిత్య పరిశోధన

సామాజిక మాధ్యమాలలో తెలుగు భాషా వినియోగం — **మ్యాడం అభిలాష్** — 13

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సంపాదకీయ వ్యాసాల విశ్లేషణ — **గంధం నరేందర్** — 18

కాసుల లింగారెడ్డి కవిత్వం-విశ్లేషణ — **మలిపెద్ది రాజు** — 23

బంజారా-తెలుగు భాషవిశ్లేషణ — **డా. లావుడ్యా నర్సింగ్ నాయక్** — 27

నలిమెల భాస్కర్ నానీలు-వస్తువైవిధ్యం — **రేణ ఈశ్వరయ్య** — 34

సాహిత్య విమర్శ

చెరబండరాజు స్మరణలో సావిత్రి కవిత్వం — **వంగాల సంపత్‌రెడ్డి** — 38

అచ్చమైన ఆడపడుచులు-గాథాశప్తశతి నాయికలు — **ఆచార్య వెంకటరామయ్య గంపా** — 40

సాహిత్య సమీక్ష

ప్రాణమసొంటి పాటకు కేరాఫ్ 'మిట్టపల్లి' — **డా. పసునూరి రవీందర్** — 46

పరిశోధన పరిచయం

కడపజిల్లా కైఫియత్తులు-భాషాపరిశీలన — **డా. కొల్లేటి రవిబాబు** — 49

సామూహిక చేతన 'తెలంగాణే'

డా. చంద్రయ్య శివన్న

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కరకాలం కావస్తోంది. ఈ కాలమంతా కొత్త ఆశలు, నూతన ప్రణాళికల రూపకల్పన, అస్తిత్వ పునర్నిర్మాణ ఆలోచనలు ఎన్నో జరిగాయి. ఈలోపు రాష్ట్రాన్ని 'సాధించా'మన్న భారత రాష్ట్ర సమితి మారి, రాష్ట్రాన్ని 'ఇచ్చాం' అన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణకోసం ఒక్కతాటిపైకి వచ్చిన ప్రజలు, విద్యార్థి, మేధావి వర్గాలు, వారివారి 'స్వీయ' ఎజెండాల్లోకి నెట్టివేయబడ్డారు. అధికారానికి దగ్గరగా ఉన్న వర్గాలు కొత్త ప్రభుత్వాన్ని వెనుకేసుకొస్తే, అధికారానికి దూరమైన లేదా దూరంగా ఉంచబడ్డ వర్గాలు ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నివసించే సాధారణ ప్రజలు కూడా ఆనాటి కె.సీ.ఆరే తెలుగు రాష్ట్రం విడిపోవడానికి కారణమని నమ్ముతూ వచ్చారు. హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రా సెటిలర్స్ స్వప్రయోజనాలకోసం 'గోడమీది పిల్లి' వాటాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. సాధించుకున్న కొత్త తెలంగాణలో విద్యార్థి, యువజనం ఆశించిన ఫలితాలు దక్కడంలేదనే నిరాశానిస్పృహలు ప్రదర్శించినప్పుడు, అదనుకోసం ఎదురుచూస్తుండిన ఈ హైదరాబాద్ ఆంధ్రా సెటిలర్స్ 'ప్రాయశ్చిత్తం అనుభవించండి' అంటూ తమ అక్కసునంతా వెల్లగక్కేవారు. ఒకరకంగా బి.ఆర్.ఎస్. మీదున్న కోపాన్ని సాధారణ తెలంగాణ ప్రజలమీద అవకాశమున్నచోటల్లా 'వోమిట్' చేసుకునేవారు. కానీ దీనికి విరుద్ధంగా బి.ఆర్. ఎస్. ఈ పన్నెండేళ్లకాలంలో ప్రవర్తించిందనేది రాజకీయ విశ్లేషకుల విమర్శ. ఆంధ్రా పెట్టుబడిదారుల ప్రయోజనాల్ని కాపాడటానికి 'తెలంగాణ'ను ఎప్పుడో అది గాలికి వదిలేసింది. అస్తిత్వాన్ని తాకట్టుపెట్టే పనులెన్నో చేసింది. ఇది గమనించిన తెలంగాణ ప్రజలు బి.ఆర్. ఎస్. ను గద్దెదించి, కాంగ్రెస్ కు పట్టంకట్టారు.

'తెలంగాణ అస్తిత్వం'తో మొదటినుంచీ సంలీనంలేని కాంగ్రెస్ కు ఆ అస్తిత్వాన్ని కాపాడటం ఎలాగో కూడా తెలియదు. ఇక సహజంగానే తెలంగాణ' అంటే అక్కసుతో ఉన్న 'ఆంధ్ర' మనస్తత్వం కలిగిన కొంతమంది ఆంధ్రులు, క్రమంగా ఈ రెండున్నరేళ్ల కాలంలో తెలంగాణపై పట్టుసాధించటానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి రెండు కారణాలు: తెలుగుదేశం పార్టీ పూర్వ నాయకుడూ, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అనుబంధ సంస్థలో పూర్వం పనిచేసిన వ్యక్తీ (ఇద్దరూ ఒక్కరే) తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉండటం. దీంతో ఆంధ్రుల్లో అంతరాంతరాల్లో బలవంతంగా అణచిపెట్టుకొన్న 'విభజన జరిగిందనే అక్కసు' క్రమంగా బయటకురావడం మొదలైంది. నారాచంద్రబాబు నాయుడు అనేకమార్లు హైదరాబాదు అభివృద్ధికి తానే కారకున్ని అని ప్రకటించడం, పవన్ కళ్యాణ్ 'తెలంగాణ మీ అయ్య జాగీరు కాదు' అని తెలంగాణవారిని విమర్శించడం మనం చూసాం. ఇవన్నీ రాజకీయపరంగా, ఆర్థికపరంగా ఆంధ్ర ఆధిపత్యపు అహకారాన్ని తెలియజేస్తున్నాయి. ఇవిలా ఉండగా చంద్రబాబుకు తాబేదార్లుగా మారిన కొంతమంది తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు 'తెలంగాణ' అనే పదం అసలు డిక్షనరీల్లోనే లేదంటూ తమ అజ్ఞానాన్ని బయపెట్టుకున్నారు. 'తెలంగాణ'ను ఇతరులముందు పలుచనచేసి నిలబెడుతున్నారు. మరోవైపు, తెలంగాణ భాషానుడికారమైన 'ఇడుపు కాయితం'ను సినిమా పేరుగా పెట్టినందుకు ఆంధ్రా అహంకారులు కొంతమంది అవహేళనచేస్తూ మాట్లాడారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్య, తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకల అజ్ఞానపు మాటలు, 'ఇడుపు కాయితం' భాషావివాదం ఈ మూడు సందర్భాల్లోనూ తెలగాణ ప్రజలు పెద్దయెత్తున స్పందించారు. విడివిడి అస్తిత్వాలతో తమ తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి పనిచేస్తున్న తెలంగాణ ప్రజలు, మేధావులు, విద్యార్థి యువజనులు సామూహికంగా ప్రతిఘటించారు. కొంతమంది ఆంధ్రావ్యక్తుల భాషాధిపత్యాన్ని, కులాహంకారాన్నీ తమకు తోచిన రీతిలో ఖండించారు.

ఈ విషయాల నేపథ్యంలో కొన్ని విషయాలు అర్థమవుతున్నాయి. తెలంగాణ ప్రజల్లో తెలంగాణ అస్తిత్వం నివురుగప్పిన నిప్పులా నిరంతరం వెలుగుతూనే ఉంటుంది. తెలంగాణపై ఆంధ్రాధిపత్యం ఏ రూపంలో ప్రదర్శించాలని చూసినా, దాన్ని ఎదుర్కొనే సామూహికత్వం సజీవంగా పెల్లుబుకుతుంది. సంస్కృతి, భాష వంటి అస్తిత్వాల విషయంలో ఈ సామూహిక చేతన మరింత తీవ్రంగా వ్యక్తమవుతోంది. అయితే, ఈ చేతన తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంకాకపోవడం విచారకరం. ఈ చేతన తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టుపెట్టే 'దళారీతనం'నుంచీ, బానిస మనస్తత్వంనుంచి తెలంగాణ నాయకులను దూరంచేసేలా ఎన్నికల ఎజెండా రూపొందించే 'మెకానిజం' లేకపోవడం బాధాకరం. T

సామాజికం

కాక్రోచ్‌జనతా పార్టీ-మరో యువ వాగ్ధానం

ప్రొఫెసర్ చింతకింది కాశీం

కొద్దిరోజులుగా 'కాక్రోచ్' మీద చాలా చర్చ జరుగుతోంది. భారతదేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్య ఇది. ఆయన ఈ దేశ యువతరాన్ని ఉద్దేశించి కాక్రోచులు అన్నాడు. ఈ బొద్దింక అనే పద ప్రయోగం నిందార్థంలో ఉపయోగించాడు. భారతదేశంలో ఉన్న నిరుద్యోగులు విద్యలో సరైన నైపుణ్యంలేనివారు, ఇతరేతర సమూహం యువతరంలోకి వస్తుంది. ఈ యువతరాన్ని ఉద్దేశించి ఏ ఆధారం లేనివాళ్ళు, నైపుణ్యం లేనివాళ్ళు, ఉపాధి లేనివాళ్ళు, సమాజంలో జరిగే అనేక పరిణామాల మీద, చర్చల మీద, వ్యక్తుల మీద, సమూహాల మీద అనవసరమైన కామెంట్స్ చేస్తూ ఉన్నారు. కనుక, వీళ్ళు కాక్రోచులు అనే అర్థంలో వాడాడు. ఆ వ్యక్తులు దేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి, న్యాయమూర్తులు, ముఖ్యమంత్రులు, మంత్రులు ఇక్కడి వరకు ఎవరైనా కావచ్చు, ఎస్టాబ్లిష్మెంట్ అంటాం. అధికారం తమ చేతుల్లో పెట్టుకున్న వారందరి పట్ల అసమ్మతిని నిరసనని వ్యక్తం చేస్తున్నవాళ్ళు సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గారి ఉద్దేశంలో కాక్రోచులుగా మారారు. అందుకే ఆ పదప్రయోగం చేశాడు. కొందరు సమాజంలో తిరోగామి భావాలు కలిగినటువంటి వాళ్ళు కూడా ఇందులో ఉండవచ్చు. ఆ తిరోగామి భావాలు కలిగినవాళ్ళు సమాజం ముందుకు వెళ్ళకుండా, ముందుకు వెళ్ళాలని ప్రయత్నం చేసేవారి మీద కూడా చాలా రకాల మాటలు మాట్లాడుతూ ఉండవచ్చు. కానీ, మొత్తం యూత్ ను ఒక సమూహంగా తీసుకొని చూసినప్పుడు ఈ విషయాన్ని మనం ఎట్లా అర్థం చేసుకోవాలనేది ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

వివిధ సందర్భాల్లో, సమాజంలో చాలా చర్చలు జరుగుతూ ఉంటాయి. ఆ చర్చల్లోకి చాలా అంశాలు వస్తూ ఉంటాయి. వాటిపట్ల అనుకూలంగా చర్చ చేసేవారు, వ్యతిరేకంగా చర్చ చేసేవారు కూడా ఉంటారు. కానీ, అంతిమంగా సోషల్ మీడియా విపరీతంగా ప్రాచుర్యం ఉన్న ఈ రోజుల్లో మన ఆలోచనలను ఏది ప్రభావితం చేస్తుంది? అనేది ముఖ్యం. ఆ ప్రభావం శాస్త్రీయంగా ఉందా? హేతుబద్ధంగా ఉందా? సక్రమంగా ఉందా? సత్యంగా ఉందా? అనేది ముఖ్యం. సత్యం ఏమిటి? అసత్యం ఏమిటి? శాస్త్రీయత ఏమిటి? అశాస్త్రీయత ఏమిటి? సరైన మార్గం ఏమిటి? తప్పుడు మార్గం ఏమిటి? అని తేల్చుకోవటమే అసలైన సమస్య. ఆనాడు, ఎప్పుడో తత్వవేత్త కార్ల్ మార్క్స్, 'ప్రపంచాన్ని పలువిధాలుగా వ్యాఖ్యానించారు. కానీ, ప్రపంచాన్ని మార్చడం ఎట్లా అనేది అసలు సమస్య' అన్నాడు. ఆ మార్చే పని ఏమిటో ఆయన చూపించాడు. కనుక, ఇవ్వాళ దేశాన్ని, దేశంలో ఉండే వివిధ రకాల సమస్యలని, సమూహాలని, వివిధ వ్యక్తులు వివిధ రకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యాఖ్యానాల్లో సరైనది ఏమిటి? అనేది అసలు సమస్య. యువత ఈ దేశాన్ని నాయకత్వం వహించి ముందుకు నడపడానికి వచ్చినటువంటిది.

ఆనాడు అసెంబ్లీలో బ్రిటిష్ ప్రభుత్వం, ట్రేడ్ డిస్ప్యూట్ బిల్, పబ్లిక్ సేఫ్టీ బిల్ ను ప్రవేశపెడుతుంది. ఈ రెండు బిల్లులు బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సందర్భాన్ని చూసుకొని ఇది భారతీయులకు వ్యతిరేకం, ఇది ఇక్కడి కార్మికులకు వ్యతిరేకం, ఇక్కడ ప్రజలకు వ్యతిరేకం అని ఆలోచించి ఈ బిల్లు మాకు వ్యతిరేకంగా తీసుకొస్తున్నారు. గనుక, మేము ఎంత చెప్పినా మీరు వినటం లేదు. గనుక, చెవిటివాళ్ళకి బాంబు శబ్దం అవసరము అని అసెంబ్లీలో బాంబు వేసి ఒక్కసారి దేశపు చూపును తమ వైపు తిప్పుకున్నారు. భగత్ సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, భకేశ్వన్ దత్, రాజా చంద్రశేఖర్ లు. దీనికి ప్లాన్ చేసింది- భగత్ సింగ్. అట్లా బాంబు వేసి పారిపోలేదు. కరపత్రాలు పంచారు. మేము ఎందుకు బాంబు వేసాము? మేము దొంగలం కాదు. మేము దేశాన్ని దోపిడి చేసుకునేవాళ్ళం కాదు. మేము దేశభక్తులం. ఈ దేశానికి స్వాతంత్రం కావాలని కోరుకుంటున్న వాళ్ళం. కనుక, మేము పారిపోదలుచుకోలేదు. మేము ఇదిగో ఈ కారణం వలన బాంబులు వేసాం అని కరపత్రాలు పంచారు. ఆ పంచుతున్నవాళ్ళని అరెస్ట్ చేసి జైల్లో పెట్టి, భగత్ సింగ్ ను 1931, మార్చి 23వ తారీకున ఉరితీశారు.

ఈ దేశం కోసం శ్రీశ్రీ, 'ఊగరా ఊగరా ఉరికొయ్యల నందుకొని/ నీ నెత్తుటి కోనేటిలో నవలోకం వికసించును/ ఊగరా ఊగరా ఉరికొయ్యల నందుకొని' అని భూమయ్య,

కిష్టాగౌడు సంఘటన నేపథ్యంలో రాశాడు. భగత్ సింగ్ నేపథ్యాన్ని ఇక్కడ కూడా అన్వయం చేసుకుంటే భగత్ సింగ్ త్యాగం ఏమిటో మనకు అర్థమవుతుంది. నునులేత యవ్వనం. 24 సంవత్సరాల యవ్వనాన్ని ఈ దేశానికి బలిచ్చినవాడు. భగత్ సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, భట్కేశ్వర దత్తు, సుఖదేవ్, రాజ్ గురు, ప్రపుల్లచాకి. 1927 నుంచి మొదలుపెడితే అంటే 100 సంవత్సరాల కిందట ఈ దేశ యువత ఏం ఆలోచించింది? దేశభక్తి గురించి, దేశం గురించి ఆలోచించింది. తమ విలువైన ప్రాణాలని దేశం కోసం బలివ్వడానికి ముందుకు వచ్చింది. బ్రిటిష్ వాళ్ళని భయపెట్టింది. సాండర్స్ మీద దాడిచేసి, సాండర్స్ భారతదేశంలో ఉన్నటు వంటివాళ్ళని ఇక్కడి జాతీయ నాయకులని ముఖ్యంగా, లాలాలజపత్ రాయ్ చనిపోవడానికైనా అమృత్సర్ పట్టణంలో సమావేశమైన ప్రజల్ని కాల్చి చంపినవాడు డయ్యర్. లాలా లజపత్ రాయ్ ని చంపినవాడు సాండర్స్.

బ్రిటిష్ అధికారులని భయపెట్టి ఈ దేశాన్ని వదిలి వెళ్లేటట్లు చేసినటువంటి తరం మనకి 1927 నుంచి 1935-40 వరకు కనిపిస్తారు. అక్కడి నుంచి మొదలుపెడితే, తెలంగాణలో నైజాం పరిపాలిస్తున్న హైదరాబాద్ రాజ్యంలో భూస్వాములు, జాగీర్దారులు, జమీందారులు ప్రజలని పీల్చి పిప్పిచేస్తూ, ఈ ప్రజల్ని దోచుకతింటున్న సందర్భంలో, ఇక్కడ ఉన్నటువంటి యువత, సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామనుజరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, బండి యాదగిరి, సుద్దాల హనుమంతు ఇలాంటి గొప్ప యువత అంతా ఈ సమాజం గురించి ఆలోచించింది. తమ చదువుల గురించో, తమ ఉద్యోగాల గురించో, తమ కుటుంబాల గురించో ఆలోచించలేదు. తెలంగాణ సమాజాన్ని నైజాము నుంచి విముక్తి చేయాలని ఆలోచించిన యువత ఆనాటి పోరాటంలోకి దూకింది. మగ్దూం మొయినుద్దీన్ లాంటివాళ్ళు, పి.వి. నరసింహారావు లాంటివాళ్ళు నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రధాన భూమిక పోషించి, ఈ తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేశారు. 1946లో మొదలుపెట్టిన ఆ పోరాటం, దొడ్డి కుమరయ్య, చాకల ఐలమ్మలాంటి వీరులెందరో చేసిన పోరాట ఫలితంగా నైజాం, భారతదేశంలో విలీనమయ్యాడు. ఈ తెలంగాణ సమాజాన్ని దేశంలో కలిపాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956లో ఏర్పడింది. రెండు ప్రాంతాల పెద్దమనుషులు ఒప్పందాలు చేసుకున్నారు. ఒప్పందాలు అమలు కాలేదు. ఉల్లంఘన జరిగినాయి. ఫలితంగా ఇక్కడ ఉద్యోగాలు లేని యువతరం, సరైన చదువులు లేని యువతరం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని 1969లో ఏడు నుంచి ఎనిమిది నెలలు ఉద్యమాన్ని నిర్వహించింది. భారతదేశాన్నంతా తన వైపుకు చూసేటట్లు చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఒకవైపు ఉద్యోగులు, లాయర్లు, ప్రధానంగా విద్యార్థి యువతరం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విద్యార్థుల బలిదానాలతో జరిగింది. ఆనాటి 370 మందికి పైగా విద్యార్థులు ఈ నేల కోసం, తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేశారు. ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో మనందరం సంతోషంగా ఉన్నామంటే ఆనాటి వారి త్యాగమే ప్రధానం. ఇక అక్కడి నుంచి మనం 70వ దశకం వచ్చే నాటికి ఈ దేశంలో సోషలిజం రావాలని ఈ దేశంలో విప్లవం రావాలని, నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావాలనీ, దున్నే వాళ్ళకే భూమి ఉండాలని, పని చేసే వాళ్ళకి పని దక్కాలని సుందరమైన సమాజాన్ని కలగన్న యువత ప్రగతిశీల విద్యార్థులుగా, రాడికల్ విద్యార్థులుగా, విప్లవ విద్యార్థులుగా విశ్వవిద్యాలయాన్ని వదిలేసి గుంటూరు మెడికల్ కాలేజ్, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, కలకత్తా యూనివర్సిటీ, బాంబే యూనివర్సిటీ, మద్రాస్

యూనివర్సిటీ లాంటి విశ్వవిద్యాలయలో చదువుకుంటున్న విద్యార్థులందరూ గ్రామాలను అధ్యయనం చేయడం కోసం గ్రామంలోకి వెళ్లి ఆ గ్రామంలో ప్రజల మధ్య ఉండి వారు పెట్టిన తిండి తింటూ వారికోసమే జీవించారు. విప్లవోద్యమాన్ని నిర్మాణం చేశారు.

ఇవాళ భారతదేశంలో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ విలువలు ఉన్నాయంటే ఆనాటి విద్యార్థి యువతరం సూరపనేని జనార్ధన్, ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జార్జిరెడ్డి రాగింగ్ ఉండొద్దని స్వేచ్ఛ ఉండాలని, చదువులో నాణ్యత ఉండాలని ఆలోచించి ఆనాటి సమాజానికి ఒక వెలుగు దివ్వెలా పనిచేసి ఇలాంటి వాళ్ళందరూ నెలకొలిపిన సంప్రదాయం ఈ దేశం కోసం త్యాగం చేసిన గొప్ప సంప్రదాయం. 70ల నుంచి 90 లకు వచ్చే నాటికి సమాజంలో నూతన ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. సమాజం ఒకవైపు నెట్టబడ్డది. ఈ స్థితి నుంచి చూసినప్పుడు విద్యార్థి యువతరంలో ఏమైనా చలనం వస్తుందా? మార్పు వస్తుందా? దేశం గురించి ఆలోచిస్తారా? స్వార్థంగానే ఉండిపోతారా? భగత్ సింగులు ఏరి? వట్టికోట అళ్వార్ స్వాములు ఏరి? బండి యాదగిరిలు ఏరి? అని అనుకుంటున్న రోజుల్లో మళ్ళీ 2009 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజి వేదికగా మళ్ళీ విద్యార్థులే దాదాపు ఐదు సంవత్సరాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ ప్రజలకు నాయకత్వం వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. 1400 మంది బిడ్డలు ఈ తెలంగాణ నేల మీద ఒరిగిపోయారు. ఒరిగిపోయిన తర్వాత జరిగింది ఏమిటి? యువతరం ఎప్పుడైనా మండుతున్న అగ్నిలాంటి వాళ్ళు, పొడుస్తున్న సూర్యునిలాంటి వాళ్ళు, సూర్య కిరణాలతో చీకటిని పారద్రోలి వెలుతురును ఈ సమాజానికి అందించేవాళ్ళు యువత. ఆ శక్తి వాళ్ళకు ఎందుకుంటుందంటే స్వార్థం లేకుండా, మండే నెత్తురుతో ఉంటారు. సమాజాన్ని మార్చాలనే లక్ష్యం ఉంటుంది కనుక వెనకా ముందు చూడకుండా ఈ సమాజాన్ని మార్చడానికి ప్రయత్నం చేసే శక్తి యువతరంలో ఉంటుంది. అందుకే 2009 నుంచి 2014 వరకు జరిపిన ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని మనం సాధించుకున్నాం.

ఇక ఇవ్వాళ దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపీ పార్టీ 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. బిజెపి పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధానమైన భూమిక పోషించింది విద్యార్థి యువత. ఈ యువతనే, ఈ కాక్రోచ్చే అప్పటికి మునుపు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆ కాంగ్రెస్ పార్టీ సందర్భంలో జరిగిన అవినీతి, నిరుద్యోగం, నాణ్యత లేకపోవటం ఇవన్నీ చూసినప్పుడు అన్నా హజారే అనేటువంటి ఒక వ్యక్తి ఢిల్లీ నడివీధుల్లో అవినీతికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం చేస్తున్నాను అంటే ఆయన వెనుక దేశవ్యాప్తంగా విద్యార్థి యువత ర్యాలీ అయ్యింది. ఆ విద్యార్థి యువతనే దేశంలో పెనుమార్పు రావడానికి ప్రధాన కారణమయ్యింది. 18-20 సంవత్సరాల వయసు నుంచి 30-35 సంవత్సరాల మధ్యన ఉన్న విద్యార్థి యువత ఓట్లు వేస్తేనే ఇవ్వాళ అధికారంలో ఉన్న మోడీగారు 2014 లో అధికారంలోకి వచ్చారు. ఈనాడు తమిళనాడులో విజయ్ అనే ఒక సినిమా హీరో పార్టీ పెట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే 100కు పైగా సీట్లు సాధించాడంటే మెజారిటీ సీట్లకు ప్రధాన కారణం ఆయన వెనక ఉండి పనిచేసిన విద్యార్థి యువతనే ప్రధాన కారణం. కనుక ఈ 100 సంవత్సరాల కాలంలో విద్యార్థి యువత ఈ కాక్రోచ్ అనే ఏ పేరుతో ఈనాడు సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ మాట్లాడాడో ఆ కాక్రోచులు సమాజాన్ని సంపాదకత్వం చేశారు. సమాజాన్ని జ్ఞానవంతం చేశారు, చైతన్యం చేశారు, విముక్తి చేశారు, అభివృద్ధి చేశారు, సమాజాన్ని ప్రగతిదాయకంగా మార్చారు. అలాంటి కాక్రోచ్ జనతా పార్టీ నేడు కోరుకుంటున్న ఎన్నికల సంఘంలో ఇది రిజిస్టర్ కావాలని, రెండు కోట్ల మంది యువత ఎవరైతే మీరుగూగుల్ ఫామ్ నింపారో మీరందరూ ప్రధాన స్రవంతిలోకి రావాలని, రోడ్లమీదకి రావాలని, చాలామంది యువత నిరుద్యోగంతో సతమతం అవుతున్నారు. చదివిన చదువుకు నాణ్యత లేకపోవడంతో, నైపుణ్యం లేకపోవడంతో, ఉద్యోగం రాకపోవడంతో, పాలక వర్గాలు రోజురోజుకు వ్యవస్థని ప్రైవేటీకరించడంతో, ప్రభుత్వంలో ఉద్యోగాలు లేక ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు దొరకక, ఒక సంక్షోభం ఏర్పడిన స్థితిలో రోడ్డు మీద ఉండి కుటుంబాన్ని సాదలేక, పెళ్లిలు చేసుకోలేక, కుటుంబానికి బాధ్యత పడలేక, ఏమి చేయాలో దిక్కుతోసని స్థితిలో ఉన్న యువత, ఈ దేశం మీదే... ఈ సంపద మీదే. ఈ దేశం 70 ఏళ్ళ నిండిన ముసలి వాళ్ళది కాదు, వాళ్ళు కూడా దేశంలో భాగమయి మీకు టార్చ్ లైట్ వేసి వెలుగును చూయిస్తారు. ఇలా వెళ్ళండని కానీ ఈ దేశం మీది వృద్ధ నేతలు పార్లమెంట్లో కూర్చొని దేశం గురించి ఏం ఆలోచిస్తారు? ఈ దేశానికి యువత కావాలి. మీరు సరైన మార్గంలో ఆలోచించండి. ఈ దేశాన్ని ప్రపంచ దేశాలలో సమున్నతంగా ఉంచే ఆలోచన చేయండి. ఉత్పత్తిని సృష్టించే ఆలోచన చేయండని చెరబండ బండరాజు అన్నాడు. “యువతరమా నవతరమా ఇదే అదును కదలిరమ్మా! ఇదే అదును కదలిరమ్మా! ఈ దేశానికి కళ్ళు నీవే, కాళ్ళు నీవే నెత్తురు చిందించగా ఈ దేశం ఫలించాలి! ఈ దేశం ఫలించాలి!”

రచయిత: ఆచార్యులు, తెలుగు శాఖ, ఓయు.

తొవ్వ ముచ్చట

ఆయుధం దొరికినప్పుడు ఏమీ చేయలేని బలహీనుడు కూడా బలవంతుడైన వేటగాడిగా మారుతాడు

– బూదూరి సుదర్శన్

ఇంటర్వ్యూయర్: డి.రాఘవేంద్ర

మనం నిజజీవితంలో పదిమందిలో మంచి అనే ముసుగు వేసుకొని బతుకుతూ ఉంటాం. మనలో ఉన్న అసలైన కోణం వదిలి బయటవాళ్ల మెప్పుకోసం వాళ్లకు నచ్చే విధంగా నటిస్తూ ఉంటాం. కానీ, ఎవరు మనల్ని చూడటం లేదని ధైర్యం వచ్చినప్పుడు మనలోని అసలైన స్వభావం బయటపడుతుంది. కొత్త విషయాలు అర్థమైనప్పుడు మనలను కొత్తపరిస్థితుల్లోకి ఆ సందర్భం నెడుతుంది. మనిషి మనసులోని ఆలోచనలు వాళ్ళల్లో దాగి ఉన్న భయాలు, సందేహాలు మనిషి బయటకు ఎలా కనిపిస్తాడు లోపల ఎలా ఉంటాడు అనే విషయం 'అనుకోకుండా' అనే నవల బలంగా చెబుతుంది. బూదూరి సుదర్శన్ గారు 'అనుకోకుండా' నవలకు గాను ఉగాది నవలల పోటీలో లక్ష రూపాయల బహుమతి పొందాడు. ఆ నవలకు బహుమతి రావడానికి గల కారణం చూస్తే 'అనుకోకుండా' నవల కేవలం నవల మాత్రమే కాదు, ఇది ఒక మనస్తత్వశాస్త్రానికి సంబంధించినదిగా ఇందులో ఉండే అన్నీ అంశాలు నిజజీవితంలో మన కళ్ళముందే కనిపించేటట్టు చేయడం ఈ నవల ప్రత్యేకత. అందులో ఉండే అంశాలని ఇంకా పూర్తిస్థాయిలో తెలుసుకోవడం కోసం బూదూరి సుదర్శన్ గారితో డి. రాఘవేంద్ర జరిపిన ఇంటర్వ్యూ విశేషాలివి...

1. మీ బాల్యం, విద్యాభ్యాసం ఎలా గడిచింది.

నేను చిత్తూరు జిల్లాలోని తిరుమలయ్యగారి పల్లె అనే చిన్న గ్రామంలో 12 అక్టోబర్ 1997లో జన్మించాను. మా నాన్న పేరు పరదేశి, అమ్మ పేరు చిట్టెమ్మ. నా చిన్నప్పుడు నాన్నగారు విద్యావాలంటీర్ గా పనిచేసేవాడు, కానీ ప్రస్తుతం కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఎక్కువగా అన్నీ విషయాలు అమ్మతో పంచుకునేవాడిని. నాన్న అంటే భయం ఉండేది కాని, మా నాన్న ఇంపాక్ట్ కూడా నా మీద చాలా ఉండేది. ఎంతలా అంటే చిన్నప్పుడు మా నాన్న చదివిన పాఠశాలలోనే నేను కూడా చదివాను, మా నాన్న చదివినప్పుడు ఆయనకు ఎలా అయితే టాప్ ర్యాంక్ వచ్చిందో నేను కూడా అలానే అదే టాప్ ర్యాంక్ తో నిలిచాను.

నా పదవ తరగతి పూర్తి అయ్యేలోపే నేను నాలుగు పాఠశాలలు మారడం జరిగింది. ఒకటి నుంచి మూడో తరగతి వరకు మా గ్రామంలోనే చదువుకున్నాను. నాలుగో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు వేరే స్థానిక పాఠశాలలో చదవవలసి వచ్చింది. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు తిరుపతిలో చదువుకున్నాను. ఆ తర్వాత తిరిగి గ్రామానికి వచ్చి అక్కడ పదవ తరగతి వరకు పూర్తి చేశాను. నాలుగు పాఠశాలు మారిన, ప్రతి పాఠశాలలో నన్ను ఎంతగానో ప్రోత్సహించే ఉపాధ్యాయులు దొరకడం నా అదృష్టంగా భావిస్తున్న. సురేష్ బాబు సార్ చెప్పే తెలుగు క్లాస్ వినడం వల్ల తెలుగు అంటే ఏమిటో తెలుగుకు ఎంత విలువ ఉంది అని నాకు అర్థమైంది.

నేను చదువులో ఎంతో చురుగ్గా ఉండటం వల్ల పదో తరగతి తరువాత ట్రిబుల్ ఐటి(IIIT) లో చేరాను. అక్కడ ఇంటర్ లో MBIPC బ్రిడ్జ్ కోర్సు లో చేరి ఆ తరువాత B.TECH లో మెకానికల్ చేశాను. కానీ, నా ఆరోగ్య సమస్యల వల్ల బీటెక్ పూర్తి చేయలేకపోయాను. నాలుగవ సంవత్సరంలో మధ్యలోనే చదువు నిలిపివేశాను. ఆ తర్వాత హైదరాబాద్ కి వచ్చి ఇక్కడ యానిమేషన్ నేర్చుకున్నాను. యానిమేషన్ నేర్చుకుంటూనే బి. ఏ. ఓపెన్ గా చేసి ఉత్తీర్ణత పొందాను. ఆ తర్వాత 2019లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ చేద్దామని అనుకున్నాను కానీ కరోనా సమయం వలన అది కూడా చేయలేకపోయాను.

2. బిటెక్ చదివిన మీరు సాహిత్య రంగంలోకి రావడానికి గల కారణం ఏమిటి?

నాన్న ఒకప్పుడు విద్యా వాలంటీర్ గా పని చేసేవాడు. అందుకేనేమో అలా నాకు చిన్నప్పటి నుండి రోజూ పుస్తకాలు చదవడం అలవాటు అయింది. చదవడం వల్ల రాయడం కూడా అలవాటయింది. ఏడవ తరగతి నుండి నవలలు రాయడం మొదలుపెట్టాను. ఆరోగ్యం బాలేక బిటెక్ మధ్యలో ఆపేశాను. బిటెక్ మధ్యలో ఆపేసిన తర్వాత నా లైఫ్ లో రెండే మార్గాలున్నాయి. ఒకటి బీటెక్ తిరిగి పూర్తి చేసి ఏదైనా ఒక సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ తెచ్చుకోవాలి, రెండవ ఆప్షన్ నాకు నచ్చినట్టుగా హైదరాబాద్ కి వచ్చి రైటర్ అవ్వాలి. కానీ రైటర్ అవ్వాలంటే దానికి చాలా సమయం పడుతుంది. కనీసం 10 సంవత్సరాలైనా సమయం పడుతుంది అని అనుకున్నాను. ఆ

తర్వాత ఇంక ఏదైనా సరే నాకు నచ్చింది చేయాలని డిసైడ్ ఆయి రైటర్ గా ఉండాలని కోరుకున్న. అందులో సక్సెస్ అయినా ఫెయిల్ అయినా సరే బాధపడటం మానేయాలి అనుకున్నాను. అలా అనుకున్న నేను ఇప్పుడు మీ ముందు ఉన్నాను.

3. మీది రాయలసీమ కదా! ప్రతి ఒక్కరూ రాయలసీమ అంటే ఒక ఫ్యాక్షన్ అని అనుకుంటారు? మరి అక్కడ నిజంగానే ఎల్లప్పుడూ గొడవలు జరుగుతాయా?

మీరు చెప్పింది నిజమే కానీ రాయలసీమ అంటే గొడవలు మాత్రమే కాదు కదా! దానికి ఫ్యాక్షన్ అనే ముద్ర వేశారు అంతే కానీ అక్కడ ఎల్లప్పుడూ గొడవలు ఉంటాయని అయితే నేను ఒప్పుకోను. ఎక్కడైనా సరే ప్రతి రాష్ట్రంలో కూడా గొడవలు జరుగుతూ ఉంటాయి. మన ఇంటి పక్కల గాని, మన ఊర్లో గాని, ఎక్కడైనా సరే గొడవలు అనేది సాధారణంగా అవుతుంటాయి. అలా చిన్న చిన్న గొడవలు తీసుకొని ఈ సినిమా వాళ్లు పెద్దగా చిత్రీకరించడం వల్ల రాయలసీమకి చాలా చెడ్డ పేరు వచ్చింది. దీనిని నేను అస్సలు ఏకీభవించలేను. ఎందుకంటే మీ యొక్క రిసోర్సెస్ కోసం ఒక ప్రాంతాన్ని చెడుగా చూపించడం అనేది చాలా వరకు తప్పు. సినిమాలో కంటెంట్ మంచిగా ఉండడానికి ఇలా ఒక ఊరి పేరు తీసుకొని, రాష్ట్రం పేరు తీసుకొని చెడుగా చూపించడం అనేది చాలా తప్పు అని నేను అనుకుంటాను. నేను చివరిగా ఒక్కటే మాట చెబుతాను ఒక ప్రాంతం గురించి ఎవరైనా సరే బ్యాడ్ గా కథనం తీసుకురావద్దు అలా ఎవరైనా తీసుకొని వస్తే నేను వాళ్ళకి వ్యతిరేకంగా మారుతాను.

4. మీరు మొదటగా రాసిన నవల ఏది? ఎప్పటినుండి నవలలు రాయడం మొదలు పెట్టారు?

ఏడవ తరగతిలో ఒక నవల రాశాను. దాని పేరు 'విన్నర్స్' అని అప్పట్లో పెట్టాను. ఆ తర్వాత ఇంటర్మీడియట్ వచ్చాక నాకెందుకో నేను రాసిన నవల అంత పర్ఫెక్ట్ కాదని అనిపించింది. అందువల్ల నేను ఆ నవలను ఇంకా కొంచెం సరిదిద్ది దానికి 'మెరుపు' అని పేరు పెట్టాను. అది పబ్లిషింగ్ అయితే అవ్వలేదు. అలానే కడపలో ట్రిబుల్ ఐటీ చదువుతున్నప్పుడు ఒక పది నవలలు రాశాను. అవి అక్కడే కాలేజీ వెబ్సైట్లో అప్లోడ్ అయ్యాయి కానీ, బయట మాత్రం ఎక్కడ పబ్లిషింగ్ అవ్వలేదు. ఒక రెండు మూడు నవలలు ప్రతిలిపిలో అప్లోడ్ చేశాను ఆ తరువాత డిలీట్ చేశాను కూడా. నేను పబ్లిషింగ్ చేసిన మొదటి నవల మాత్రం బహుదా బతుకు కథలు. ఆ తరువాత కెమిస్ట్రీ, అనుకోకుండా నవలలు మాత్రమే. త్రొందర్లో ఇంకో నవల కూడా వస్తుంది. అది నేను మీకు తర్వాత చెప్తాను ఇప్పుడే రివిల్ చేయలేను.

5. నేను 'అనుకోకుండా' నవల చదువుతునప్పుడు నాకు ఒక ప్రశ్న మెదిలింది. ఏంటి అంటే మొదటగా మీరు ఈ నవలను ఎందుకు రాయాలి అనుకున్నారు? మీకు ఆ ఆలోచన ఎలా వచ్చింది?

నేను పని చేస్తున్న ఆఫీసు ఎదురుగా ఒక కన్స్ట్రక్షన్ బిల్డింగ్ ఉండేది. సాయంత్రం కాఫీ తాగడానికి వెళ్ళినప్పుడు ఆ బిల్డింగ్ ని చూస్తే ఆ బిల్డింగ్ పైనుంచి ఎవరైనా కింద పడితే ఎలా ఉంటుంది లేదా మనమే అక్కడ వెళ్లి కింద పడితే ఏమవుతుంది అని ఆలోచన వచ్చేది. ఇప్పుడు ఒక వ్యక్తి తనకు తాను కింద పడితే అది ఆత్మ హత్య అవుతుంది. అదే వేరే వాళ్ల ప్రమేయం ఉంటే అది హత్య అవుతుంది. ఆ హత్య చేస్తున్న సమయంలో ఎవరో తెలియని వ్యక్తి చూస్తే, అప్పుడు ఆ వ్యక్తి ఏం చేస్తాడు అనే ఆలోచన నుంచి పుట్టిందే ఈ నవల. అలానే నేను ఇందులో డాక్టర్ చంద్రశేఖర్ పాత్రని 'గుడ్ డాక్టర్' అనే వెబ్ సిరీస్ నుంచి తీసుకున్న పాత్ర. అందులో ఆయన చాలా ఇంటలిజెంట్. అలా ఇంటెలిజెంట్ గా ఉండే ఒక డాక్టర్ క్రైమ్ చేసినప్పుడు ఎలా చేస్తాడు. అందులోనుంచి అతను ఎలా బయటపడతాడు అనుకొని రాసిన నవల ఇది.

6. మీరు మొదటగా క్రైమ్ స్టోరీ లాగా రాయాలి అనుకున్నారా? ఫిలాసఫీతో రాయాలి అనుకున్నారా? లేదా ముందుగానే క్రైమ్, ఫిలాసఫీ రెండు కలిపి రాయాలి అనుకున్నారా?

మొట్టమొదటగా నేను చాలా వరకు ఎక్కువ క్రైమ్ స్టోరీలు, క్రైమ్ సినిమాలు చూడటం అలవాటు. ఆ అలవాటు వల్ల నాకు క్రైమ్ జోనర్ పైన చాలా మక్కువ ఉండేది. నేను మొదట క్రైమ్ స్టోరీనే తీయాలి అని అనుకున్నాను కానీ, క్రైమ్ రాస్తూనే ఇందులో ఒక ఫిలాసఫీ కలిపితే ఎలా ఉంటుంది అని ఆలోచన వచ్చింది. అంతకు మునుపే నేను క్రైమ్ అండ్ పనిష్మెంట్ నవల చదివాను. అందులో కూడా క్రైమ్ తో పాటు ఫిలాసఫీ చేర్చి రాశారు. ఆ విధంగా నేను కూడా ఈ నవలను రాయడం జరిగింది.

7. ఎవరైనా తప్పు చేసే ముందు ఎందుకు ఆలోచించకుండా చేస్తారు?

నేను దీనికి చాలా బెస్ట్ ఎగ్జాంపుల్ కూడా చెప్తాను, సైంటిఫిక్ గా కూడా ఉంటుంది. ఉదా: మనం న్యూటన్ 1st law ప్రకారం బంతిని ఎంత గట్టిగా కొడితే అంతే వేగంగా తిరిగి వస్తుంది. అలానే న్యూటన్ 2st lawలో మనం బలం ఉపయోగించనంత వరకు అది కదలదు. అలానే మనం తీసుకున్న

కథలో మొదట్లో మౌళికి ట్రాలీ ప్రాబ్లం లేదు, అతను ఒక ప్రేక్షకుడు మాత్రమే. కానీ ఎప్పుడైతే మౌళి ట్రోలి ప్రాబ్లంలోకి వెళ్తాడో ఖచ్చితంగా ఒక డిసిషన్ తీసుకోవాల్సి వచ్చింది. అలానే ప్రతి ఒక్కరికీ ఒకానొక సందర్భంలో ఆలోచించే ఆలోచనలు మారిపోతాయి. కచ్చితంగా వాడికి రెండే దారులు ఉంటాయి. ఆ సమయంలో తనకోసమే ఆలోచిస్తాడు కానీ, తప్పు ఒప్పు అని ఆలోచించలేకపోతాడు.

8. చెడ్డవాడిని సైతం కాపాడే గుణం ఉన్నవాడికి తనకు కష్టం వస్తే స్వార్థంగా ఎందుకు మారుతాడు? ఆ విధంగా మారడానికి గల కారణం ఏమై ఉండొచ్చు?

ఒక్క మాటలో చెప్పాలంటే మనం రాసుకున్న సిద్ధాంతలే మనలను మంచివాడిగా, చెడ్డవాడిగా మారుస్తుంది. ఉదా: ఒక పెళ్లైన అమ్మాయికి ఒక అబ్బాయి స్నేహితుడిగా ఉండటం అనేది చాలా వరకు తనని తప్పుగా చూస్తారు. అదే పెళ్లయిన అబ్బాయికి ఒక అమ్మాయి స్నేహితురాలిగా ఉంటే మాత్రం దాన్ని ఎవరూ అంత గట్టిగా ఆలోచించరు, దాన్ని లెక్క కూడా చేయరు. ఎందుకంటే ఇక్కడ మనుషుల యొక్క పర్స్పెక్టివ్ అనేది మారుతూ ఉంటుంది. వాళ్ళకి వాళ్ళు ఎప్పటినుంచో రాసుకున్న సిద్ధాంతాలు అవే వాళ్లని ముందుకు తీసుకోని వెళ్తాయి. ఎలా అయితే ఒక అమ్మాయి అబ్బాయితో తిరగకూడదని అబ్బాయి అమ్మాయితో తిరిగిన ఎలాంటి ప్రాబ్లం ఉండదని. ఇక్కడ ఎవరు తిరిగినా ఎవరు తిరగకపోయినా అబ్బాయి అనేవాడు అమ్మాయి పక్కనే కదా ఉండేది కానీ, అది ఎవరు ఆలోచించరు.

అలాగే నేను చెప్పింది నిజమని నువ్వు నమ్మితే కచ్చితంగా నువ్వు నమ్మిన సిద్ధాంతం అనేది తప్పు అవుతుంది. కాబట్టి, నేను చెప్పింది నిజం అయిన దాన్ని ఒప్పుకోలేకపోతావ్. ఒప్పుకుంటే నీ చుట్టూ ఉన్న వాళ్లు నిన్ను ఏమంటారో అని ఒక భయం వేస్తుంది. ఆ భయాన్ని క్రియేట్ చేసింది సమాజం. ఆ సమాజానికి ఎదురు తిరిగి నిలబడలేక సమాజానికి తల వంచి బతికేస్తూ ఉంటాడు.

9. మనసాక్షి ఉంటే నేరం చేసిన వెంటనే పశ్చాత్తాపం చెందుతాడు కానీ, మనసాక్షి లేని వాడికి పశ్చాత్తాపం వర్తించదు కదా! మరి అలాంటి వారికి శిక్ష ఎప్పుడు పడుతుంది?

మనసాక్షి ఉంటే ముందుగానే గిల్టీ ఫీల్ అవుతాడు. అది లేని వాడు నేను చేసింది కరెక్ట్ అనే ఫీల్ అవుతాడు. అలాంటి వాడు మర్డర్ చేసిన కరెక్టే చేయకపోయినా కరెక్టే అని అనుకుంటాడు. మనం ఏమి చేసినా 'హీ డోంట్ హేవ్ ఎనీ ట్రీట్మెంట్'. మనకు ఒక కామన్ సెన్స్ ఉంటుంది. దానికి మేధావితనం అవసరం లేదు. మనకు చాలా విషయాలు క్రైమ్ అని తెలిసిన సరే చేస్తాం ఎందుకంటే, అవసరం కాబట్టి చేయక తప్పదు. ఉదా: బయట ఒక అమ్మాయిని చూసి ఏదో కామెంట్ చేశావ్ అప్పుడు నీకు అది తప్పు అనిపించదు. అదే బయటి వాళ్ళు మీ చెల్లి లేదా అక్కని ఏడిపిస్తే అప్పుడే కదా నీవు చేసింది తప్పు అని అర్థం అవుతుంది. అలా ఏదైనా మన వరకు వస్తే తప్ప పశ్చాత్తాపం పొందలేరు.

10. ఒక మంచి పని చేయడానికి చిన్న తప్పు చేయడం ఎంత వరకు కరెక్ట్ అని నమ్ముతున్నారు?

భేదం ఉంటేనే కదా చిన్న తప్పు, పెద్ద తప్పు అవుతుంది, భేదమే లేకపోతే నువ్వు చేసేది తప్పు అన్నట్టేగా. నీకు ఒకటి చిన్నది, పెద్దది అనేది ఎప్పుడు వస్తుంది అంటే, తప్పు అని తెలిసిన ఆ తప్పుని సమర్థించడానికి అంతకంటే పెద్ద తప్పుని ఉదాహరణగా తీసుకున్నప్పుడు పెద్దది, చిన్నది అనే తేడా వస్తుంది. కానీ, ఆ విషయాన్ని ఇంకో దానితో విభేదించకపోతే నువ్వు చేసింది తప్పే అవుతుంది కదా! అంతేనా.

11. మన భారత దేశంలో ఎన్నో రకాల మతాలు వాళ్ళు, కులాల వాళ్ళు నివసిస్తున్నారు. కానీ, సమాజంలో ఎక్కడ చూసిన మతం, కులం అని కొట్టుకుంటున్నారు. మనుషులకు మతము అనేది అవసరమా? ఈ మతం ఎంత వరకు ఆవసరం అవుతుంది అనేది మీరు ఏమైనా చెప్పగలరా? అలాగే దేవుడు ఉన్నాడు లేదు? అనే దాని మీద మీ అభిప్రాయం ఏమిటి?

విశ్వాసం, నమ్మకం అనేవి రెండు వేరు వేరు మనస్తత్వాల మధ్య ఆధారపడి ఉంటుంది. నేను మీ నమ్మకాన్ని ప్రశ్నించగలను కానీ, విశ్వాసం అనేది వ్యక్తిగతమైనది. ఉదా: మా అమ్మ ప్రతి శుక్రవారం గుడికి వెళుతుంది. ఏదో ఒక రోజు నన్ను కూడా గుడికి రా అని పిలిచింది అనుకో, నాకు మా అమ్మ అంటే ప్రేమ కాబట్టి నేను తన కోసం గుడికి వెళ్తాను. తను 100 ప్రదక్షిణాలు చేయమన్నా చేస్తాను. దాని వల్ల పర్యావరణానికి బాధ కలగదు కదా! ఇక్కడ నాకు మా అమ్మ పైన ఉన్నది ప్రేమ అక్కడ నేను దేవుడు, దయ్యం అని చూడను. అది నమ్మకం అయిన మూఢనమ్మకం అయిన నేను పట్టించుకోను. బయటవాళ్లు నన్ను ఇంత చదువుకొని గుడికి వెళ్లడం ఏంటి అని చులకన చేసిన వాళ్లతో నాకు అవసరం లేదు. ఎందుకంటే మా అమ్మ నమ్మకానికి నేను ఆరోజు అజ్ఞానంలో ఉండటానికి ఇష్టపడతాను.

అలానే దేవుడి విషయంలో కూడా దేవుడు లేదు అని చెప్పలేను కానీ, మనకు తెలియని ఏదో ఒక ఫోర్స్ ఉందని నేను అనుకుంటున్నాను. సైన్స్ పరంగా ఒక బాహ్య శక్తి ఉంది అంటారు, సైన్స్ తెలియని వాళ్లు దేవుడు అని అంటారు.

నేను ఎప్పటి వరకు దాన్ని ఫాలో అవుతానంటే నమ్మకం అనే పేరుతో సమాజానికి ఎప్పుడైతే చెడు జరుగుతుందో ఆ నమ్మకాన్ని నేను వ్యతిరేకిస్తాను. ఆ నమ్మకాన్ని నిర్మూలించడానికి నా వంతు ప్రయత్నం నేను చేస్తాను.

12. మీరు ఈ నవల రాసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు కలిగినయా?

అలా నాకు ఎప్పుడు ఇబ్బంది కలగలేదు. నాకు చాలా మంచి పబ్లిషర్స్ దొరికారు. బహుదా బతుకు కథలు మరియు అనుకోకుండా రెండూ అన్వీక్షికి పబ్లిషర్స్ ప్రచురించారు. ఇంకా కెమిస్ట్రీకి గౌరవనీయ రచయిత్రి సంపాదకురాలు కడలి సత్యనారాయణ సొంత ప్రచురణ సంస్థ ద్వారా ప్రచురితం అవడం జరిగింది. చెప్పాలంటే నేను ఈ నవల చాలా త్వరగా రాశాను. కేవలం ప్రింటింగ్ ఒకటే లేట్ అయింది. ఆ ఖాళీ సమయంలోనే కెమిస్ట్రీ రాశాను అంతే. ఇక్కడ ట్విస్ట్ ఏంటి అంటే మొదట రాసిన 'అనుకోకుండా' కంటే తరువాత రాసిన 'కెమిస్ట్రీనే' మొదట పబ్లిషింగ్ అయింది.

13. మీరు బాహుదా బతుకు కథలు, కెమిస్ట్రీ మరియు అనుకోకుండా ఇలా మూడు నవలలు వేరే వేరే ప్రక్రియలో రాశారు? సాధారణంగా చాలా మంది రచయితలు కానీ కవులు కానీ వాళ్ల గుర్తింపు కోసం ఒకే ప్రక్రియలో రాయడం చూస్తాం. కానీ మీరు వేరే వేరే ప్రక్రియ ఎంచుకోవడానికి కారణాలు ఏమైనా ఉన్నాయా?

చాలా వరకు నాకు కొత్తగా రాయడం ఇష్టం. ప్రతిసారీ నా కథలో సృజనాత్మకత, కొత్తదనం ఉండటానికి ప్రయత్నిస్తుంటాను. బహుదాలో ఒక చిన్న చిన్న 20 కథలు ఉంటాయి. మళ్ళీ కెమిస్ట్రీ లో చూస్తే కెమికల్ రియాక్షన్ బట్టి అక్కడ స్టోరీని నడిపించాను. అంటే హైడ్రోజన్ అని ఒక కెమికల్ ని కథలో ఒక అధ్యాయంగా పెట్టి హైడ్రోజన్ చాలా లైట్ గా ఉంటది కాబట్టి ఆ కథలోని పాత్రలు కూడా అలానే ప్రవర్తిస్తుంటాను. ఇలా కొత్త కొత్తగా రాయడం వల్ల పాఠకులకి కూడా మంచి అనుభూతి వస్తుంది అని నా అభిప్రాయం.

14. నవలలు రాయడంలో ప్రదేశాలను, పాత్రలను ఏ విధంగా ఎంపిక చేసుకుంటారు?

నా రచన విధానం ఒక నిర్దిష్ట పద్ధతిలో ఉంటుంది. ఒక కాలి నోట్ బుక్ తో మొదలుపెట్టి చెప్పాలనుకున్నది రాసుకుంటాను. పాత్రల రూపురేఖలను గీసుకొని, వారి నేపథ్యాన్ని ప్రతిబింబించే పేర్లు పెడతాను, ప్రదేశాల గురించి ఆలోచిస్తా మరియు కథను నడిపించే భావోద్వేగ అంశాలను గుర్తిస్తాను. ప్రతి పాత్రలోను ఏదో ఒక ప్రత్యేకత ఉండేలా చూసుకుంటాను. ఇంతలా పరిశీలంచడం అనేది చాలా సంవత్సరాల తరబడి సాహిత్యం చదవడం జీవితాన్ని నిశితంగా పరిశీలించడం వల్ల వచ్చింది. సన్నివేశాలను భావాలను ఊహించుకోవడంలో సినిమా కూడా ఒక పాత్ర పోషిస్తుంది. సినిమాల్లో కథలు రాయడం వల్ల అది ఇక్కడ నవలలు రాయడంలో ఎంతో ఉపయోగపడిందని నేను అనుకుంటున్నాను.

15. నేడు ఒక వ్యక్తి ఎదుగుతున్నాడు అని చెప్పిన, కిందకి పడిపోయాడు అని చెప్పుకున్న దానికి ముఖ్య కారణం కుటుంబ సహకారమే? మీ కుటుంబంలో అలా మిమ్ములను ప్రోత్సహించిన వారు ఎవరు?

నాకు మా నాన్న,అమ్మ చాలా బాగా సపోర్ట్ చేస్తారు. నా శక్తి సామర్థ్యాల గురించి మా నాన్నకు చాలా బాగా తెలుసు. అందుకే ఎప్పుడైనా సరే నన్నీ ఏ మాట అనేవారు కాదు, నాకు నచ్చింది చేసేవాడిని. ఇప్పటికీ కూడా ఎప్పుడైనా ఫోన్ చేస్తే నీకు ఎలాంటి ఇబ్బంది కలిగిన ఇంటికి వచ్చేసేయ్ మళ్లీ ఇంకో కొత్త లైఫ్ స్టార్ట్ చేయొచ్చు అనేవారు తప్ప అడ్డు మాత్రం ఎప్పుడు చెప్పలేదు, ఇబ్బంది కూడా పెట్టేవాడు కాదు. మా ఫ్యామిలీ సపోర్ట్ ఉంది కాబట్టే ఇక్కడి వరకు వచ్చాను.

16. మీరు కూడా ఎప్పుడైనా ఈ ఎర్ర వలయం(red circle)లో చిక్కుకున్నారా?

నా సర్జరీ తరువాత నా జీవితాన్ని ఎటు వైపు తీసుకుపోవాలి అని వచ్చింది. అప్పుడు నేను తీసుకున్న డెసిషన్ వల్ల ఎలాంటి సమస్యలు రాలేదు కావున ఇప్పుడు ఏం అనుకోవట్లేదు కానీ, ఆ డెసిషన్ వల్ల తప్పు జరిగుంటే కచ్చితంగా బాధపడేవాడిని. ఇప్పుడు అనే కాదు ఎప్పుడైనా సరే ప్రతి ఒక్కరికీ ఇలాంటి సందర్భం వస్తుంది మళ్ళీ నాకు కూడా రావొచ్చు.

17. చివరిగా ఒక ప్రశ్న, మీరు ఈ నవల ద్వారా సమాజానికి ఏమి చెప్పాలనుకున్నారు?

నాకు ఒకరిని ఇలా ఉండండి అలా ఉండండి అని చెప్పడం ఇష్టం ఉండదు. నువ్వు నీలాగే ఉండు కానీ, నీ వల్ల వేరే వాళ్ళని ఇబ్బంది పెట్టకు. వాడు మంచోడు కాదు చెడ్డోడు అని చెప్పడం నాకు నచ్చదు. ఈ నవల చదివిన అంతా మాత్రాన 100 కి 100 మంది ఎవరూ మారలేరు కానీ, ఇది చదివిన వాళ్లకు "మనషులు ఎందుకు ఇలా మారుతారు" అని ఒక విచక్షణ జ్ఞానం తెలుస్తుంది అదే నా ప్రయత్నం.

ఇంటర్వ్యూయర్: ఎం.ఏ. తెలుగు విద్యార్థి
నిజాం కళాశాల

సామాజిక మాధ్యమాలలో తెలుగు భాషా వినియోగం

మ్యాడం అభిలాష్

ప్రస్తుత డిజిటల్ యుగంలో కమ్యూనికేషన్ విధానాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒకప్పుడు పత్రికలు, పుస్తకాలు, రేడియో వంటి పరిమిత మాధ్యమాల ద్వారా మాత్రమే భాష వ్యాప్తి చెందేది. కానీ ఇప్పుడు సోషల్ మీడియా అనే విస్తృత వేదిక ద్వారా భాష ప్రతిరోజూ ఒక కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. ముఖ్యంగా తెలుగు భాష విషయంలో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, బ్లాగింగ్ వంటి వేదికలు ఒక్కొక్కటి వేర్వేరు వయస్సు గల పాఠకులను, వినియోగదారులను కలిగి ఉంటాయి. అందువల్ల వీటిల్లో వాడే భాష కూడా ఒకే విధంగా ఉండదు.

సోషల్ మీడియాలో కంటెంట్ తయారు చేసే వ్యక్తులు భాషా స్వచ్ఛతను కాపాడడం కన్నా పాఠకుడికి అర్థమయ్యే విధంగా భావాన్ని వ్యక్తీకరించడం పైన్నే దృష్టి సారిస్తారు. కాబట్టి భాష ఇక్కడ ఒక సాధన ol)గా మాత్రమే పనిచేస్తుంది. మార్కెటింగ్ అవసరాలు, వినియోగదారుల మనస్తత్వం, ట్రెండ్స్, వైరల్ కల్చర్ వంటి అంశాలు భాషా రూపాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో తెలుగు భాష ఎలా మారుతోంది?, ఒక కంటెంట్ రైటర్ దాన్ని ఎలా వినియోగిస్తున్నాడు? అనే అంశాలను ఈ వ్యాసంలో పరిశీలించడం జరిగింది.

1. సోషల్ మీడియా వేదికల స్వభావం భాషా వినియోగం

సోషల్ మీడియాలో ప్రతి వేదికకు ఒక ప్రత్యేకమైన వినియోగదారుల సమూహం ఉంటుంది. ఉదాహరణకు ఫేస్‌బుక్ లో సాధారణంగా 30 సంవత్సరాల వయస్సు పైబడిన వ్యక్తులు ఎక్కువగా ఉంటారు. వీరు దీర్ఘమైన పోస్టులను చదవడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. అందువల్ల ఫేస్‌బుక్‌లో వాడే భాష సంపూర్ణ తెలుగు వాక్య నిర్మాణంతో, కొంత సాహిత్య గుణాన్ని కలిగి ఉంటుంది. ఉదాహరణకు ఒక కథను చెప్పేటప్పుడు వివరంగా, భావోద్వేగపూరితంగా రాయడం ఇక్కడి పాఠకులను ఆకర్షిస్తుంది.

పాఠకుడిని వీడియో చివరి వరకు పట్టుకోవడం ప్రధాన లక్ష్యం కావడంతో భాషలో ఒక రకమైన ఉత్సాహం, చురుకుదనం ఉంటుంది.

బ్లాగ్ లేదా వర్డ్‌ప్రెస్ వంటి వేదికలలో మాత్రం విశ్లేషణాత్మక భాషను ఉపయోగిస్తారు. ఇక్కడ పాఠకులు కొంత సమయం తీసుకుని చదువుతారు కాబట్టి సామాజిక సమస్యలు, విశ్లేషణలు, గణాంకాలు వంటి అంశాలతో కూడిన గంభీరమైన భాషను కూడా ఉపయోగించవచ్చు.

2. సోషల్ మీడియాలో భాషా భిన్నత్వం కొన్ని ఉదాహరణలు

సోషల్ మీడియా వేదికలలో భాష ఎలా మారుతుందో అర్థం చేసుకోవడానికి ఒకే కంటెంట్‌ను ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్ రెండింటికీ వేర్వేరుగా ఎలా రాయబడుతుందో పరిశీలించడం అవసరం. సోషల్ మీడియా కంటెంట్ రైటర్‌గా నేను పని చేస్తున్న కంపెనీలో రాసిన కొన్ని స్క్రిప్ట్స్ ను ఉదాహరణలుగా తీసుకొని వివరించడం జరిగింది. ఈ ఉదాహరణలు వివిధ మాధ్యమాలకు అనుగుణంగా భాష ఎలా మారుతుందో స్పష్టంగా తెలుపుతాయి.

2.1 ఇన్‌స్టాగ్రామ్

ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధానంగా యువత ఎక్కువగా ఉండటంతో, ఇక్కడి భాష సాధారణంగా చిన్న చిన్న వాక్యాలు, ఆకర్షణీయమైన పదాలు, ఆంగ్ల పదాల కలయికతో ఉంటుంది. క్రింది ఉదాహరణలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది.

(మూలం : https://www.instagram.com/talradiotelugu/)



ఇన్స్టాగ్రామ్‌లోని యువత తక్కువ చదివి ఎక్కువ సమాచారం తెలుసుకోవాలనే ప్రయత్నంలో ఉంటారు కాబట్టి. ఇక్కడి భాష చిన్న చిన్న వాక్యాలుగా రాయబడి, ఆకర్షణీయంగా ఉంటుంది.

2.2 ఫేస్ బుక్



"వయసు 13 ఏళ్లు, చదువుతున్నది 7వ తరగతి.. సఅష్టించిన టెక్నాలజీ మాత్రం ప్రపంచ స్థాయి నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది! హైదరాబాద్‌కు చెందిన రాజా ధర్మతేజ్ మద్దాల, 'Raja MagRex AI' అనే వినూత్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్‌ను తయారు చేసి, టెక్ ప్రపంచంలో ఇప్పుడు సెన్సేషన్ గా మారిపోయాడు. ఈ సిస్టమ్‌లో NEURA అనే కోఆర్డినేషన్ సెంటర్ ఉంటుంది. ఉదాహరణకు, ఒక నగరం వాయు కాలుష్యా (Air Pollution) తగ్గించాలనుకుంటే

ఇది ఎలా చేస్తుంది?

1. కాలుష్యం జరగడానికి గల రీజన్స్ ను గుర్తిస్తుంది.

2. ట్రాఫిక్ Traffic Patterns విశ్లేషిస్తుంది.

3. వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తుంది.

4. గవర్నమెంట్ Policiesను పరిశీలిస్తుంది. చివరగా, వీట్నింటినీ కలిపి పర్ఫెక్ట్ సొల్యూషన్స్ ను సూచిస్తుంది.

స్కూల్ అసైన్‌మెంట్లు, పరీక్షల ఒత్తిడిలో ఉంటూనే, కోడింగ్, రీసెర్చ్‌పై ఉన్న ఇష్టంతో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశాడు రాజా. "ఉ× అనేది మనిషిని రీప్లేస్ చేయడానికి కాదు, మనిషి ఆలోచనలకు సహకరించడానికి ఉండాలి" అంటూ ఈ కుర్రాడు చెబుతున్న మాటలు ఇప్పుడు ప్రెజెంట్ జెనరేషన్ కు ఒక సరికొత్త పాఠాలుగా మారాయి!"

(:https://www.facebook.com/TALRadioTelugu/)

ఇక్కడి పాఠకులు కొంత ఓపికతో ఉండి, చదివి, ఎక్కువ విషయాలు తెలుసోవాలనే ప్రయత్నంలో ఉంటారు కాబట్టి, ఇక్కడి భాష సరళంగా, కొంత విస్తృతంగా ఉండి, ఎక్కువ సమాచారం ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

2.3 యూట్యూబ్:

యూట్యూబ్ వీడియోలలో సంభాషణాత్మక శైలి ముఖ్యంగా ఉంటుంది. ప్రేక్షకులను వీడియో చివరి వరకు నిలిపి ఉంచడానికి కథనం, ప్రశ్నలు వంటి అంశాలు ఉపయోగిస్తారు. కింది ఒక వీడియో స్క్రిప్ట్ ను పరిశీలించవచ్చు.

'పుస్తకం చదివితే.. జైలు శిక్ష తగ్గింపు!

voice over 1: సాధారణంగా జైలు అంటే మనకు ఏం గుర్తొస్తుంది? నాలుగు గోడలు, కఠినమైన శిక్షలు, చీకటి గదులు.. కదా! కానీ, ఈ దేశం మాత్రం జైలును కేవలం జైలులా కాకుండా, ఒక మనిషిని మార్చే లైబ్రరీగా మార్చేసింది. అవును, మీరు వింటున్నది నిజం! అక్కడ ఖైదీలు పుస్తకాలు చదివితే చాలు.. వారి జైలు శిక్ష తగ్గిపోతుంది. వినడానికి వింతగా ఉన్నా, ఇది అక్షరాలా నిజం. ఇంతకీ ఏంటా దేశం? ఏంటీ దాని స్టోరీ... ఈరోజు వీడియోలో తెలుసుకుందాం!

Anchor part 1: అక్షరమే పునాదిగా.. సామాన్యులను అసామాన్యులుగా, నేరస్థులను నీతిమంతులుగా మార్చిన చరిత్ర... పుస్తకాల సొంతం. వ్యక్తిత్వ నిర్మాణంలో అక్షరం పోషించే పాత్ర అపారం. సరిగ్గా ఇదే సూత్రాన్ని నమ్మింది 'బ్రెజిల్' దేశం. 2012 నుంచి అక్కడ ఒక వినూత్నమైన చట్టం అమల్లో ఉంది. అదేంటంటే.. ఖైదీలు పుస్తకాలు చదివి, వాటిపై చక్కని రివ్యూస్ రాస్తే, వారి శిక్షా కాలాన్ని తగ్గిస్తారు. ఒక మనిషిలో మార్పు కత్తులతో కాదు, కలంతోనే సాధ్యమని ఆ దేశం నిరూపిస్తోంది.

voice over 2: అసలు ఈ లెక్క ఎలా ఉంటుందో తెలుసా? ఒక ఖైదీ ఒక పుస్తకాన్ని పూర్తి చేసి, దానిపై రివ్యూ రాస్తే.. అతనికి నాలుగు రోజుల జైలు శిక్ష తగ్గుతుంది. అలా ఏడాదికి గరిష్టంగా పన్నెండు పుస్తకాల వరకు చదువుకునే వెసులుబాటు ఉంటుంది. అంటే.. ఒక ఖైదీ శ్రద్ధగా చదివితే, ఏడాదికి ఏకంగా 48 రోజుల శిక్షను తగ్గించుకోవచ్చు అన్నమాట! ఇది ఆ ఖైదీకి తన తప్పును తెలుసుకుని, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి దొరికిన ఒక అద్భుతమైన అవకాశం కదూ!

voice over 2: అయితే, ఇక్కడో కండిషన్ కూడా ఉందండోయ్! ఏ పుస్తకం పడితే ఆ పుస్తకం చదవడానికి వీల్లేదు. సాహిత్యం, సైన్స్, లాజిక్ వంటి పుస్తకాలను అధికారులే ముందుగా ఎంపిక

చేస్తారు. వాటిని మాత్రమే ఖైదీలకు ఇస్తారు. ఖైదీలు రాసిన రివ్యూస్ ను అధికారులు, మానసిక నిపుణులు క్లియర్‌గా చదువుతారు. ఆ పుస్తక ప్రభావంతో ఖైదీ ఆలోచనల్లో, ప్రవర్తనలో నిజంగా మార్పు వచ్చిందని వాళ్లు భావిస్తేనే.. శిక్షా కాలాన్ని తగ్గిస్తారు. అంతేకాదు, ఆ ఖైదీ జైలు నుంచి బయటకు వచ్చాక గౌరవంగా బతకడానికి అవసరమైన ఉపాధి మార్గాలను కూడా ప్రభుత్వం చూపిస్తుంది.

Anchor part 1: అక్షరమే పునాదిగా.. సామాన్యులను అసామాన్యులుగా, నేరస్థులను నీతిమంతులుగా మార్చిన చరిత్ర... పుస్తకాల సొంతం.

వ్యక్తిత్వ నిర్మాణంలో అక్షరం పోషించే పాత్ర అపారం. సరిగ్గా ఇదే సూత్రాన్ని నమ్మింది 'బ్రెజిల్' దేశం. 2012 నుంచి అక్కడ ఒక వినూత్నమైన చట్టం అమల్లో ఉంది. అదేంటంటే.. ఖైదీలు పుస్తకాలు చదివి, వాటిపై చక్కని రివ్యూస్ రాస్తే, వారి శిక్షా కాలాన్ని తగ్గిస్తారు. ఒక మనిషిలో మార్పు కత్తులతో కాదు, కలంతోనే సాధ్యమని ఆ దేశం నిరూపిస్తోంది.

Anchor part 2: అయితే, ఇక్కడో కండిషన్ కూడా ఉందండోయ్! ఏ పుస్తకం పడితే ఆ పుస్తకం చదవడానికి వీల్లేదు. సాహిత్యం, సైన్స్, లాజిక్ వంటి పుస్తకాలను అధికారులే ముందుగా ఎంపిక చేస్తారు. వాటిని మాత్రమే ఖైదీలకు ఇస్తారు. ఖైదీలు రాసిన రివ్యూస్ ను అధికారులు, మానసిక నిపుణులు క్లియర్ గా చదువుతారు. ఆ పుస్తక ప్రభావంతో ఖైదీ ఆలోచనల్లో, ప్రవర్తనలో నిజంగా మార్పు వచ్చిందని వాళ్లు భావిస్తేనే.. శిక్షా కాలాన్ని తగ్గిస్తారు. అంతేకాదు, ఆ ఖైదీ జైలు నుంచి బయటకు వచ్చాక గౌరవంగా బతకడానికి అవసరమైన ఉపాధి మార్గాలను కూడా ప్రభుత్వం చూపిస్తుంది.

Voice over 3: చూశారా! పుస్తకాలకు ఉన్న శక్తి ఎంతో! ఒక మనిషిని నేరస్థుడిగా చూడకుండా, అతన్ని ఒక విద్యావంతుడిగా మార్చడం ద్వారా సమాజంలో మళ్లీ బాధ్యతాయుతమైన పౌరుడిగా నిలబెట్టవచ్చు అని బ్రెజిల్ ప్రపంచానికి చాటి చెప్తోంది. చదువు మనిషిని వివేకవంతుడిని చేస్తుంది.. ఆ వివేకం నేరాన్ని అసహ్యించుకునేలా చేస్తుంది. అక్షరం నేర్పే ఈ పాఠం, ఏ శిక్షా నేర్పలేదు!

Conclusion: పుస్తకం ఒక మనిషి జీవితాన్ని పూర్తిగా మార్చగలదని చెప్పడానికి బ్రెజిల్ జైళ్లలో జరుగుతున్న ఈ మార్పే ఒక మంచి ఉదాహరణ. మరి ఈ వినూత్నమైన విధానం గురించి మీరేమనుకుంటున్నారు? మన దగ్గర కూడా ఇలాంటివి ఉంటే బాగుంటుందా?

మీ అభిప్రాయాన్ని కామెంట్లలో మాతో పంచుకోండి. ఈ ఇంట్రెస్టింగ్ వీడియో మీకు నచ్చితే వెంటనే లైక్ చేయండి, మీ ఫ్రెండ్స్‌తో షేర్ చేయండి. మరిన్ని ఇలాంటి అద్భుతమైన విషయాల కోసం మా ఛానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేయడం మర్చిపోకండి! మరో ఇంట్రెస్టింగ్ టాపిక్‌తో మళ్లీ కలుద్దాం. థ్యాంక్యూ!"

(మూలం: https://www.youtube.com/talradiotelugu)

ఇందులో వాయిస్ ఓవర్ భాగానికి సంబంధించిన మాటలు వస్తున్నప్పుడు ఆ కంటెంట్ కు సంబంధించిన వీడియోలు ప్లే అవుతూ ఉంటాయి. ఒక యాంకర్ నేరుగా వీడియోలో కనిపిస్తూ చెప్పేదే యాంకర్ పార్ట్ స్క్రిప్ట్. మొత్తంగా పరిశీలిస్తే... ప్రొఫెషనల్ గా తీసే యూట్యూబ్ వీడియోలలో భాష చాలా సరళంగా ఉండి, ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటూ ఉంటే ఎలా ఉంటుందో.. ఆ విధంగా ఉంటుంది.

2.4 వర్డ్ ప్రెస్:

WordPress వంటి బ్లాగింగ్ వేదికలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో పోలిస్తే విభిన్నమైన భాషా శైలిని ప్రోత్సహిస్తాయి. ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలలో సంక్షిప్త, సంభాషణాత్మక భాష ఎక్కువగా కనిపిస్తే, WordPressలో కొంత విస్తృతమైన, వివరణాత్మకమైన రచనా శైలిని పాటించాల్సి ఉంటుంది.

ఈ వేదికలో రచయితలకు విశ్లేషణాత్మకంగా, శాస్త్రీయంగా లేదా కథనాత్మకంగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే అవకాశం ఉంటుంది. అందువల్ల WordPressలో ఉపయోగించే తెలుగు భాష ఎక్కువగా సాంప్రదాయ రచనా శైలికి దగ్గరగా ఉంటుంది.

ఈ హాస్పిటల్ కి వచ్చే ప్రతి ఒక్కరికీ కడుపు నిండా భోజనం గ్యారెంటీ!

నిజానికి సేవ చేయాలన్న ఆలోచన చాలామందికి వస్తుంది, కానీ దానిని ఒక ఆశయంగా మార్చుకుని ఏళ్ల తరబడి

కొనసాగించడం మాత్రం కొందరికే సాధ్యం. కరీంనగర్ ప్రభుత్వ మెయిన్ హాస్పిటల్‌లో 'బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి' చేస్తున్న పనుల గురించి తెలిస్తే అక్షరాలా ఇదే నిజం అనిపిస్తుంది.

ఎన్నో సమస్యలతో ఆసుపత్రికి వచ్చే పేదవారికి మందులు ఎంత అవసరమో, కడుపు నిండా భోజనం కూడా అంతే అవసరం. మారుమూల గ్రామాల నుంచి వచ్చే అటెండెంట్లు బయట హోటల్‌లో ఒక్క పూట భోజనం చేయాలన్నా వందల రూపాయలు ఖర్చవుతాయి. అలాంటి వారికి ఇక్కడ ప్రేమతో వడ్డిస్తున్న ఈ అన్నం ఆకలిని తీర్చడం మాత్రమే కాదు, వాళ్ల ఆర్థిక భారాన్ని కూడా తప్పించి కొండంత అండగా నిలుస్తోంది.

ఇలా మొదలైంది...

కరీంనగర్ కు చెందిన రాచమల్ల ప్రసాద్ వ్యాపారం చేస్తుంటాడు. 30 మంది స్నేహితులూ, బంధువులతో కలిసి వాకింగ్ కు వెళ్లడం వీరికి అలవాటు... వీళ్లంతా కలిసి అప్పుడప్పుడు చిన్న చిన్న సహాయ కార్యక్రమాలు చేస్తుండేవారు. ఓరోజు వారు తీసుకెళ్లిన ఆహారం అక్కడి వారికి సరిపోక.. నిరాశతో వెళ్లిపోవడం వారి మనసును బాధపెట్టింది. అప్పుడు మొదలైంది... వీరి ప్రయాణం.. అలా ఆ ముప్పై మందీ కలిసి, 2023లో 'బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి'ని ఏర్పాటు చేశారు. ఇక అప్పటి నుండి హాస్పిటల్ దగ్గర పేదలకు కడుపునిండా భోజనం పెట్టడం రోజూ వారి కార్యక్రమంగా మలచుకున్నారు.

ప్రతిరోజు ఒకరి బాధ్యత కొన్ని రోజులకు వీరి టీంలోని సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.. అలా ఇప్పుడు 365 మందితో వీరి కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇంకా సభ్యులు చేరడానికి అవకాశం ఉన్నా.. సంవత్సరం పొడవునా.. ప్రతి రోజు ఒకరి వంతున భోజనం పెట్టాలన్న ఉద్దేశ్యంతో అక్కడి వరకే ఆపేశారట. డాక్టర్లు, టీచర్లు, లాయర్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా అన్ని రంగాల వాళ్ళూ ఈ టీంలో ఉండడం విశేషం. పతి రోజూ జరిగే ఈ అన్నదాన కార్యక్రమంలో కనీసం 30 మందైనా పాల్గొంటారట.

ఉచితంగా పెట్టే భోజనం ఏమంత రుచిగా ఉండకపోవచ్చు అనుకోకండి..! రోజూ రకరకాలైన ఆహార పదార్థాలను తయారు చేస్తారు. ఇంకా పండగలు, జాతరలు వంటి స్పెషల్ రోజులు వస్తే.. హాస్పిటల్ కు వచ్చిన వారు వాటిని మిస్ అవ్వకూడదని రకరకాల పిండి వంటలు కూడా చేసి పెడుతున్నారంటే.. ఆలోచించండి.. సమాజంపై వీరికి ఎంతటి గౌరవం ఉందో!

ఇక చివరగా ఒక్క మాట.. ఆకలి విలువ తెలిసిన వారు ఎవరూ ఇలాంటి పనులను చూసి ఊరికే ఉండలేరు. జబ్బులతో బాధపడుతున్న వారికి, ఆ రోగి కోసం ఆసుపత్రి దగ్గర పడిగాపులు కాస్తున్న వారికి.. వీళ్లు పెడుతున్న ఆహారం వారిపాలిట ఒక వరంగా మారింది.

ఇలాంటి రియల్ హీరోల గురించి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే! మనవంతుగా మనం ఇలాంటి వారికి చిన్న సాయం చేసినా లేదా ఇలాంటి కథలను పదిమందికి చేరవేసినా అదే ఒక పెద్ద సేవ అవుతుంది."

(మూలం:*https:/touchaliferadio.wordpress.com/)*

భాష పరంగా చూస్తే WordPressలో తెలుగు--ఇంగ్లీష్ మిశ్రమం తక్కువగా కనిపిస్తుంది. అయితే డిజిటల్ ప్రభావం ఇక్కడ కూడా పూర్తిగా లేకపోలేదు. కొన్నిసార్లు సాంకేతిక పదాలు లేదా ఆధునిక భావాలను వ్యక్తీకరించడానికి ఇంగ్లీష్ పదాలను ఉపయోగించడం జరుగుతుంది. దీనిని భాషలో సహజమైన పరిణామంగా పరిగణించవచ్చు.

మొత్తం మీద WordPress వేదికలో తెలుగు భాష వినియోగం ఒక సమతుల్య రూపంలో ఉంటుంది. అంటే సంప్రదాయ రచనా శైలి, ఆధునిక డిజిటల్ ప్రభావం రెండూ కలిసి కనిపిస్తాయి.

3. భాష కంటే భావవ్యక్తీకరణకు ప్రాధాన్యం

సోషల్ మీడియాలో పనిచేసే కంటెంట్ రైటర్ల అనుభవాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. అది ఏమిటంటే భాషా స్వచ్ఛత కంటే భావవ్యక్తీకరణ ముఖ్యమని భావించడం. ఒక సంస్థ సోషల్ మీడియాలో కంటెంట్ తయారు చేయడానికి తెలుగు కంటెంట్ రైటర్‌ను నియమించుకుంటే, ఆ సంస్థ ప్రధాన లక్ష్యం భాషను కాపాడటం కాదు. వారి ఉద్దేశం తమ ఉత్పత్తులను లేదా సేవలను ఎక్కువ మంది వినియోగదారులకు చేరవేయడం.

అందువల్ల కంటెంట్ రైటర్‌కు అవసరమైన ముఖ్య నైపుణ్యం ఏమిటంటే -- వినియోగదారుడు ఏ భాషలో అర్థం చేసుకుంటాడో ఆ భాషలోనే అతనితో మాట్లాడడం. అవసరమైతే తెలుగు వాక్యాలలో ఇంగ్లీష్ పదాలను కలపడం కూడా సహజమే.

ఉదాహరణకు "ఈ అవకాశాన్ని వదులుకోకండి" అనే వాక్యాన్ని సోషల్ మీడియాలో "ఈ క్రేజీ ఆఫర్ ని మిస్ అవ్వకండి" అని రాయడం ఎక్కువ ప్రభావం చూపవచ్చు.

ఇది భాషకు నష్టం కలిగిస్తుందా అనే ప్రశ్నకు సరళమైన సమాధానం ఇవ్వడం కష్టం. ఎందుకంటే భాష ఒక ప్రవహించే నది లాంటిది... కాలానుగుణంగా అది మారుతూనే ఉంటుంది. సోషల్ మీడియా కూడా ఆ మార్పుకు ఒక ముఖ్య కారణమనే చెప్పవచ్చు.

4. మార్కెటింగ్ రంగంలో తెలుగు కంటెంట్ రైటర్ పాత్ర

ప్రస్తుతం అనేక ఐటీ కంపెనీలు, మీడియా సంస్థలు తెలుగు కంటెంట్ రైటర్లను నియమించుకుంటున్నాయి. వారి పని కేవలం కథలు రాయడం మాత్రమే కాదు. సోషల్ మీడియా పోస్టులు, రీల్ స్క్రిప్ట్స్, యూట్యూబ్ వీడియో స్క్రిప్ట్స్, ప్రకటనల కాపీలు వంటి అనేక రకాల కంటెంట్ తయారు చేయాల్సి ఉంటుంది.

ఈ ప్రక్రియలో ఒక కంటెంట్ రైటర్ తన భాషను పరిస్థితికి అనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఒకే అంశాన్ని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ కోసం వేర్వేరు విధాలుగా రాయాల్సి వస్తుంది.

ఉదాహరణకు ఒక కథను ఫేస్‌బుక్‌లో కొంత విశదంగా రాస్తే, అదే కథను ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్న చిన్న వాక్యాలతో, ఆకర్షణీయమైన పదాలతో రాయాల్సి ఉంటుంది. యూట్యూబ్ స్క్రిప్ట్‌లో మాత్రం కథనం, ప్రశ్నలు, ఆసక్తిని పెంచే వాక్యాలతో రాయాలి.

అందువల్ల ఒక మంచి కంటెంట్ రైటర్‌కు భాషాపరిజ్ఞానం మాత్రమే సరిపోదు. సోషల్ మీడియా ట్రెండ్స్, వినియోగదారుల మనస్తత్వం, మార్కెటింగ్ వ్యూహాలు వంటి అంశాలపై కూడా అవగాహన ఉండాలి.

5. సోషల్ మీడియాలో తెలుగు భాష పరిణామం

సోషల్ మీడియా ప్రభావంతో తెలుగు భాషలో కొన్ని ముఖ్యమైన మార్పులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తెలుగు–ఇంగ్లీష్ మిశ్రమ భాష విస్తృతంగా ఉపయోగించబడుతోంది. ఇది కొంతమందికి భాషా కలుషితంగా అనిపించినా, మరికొందరికి ఇది సహజమైన పరిణామంగా కనిపిస్తోంది.

ఇది పూర్తిగా ప్రతికూలమైన మార్పు అని చెప్పలేము. ఎందుకంటే ఈ మిశ్రమ భాష ద్వారానే నేటి యువత సోషల్ మీడియాలో తెలుగులో కమ్యూనికేట్ చేస్తున్నారు. పూర్తిగా ఇంగ్లీష్‌లో రాయడం కన్నా కొంత తెలుగు కలిపి రాయడం వల్ల భాషకు ఒక సరికొత్త జీవం లభిస్తోంది. అదే సమయంలో సంప్రదాయ సాహిత్య భాష, పత్రికా భాష వంటి రూపాలు సోషల్ మీడియాలో అంతగా కనిపించకపోవడం గమనార్హం. అందువల్ల భాషా రూపాలు వేదికను బట్టి మారుతున్నాయి అని చెప్పవచ్చు.

ముగింపు

సోషల్ మీడియా ప్రపంచంలో తెలుగు భాష ఒక కొత్త దశలోకి ప్రవేశించింది. ఇది సంప్రదాయ భాషా శైలికి భిన్నంగా ఉన్నప్పటికీ, కమ్యూనికేషన్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్నట్లుగా పరిగణించాలి. ఒక తెలుగు కంటెంట్ రైటర్ తన భాషను స్థిరంగా ఉంచుకోలేదు; అతను పనిచేసే వేదిక, పాఠకుల వయస్సు, మార్కెటింగ్ లక్ష్యాలు వంటి అంశాలను బట్టి తన రచనా శైలిని మార్చుకోవాల్సి ఉంటుంది. అందువల్ల సోషల్ మీడియాలో తెలుగు భాషను పరిశీలించేటప్పుడు "భాష క్షీణిస్తోంది" అనే ఒక కోణంలో మాత్రమే చూడకుండా, "భాష కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారుతోంది" అనే దృక్పథంతో చూడడం అవసరం.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. అభిలాష్, మ్యాడం. (2025), వికీపీడియా – తెలుగు సాహిత్య వినియోగం, బోలిచేతో పబ్లికేషన్స్, నారాయణ్ ఖేడ్.

2. గణేష్, గొల్లపెల్లి. (2023), అంతర్జాలంలో తెలుగు భాషా సాహిత్యాలు, సెల్ఫ్ పబ్లిషింగ్, ధర్మపురి.

3. తిరుపతి, బొల్లం. మాస్ కమ్యూనికేషన్ ఇన్ ఇండియా, లోగిలి బుక్ హౌస్, గుంటూరు.

4. రాధాకృష్ణ, బూదరాజు. (2013), జర్నలిజం పరిచయం, విశాలాంధ్రా పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

5. లక్ష్మణరెడ్డి, వి. (2002), తెలుగు జర్నలిజం, అవతరణ – వికాసం, రచన జర్నలిజం కళాశాల, హైదరాబాదు

6. వానుదేరాజు, కంచి. (2015), తెలుగు పత్రికారంగం, లోగిలి బుక్ హౌస్, గుంటూరు.

T

సాహిత్య
పరిశోధన

ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి సంపాదకీయ వ్యాసాల విశ్లేషణ

గంధం నరేందర్

పరిశోధన పత్ర సంక్షిప్తి:

తెలుగు పత్రికా చరిత్రలో సంపాదకీయానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. పత్రికను చేతిలోకి తీసుకున్న ప్రతి పాఠకుడూ ముందుగా వెతుక్కునేది సంపాదకీయాన్నే. ఎందుకంటే సంపాదకీయం పత్రికకు ప్రాణం. అది పత్రిక యొక్క అధికారిక స్వరం, దాని మనస్సు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే దాని వెనుక ఉన్న నిజాన్ని, దాని ప్రభావాన్ని, దాని నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠాన్ని చెప్పేది సంపాదకీయమే. సంపాదకీయం కేవలం సంఘటనలను వివరించడం కాదు అది విశ్లేషించడం, అర్థం చెప్పడం, మార్గం చూపించడం. ఒక మంచి సంపాదకీయం పాఠకుడిని ఆలోచింపజేస్తుంది, చైతన్యవంతుడిని చేస్తుంది, సమాజాన్ని మేల్కొలుపుతుంది.

ఈ నేపథ్యంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు తెలుగు పత్రికారంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించారు. దాదాపు 55 సంవత్సరాలకు పైగా వివిధ పత్రికలకు సంపాదకులుగా, కార్యనిర్వాహకులుగా, వ్యవహరిస్తూ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలకు అమూల్యమైన సేవలు అందించారు. వారి సంపాదకీయ వ్యాసాలు ఆధ్యాత్మికత, ధర్మం, సమాజ సేవ, జాతీయత, దేశభక్తి వంటి అనేకానేక అంశాలను స్పృశించాయి. ఈ వ్యాసం కసిరెడ్డి గారి సంపాదకీయ వ్యాసాలను వివిధ కోణాల్లో విశ్లేషించడానికి ఉద్దేశించబడింది.

కీలక పదాలు: *కసిరెడ్డి వెంకటరెడ్డి, సంపాదకీయం, ఆధ్యాత్మికత, ధర్మం, సాహిత్యం, సంస్కృతి, సమాజం.*

పరిచయం:

కసిరెడ్డి వెంకటరెడ్డి అంటే ఒక పేరు మాత్రమే కాదు. అది ఒక చైతన్యం, ఒక తపన, ఒక ధ్యేయం. 1946లో వ్యాసపౌర్ణమి నాడు పాలమూరు జిల్లా పోలెపల్లి గ్రామంలో జన్మించిన ఆయన చిన్నతనంలోనే తండ్రి మేఘారెడ్డి గారి ద్వారా పద్యాలను, భజనలను, కీర్తనలను నేర్చుకున్నారు. ఆ పసితనపు సంస్కారమే తర్వాతి కాలంలో ఆయన రచనలకు, ఉపన్యాసాలకు, సంపాదకీయాలకు పునాదిగా నిలిచింది. వ్యవసాయ కుటుంబంలో పుట్టి, నాగలి పట్టి పొలం దున్నిన ఆయన చదువుపట్ల ఉన్న తపనతో పాఠశాలకు వెళ్లారు. కల్వకుర్తి ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు గ్రంథాలయంలో గడిపిన గంటలు, తోటి విద్యార్థులకు కథలు చెప్పడం ఇవన్నీ ఆయన వక్తృత్వ ప్రతిభకు, రచనా నైపుణ్యానికి మొదటి మెట్లు. 'కథలరెడ్డి'గా పేరుపొందిన ఆయన ఆనాడే తనలోని సాహిత్య సృజనను వెలికితీసుకోవడం ప్రారంభించారు. ఈ నేపథ్యమే ఆయన సంపాదకీయ రచనలకు అంతిమంగా దారితీసింది.

విషయ విశ్లేషణ:

కసిరెడ్డి గారి సంపాదకీయ ప్రస్థానం 1967లో 'వార్తలు – విశేషాలు' అనే గోడపత్రికతో మొదలైంది. అప్పటి నుండి నేటి వరకు అది నిరంతరం సాగుతూనే ఉంది. ఆయన సంపాదకత్వం వహించిన పత్రికలలో ముఖ్యమైనవి – గీతాజ్ఞాన యోగ సమాచార్ (సుమారు 26 సంవత్సరాలు), శివానంద భారతి (ప్రారంభం నుండి నేటివరకు), విశ్వహిందు (25 సంవత్సరాలు), ధర్మసారథి, పుష్పగిరి భారతి, సాధన, సాహితీ స్రవంతి.

ఈ పత్రికలన్నీ ఆయన సంపాదకత్వంలో కొత్త ఒరవడిని సంతరించుకున్నాయి. ఆయన సంపాదకీయాలు ఎప్పుడూ సజీవంగా, స్పందనశీలంగా ఉండేవి. ఏ విషయాన్ని తీసుకున్నా దాన్ని సమగ్రంగా విశ్లేషించి, పాఠకులకు స్పష్టంగా అర్థమయ్యేలా రాసేవారు. ఆయన సంపాదకీయాల ప్రత్యేకత ఏమిటంటే అవి కేవలం సంపాదకుని అభిప్రాయాలను మాత్రమే కాకుండా పత్రిక యొక్క దృక్పథాన్ని, ఆయన జీవితంలో నిండి ఉన్న దేశభక్తిని, సంస్కృతి పట్ల గౌరవాన్ని, ధర్మం పట్ల నిబద్ధతను ప్రతిబింబించాయి.

కసిరెడ్డి గారి సంపాదకీయాలను విషయ ప్రాధాన్యాన్ని బట్టి పలు విధాలుగా వర్గీకరించుకోవచ్చు.

మొదటిది ఆధ్యాత్మిక అంశాలు. వారి సంపాదకీయాల్లో ఆధ్యాత్మికతకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. కానీ ఆయన ఆధ్యాత్మికతను కేవలం దేవాలయానికి, పూజకు పరిమితం చేయలేదు. ఆయన ఆధ్యాత్మికతను సమాజ జీవితంతో ముడిపెట్టారు. 'గీతాజ్ఞాన యోగ సమాచార్' పత్రికలో వచ్చిన

ఒక సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు "అవతారాలన్నీ ధర్మరక్షణకే. శ్రీరాముడు ధర్మాన్ని నిలబెట్టాడు, శ్రీకృష్ణుడు ధర్మాన్ని బోధించాడు. వారి జీవితాలు మనకు ఒక పాఠం- ధర్మం కోసం పోరాడాలి, అన్యాయాన్ని ఎదుర్కోవాలి." ఇక 'శివానంద భారతి'లో వచ్చిన 'ధర్మరక్షణ-దేశరక్షణ' అనే సంపాదకీయంలో ఆయన ఇంకా స్పష్టంగా చెప్పారు "ధర్మాన్ని కాపాడుకోవడమే దేశాన్ని కాపాడుకోవడం. ధర్మం బలహీనపడితే దేశం బలహీనపడుతుంది. ధర్మాన్ని రక్షించుకోవడం ప్రతి భారతీయుని కర్తవ్యం." ఈ విధంగా ఆయన ఆధ్యాత్మికతను, ధర్మాన్ని, దేశభక్తిని ఒకే తాటిపై నిలిపారు. మరో సంపాదకీయంలో 'ప్రేరణ' అనే శీర్షికతో ఆయన ఇలా రాశారు "ఆదిశంకరులు దేశమంతటా పర్యటించి ప్రబోధించడానికి ప్రేరణనిచ్చిన అంశం విభిన్నవాదాలు. ఆ ప్రేరణతోనే అద్వైత సంప్రదాయ స్థాపనం జరిగింది. శివాజీకి తల్లి చూపించిన సింహగడంపై విదేశీయుల జెండా స్వతంత్ర పోరాట పథంలో నడవడానికి ప్రేరణ ఇచ్చింది." ఈ విధంగా ఆయన ఆధ్యాత్మిక ప్రేరణను, జాతీయ ప్రేరణను ఒకే తాటిపై నిలిపారు.

రెండవది ధార్మిక అంశాలు. ధర్మం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు కసిరెడ్డి గారి సంపాదకీయాలు ఎంతో సరళమైన, స్పష్టమైన సమాధానం చెబుతాయి. 'ధర్మసారధి' పత్రికలో వచ్చిన ఒక సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు "ధర్మం అంటే మనుషుల మధ్య సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేది. విభేదాలు సృష్టించేది ధర్మం కాదు. అందరినీ ఒకే చూపు చూడడమే ధర్మం." 'దుర్గుణాన్ని వదలిపెట్టాలి' అనే సంపాదకీయంలో ఆయన మనలోని చెడు అలవాట్లను, దుర్గుణాలను వదిలించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అది చాలా సరళంగా, హృద్యంగా ఉంటుంది. 'విశ్వహిందు' పత్రికలో వచ్చిన 'విచిత్ర వేషధారణతో మతం' అనే సంపాదకీయంలో ఆయన మతం పేరిట జరుగుతున్న దురాచారాలను తీవ్రంగా విమర్శించారు "మతం మనిషిని మనిషిగా నిలబెట్టాలి. మతం పేరిట మనుషుల మధ్య గొడవలు పెట్టడం, విభేదాలు సృష్టించడం ఇది మతం కాదు, వ్యాపారం. నిజమైన మతం ప్రేమను, సహనాన్ని, ఐక్యతను బోధిస్తుంది." ఆయన ధార్మిక సంపాదకీయాల్లో మరో ప్రత్యేకత అవి ఎప్పుడూ నిర్మాణాత్మకంగా ఉంటాయి. సమస్యను చెప్పడంతో ఆగిపోవు, పరిష్కార మార్గాన్ని కూడా సూచిస్తాయి.

మూడవది తాత్త్విక అంశాలు. జీవితం అంటే ఏమిటి? మనిషిగా పుట్టడం అంటే ఏమిటి? ఈ తాత్త్విక ప్రశ్నలకు కసిరెడ్డి గారి సంపాదకీయాలు సులభమైన, అర్థవంతమైన సమాధానాలు చెబుతాయి. 'శివానంద భారతి'లో వచ్చిన 'అవివేకం నుండి వివేకం వైపుగా' అనే సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు "అజ్ఞానం మనిషిని చీకటిలో ఉంచుతుంది. అవివేకం మనిషిని తప్పు దారిలో నడిపిస్తుంది. వివేకం వెలుగునుఆయన చెప్పారు.

కసిరెడ్డి గారి సంపాదకీయాల భాష వారి ప్రత్యేకతల్లో ఒకటి. ఆయన భాష ఎప్పుడూ సరళంగా ఉంటుంది. సంస్కృత సమాసాలు ఉన్నా అవి భారంగా అనిపించవు. జానపద పదాలు, నుడికారాలు సహజంగా కలిసిపోతాయి. అవసరమైన చోట ఆంగ్ల పదాలను కూడా వాడతారు కానీ అవి అసహజంగా అనిపించవు. ఆయన సంపాదకీయాల్లో అనుప్రాస, యమకం వంటి అలంకారాలు సహజంగా వస్తాయి. కానీ అవి కేవలం అలంకారం కోసం కాదు, భావాన్ని మరింత స్పష్టంగా, స్మరణీయంగా చేయడానికి. 'శివానంద భారతి'లో వచ్చిన ఒక సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు "శాంతియే దైవం, ప్రేమయే దైవం, సత్యమే దైవం, అహింసయే పరమోత్తమ ధర్మం." ఈ ఒక్క వాక్యంలో ఎంత స్పష్టత ఉందో, ఎంత స్మరణీయత ఉందో చూడండి. ఇలాంటి వాక్యాలు ఆయన సంపాదకీయాల్లో చాలానే ఉంటాయి. ఆయన సంపాదకీయాల భాష గురించి మరో విశేషం-అది ఎప్పుడూ సజీవంగా ఉంటుంది. ఎంత క్లిష్టమైన విషయాన్ని తీసుకున్నా దాన్ని సరళంగా, ఆసక్తిగా చెప్పగల ప్రతిభ ఆయనది.

కసిరెడ్డి గారి సంపాదకీయాల్లో ఒక ప్రత్యేకత ఏమిటంటే అవి కేవలం నేటి సమస్యలను చర్చించడంతో ఆగిపోవు. అవి భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని రాయబడతాయి. ఆయన సంపాదకీయాలు ఎప్పుడూ ఒక దార్శనికతను కలిగి ఉంటాయి. 'మన ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు' అనే సంపాదకీయంలో ఆయన దేవాలయాలను కేవలం పూజా స్థలాలుగా కాకుండా, సామాజిక, సాంస్కృతిక, విద్యాపరమైన కేంద్రాలుగా ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ విధానం ఆయన దూరదృష్టికి నిదర్శనం. 'మతం మార్పిడి-మరో దండయాత్ర' అనే సంపాదకీయంలో ఆయన మతమార్పిడి వెనుక ఉన్న రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను విశ్లేషించారు. ఇది నేటి సందర్భంలో ఎంత ప్రస్తుతమో అందరికీ తెలుసు. ఆయన సంపాదకీయాలు చదివినప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఆయన కేవలం సంపాదకుడు మాత్రమే కాదు, ఒక దార్శనికుడు. సమాజాన్ని ఎక్కడికి నడిపించాలి అనే స్పష్టమైన దృష్టి ఆయనకు ఉంది.

కసిరెడ్డి గారి సంపాదకీయాల గురించి అనేకమంది ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. డా. పొద్దుటూరి ఎల్లారెడ్డి గారు ఆయన గురించి ఇలా అంటారు "ఆయన ప్రవచనం అనిర్వచనీయ సామాజిక సమరసతకు దర్పణం వంటిది. దేశ, ధర్మ సంస్కృతులను విమర్శిస్తే కత్తుల బోనులా గర్జించి గాండ్రిస్తారు." ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు కసిరెడ్డి పద్యకవితను ప్రస్తావిస్తూ దానికి ప్రబోధ లక్షణం ప్రాణచైతన్యమని పేర్కొన్నారు. ఈ మాటలు వారి సంపాదకీయాలకు కూడా వర్తిస్తాయి. డా. దాశరథుల బాలయ్య గారు కసిరెడ్డిగారి గేయసాహిత్యాన్ని విశ్లేషిస్తూ వారి నిలువెల్లా జాతీయ విప్లవ జ్యోతులే ప్రకాశిస్తాయని అన్నారు. ఈ మాటలు వారి సంపాదకీయాలకు కూడా సరిపోతాయి. శ్రీమతి కె. లావణ్య గారు "వారి ప్రతి రచనలో, ఉపన్యాసంలో, తరగతి గదిలో చెప్పే పాఠంలోనూ జనాన్ని జాగృతం చేయాలనే తపన కనిపిస్తుంది" అని పేర్కొంటారు. ఈ అభిప్రాయాలు కసిరెడ్డి గారి సంపాదకీయాల ప్రత్యేకతను, వాటి ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి.

కసిరెడ్డి గారి సంపాదకీయాలు పాఠకులపై ఎంతటి ప్రభావాన్ని చూపించాయి? ఈ ప్రశ్నకు సమాధానం ఆయన సంపాదకత్వంలో వెలువడిన పత్రికల నేటి పరిస్థితే చెబుతుంది. 'శివానంద భారతి', 'విశ్వహిందు', 'గీతాజ్ఞాన యోగ సమాచార్' ఈ పత్రికలకు ఈనాటికీ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతమైన చందాదారులు ఉన్నారు. ఈ పత్రికలు నేటికీ విజయవంతంగా కొనసాగుతుండటం ఆయన సంపాదకీయాలకు ఉన్న ఆదరణకుఇస్తుంది. వివేకం సరైన మార్గాన్ని చూపిస్తుంది. వివేకంతోనే మనిషి సత్యాన్ని, ధర్మాన్ని గ్రహించగలడు." 'మానవీయ విలువలు' అనే సంపాదకీయంలో ఆయన ఇంకా స్పష్టంగా చెప్పారు "మనిషిని మనిషిగా నిలబెట్టేవి కేవలం డబ్బు కాదు, అధికారం కాదు. ప్రేమ, కరుణ, సహనం, సత్యం, అహింస ఇవే నిజమైన మానవీయ విలువలు. ఈ విలువలు ఉన్న మనిషే నిజమైన మనిషి." 'లౌకిక జీవితంలో వేదం' అనే సంపాదకీయంలో ఆయన వేదాలను, ఉపనిషత్తులను కేవలం పండితులకు మాత్రమే పరిమితం చేయలేదు. అవి సామాన్యుల జీవితాలకు ఎలా ఉపయోగపడతాయో వివరించారు. ఈ మాటలు చదివినప్పుడు ఎవరికైనా స్పష్టంగా అర్థమవుతుంది. జీవితంలో నిజమైన సంపద ఇవే అని.

నాల్గవది సామాజిక అంశాలు. కసిరెడ్డి గారి సంపాదకీయాలు సమాజంలోని లోపాలను, సమస్యలను ఎంతో స్పష్టంగా, ధైర్యంగా చర్చించాయి. కానీ ఎప్పుడూ విధ్వంసకరంగా కాదు, నిర్మాణాత్మకంగా. 'పిల్లల్లో ఏకాత్మ భావన' అనే సంపాదకీయంలో ఆయన పిల్లల్ని ఎలా తీర్చిదిద్దాలి అనే దానిపై విలువైన సూచనలు చేశారు "పిల్లలు మన భవిష్యత్తు. వారిలో దేశభక్తిని, సంస్కారాన్ని, సహనాన్ని నింపాలి. వారికి చిన్నప్పటి నుండే 'అందరం ఒకటే' అనే భావన నేర్పించాలి. అప్పుడే మన సమాజం సమస్యలు తగ్గుతాయి." 'ధార్మిక మానవుడు' అనే సంపాదకీయంలో ఆయన నిజమైన మానవుడి లక్షణాలను వివరించారు "ధర్మం తెలిసినవాడు, ధర్మాన్ని పాటించేవాడే నిజమైన మానవుడు. ధర్మం లేని మనిషి జంతువుకంటే హీనుడు." కుల వ్యవస్థ, అంటరానితనం, మహిళల పట్ల అవమానకరమైన వైఖరి ఇలాంటి సామాజిక సమస్యలపై కూడా ఆయన సంపాదకీయాలు పదునుగా స్పందించాయి. కానీ ఎప్పుడూ నిరాశను కాదు, ఆశను నింపేవిగా ఉండేవి.

ఐదవది దేశభక్తి, జాతీయతా అంశాలు. కసిరెడ్డి గారి సంపాదకీయాల్లో దేశభక్తి అనేది కేవలం భావోద్వేగం కాదు అది ఒక నిబద్ధత. ఆయన సంపాదకీయాలు దేశం పట్ల ఉన్న ప్రేమను, దాని సంస్కృతి పట్ల ఉన్న గౌరవాన్ని స్పష్టంగా చూపిస్తాయి. 'విశ్వహిందు'లో వచ్చిన 'వందేళ్ల వందేమాతరం ఉద్యమం' అనే సంపాదకీయంలో ఆయన ఆ ఉద్యమం యొక్క ప్రాముఖ్యతను ఇలా వివరించారు "వందేమాతరం అనే రెండు మాటలు భారతీయుల హృదయాల్లో ఎంతటి సంచలనాన్ని సృష్టించాయో చరిత్ర చెబుతుంది. ఆ రెండు మాటలు దాస్యశృంఖలాలను బద్దలు కొట్టాయి. ఆ రెండు మాటలు లక్షలాది మందికి ప్రాణం పోశాయి." 'బలమే జీవనం–బలహీనతయే మరణం' అనే సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు "బలమే మన జీవనం. బలహీనతయే మరణం. బలమే ఆనందం. బలం శాశ్వతామృతం. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా బలంగా ఉండాలి. అప్పుడే మన దేశం బలంగా ఉంటుంది.'' 'క్రాంతి వీరుడు బసవేశ్వరుడు' అనే సంపాదకీయంలో ఆయన బసవేశ్వరుని సామాజిక విప్లవాన్ని, ఆయన సందేశాన్ని నేటి సందర్భంలో వివరించారు. అలాగే గాంధీజీ, నేతాజీ, సావర్కర్ వంటి జాతీయ నాయకుల గురించి కూడా ఆయన సంపాదకీయాలు రాశారు.

ఆరవది పండుగలు, ఉత్సవాలు. పండుగలు మన సంస్కృతికి ప్రాణం. కసిరెడ్డి గారి సంపాదకీయాలు పండుగల సాంస్కృతిక ప్రాముఖ్యతను ఎంతో సరళంగా, హృద్యంగా వివరించాయి. 'ధర్మసారధి'లో వచ్చిన 'దీపావళి' సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు "దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించుకోవడం మాత్రమే కాదు. అది అజ్ఞానం నుండి జ్ఞానం వైపు, అంధకారం నుండి వెలుగు వైపు

ప్రయాణించే సందర్భం. మనలోని చీకటిని, దుర్గుణాలను తొలగించుకుని వెలుగులోకి రావడమే నిజమైన దీపావళి.” ‘దివ్యార్థాలు’ అనే సంపాదకీయంలో ఆయన పండుగల ద్వారా సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం, సంతోషం ఎలా వ్యాప్తి చెందుతాయో వివరించారు. పండుగలు కేవలం వినోదం కోసం కాదు, సమాజాన్ని బలోపేతం చేసే సాధనాలని ఆయన చెప్పారు.

కసిరెడ్డి గారి సంపాదకీయాల భాష వారి ప్రత్యేకతల్లో ఒకటి. ఆయన భాష ఎప్పుడూ సరళంగా ఉంటుంది. సంస్కృత సమాసాలు ఉన్నా అవి భారంగా అనిపించవు. జానపద పదాలు, నుడికారాలు సహజంగా కలిసిపోతాయి. అవసరమైన చోట ఆంగ్ల పదాలను కూడా వాడతారు కానీ అవి అసహజంగా అనిపించవు. ఆయన సంపాదకీయాల్లో అనుప్రాస, యమకం వంటి అలంకారాలు సహజంగా వస్తాయి. కానీ అవి కేవలం అలంకారం కోసం కాదు, భావాన్ని మరింత స్పష్టంగా, స్మరణీయంగా చేయడానికి. ‘శివానంద భారతి’లో వచ్చిన ఒక సంపాదకీయంలో ఆయన ఇలా రాశారు “శాంతియే దైవం, ప్రేమయే దైవం, సత్యమే దైవం, అహింసయే పరమోత్తమ ధర్మం.” ఈ ఒక్క వాక్యంలో ఎంత స్పష్టత ఉందో, ఎంత స్మరణీయత ఉందో చూడండి. ఇలాంటి వాక్యాలు ఆయన సంపాదకీయాల్లో చాలానే ఉంటాయి. ఆయన సంపాదకీయాల భాష గురించి మరో విశేషం–అది ఎప్పుడూ సజీవంగా ఉంటుంది. ఎంత క్లిష్టమైన విషయాన్ని తీసుకున్నా దాన్ని సరళంగా, ఆసక్తిగా చెప్పగల ప్రతిభ ఆయనది.

కసిరెడ్డి గారి సంపాదకీయాల్లో ఒక ప్రత్యేకత ఏమిటంటే అవి కేవలం నేటి సమస్యలను చర్చించడంతో ఆగిపోవు. అవి భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకుని రాయబడతాయి. ఆయన సంపాదకీయాలు ఎప్పుడూ ఒక దార్శనికతను కలిగి ఉంటాయి. ‘మన ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు’ అనే సంపాదకీయంలో ఆయన దేవాలయాలను కేవలం పూజా స్థలాలుగా కాకుండా, సామాజిక, సాంస్కృతిక, విద్యాపరమైన కేంద్రాలుగా ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ విధానం ఆయన దూరదృష్టికి నిదర్శనం. ‘మతం మార్పిడి–మరో దండయాత్ర’ అనే సంపాదకీయంలో ఆయన మతమార్పిడి వెనుక ఉన్న రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను విశ్లేషించారు. ఇది నేటి సందర్భంలో ఎంత ప్రస్తుతమో అందరికీ తెలుసు. ఆయన సంపాదకీయాలు చదివినప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఆయన కేవలం సంపాదకుడు మాత్రమే కాదు, ఒక దార్శనికుడు. సమాజాన్ని ఎక్కడికి నడిపించాలి అనే స్పష్టమైన దృష్టి ఆయనకు ఉంది.

కసిరెడ్డి గారి సంపాదకీయాల గురించి అనేకమంది ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. డా. పొద్దుటూరి ఎల్లారెడ్డి గారు ఆయన గురించి ఇలా అంటారు “ఆయన ప్రవచనం అనిర్వచనీయ సామాజిక సమరసతకు దర్పణం వంటిది. దేశ, ధర్మ సంస్కృతులను విమర్శిస్తే కత్తుల బోనులా గర్జించి గాండ్రిస్తారు.” ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు కసిరెడ్డి పద్యకవితను ప్రస్తావిస్తూ దానికి ప్రబోధ లక్షణం ప్రాణచైతన్యమని పేర్కొన్నారు. ఈ మాటలు వారి సంపాదకీయాలకు కూడా వర్తిస్తాయి. డా. దాశరథుల బాలయ్య గారు కసిరెడ్డిగారి గేయసాహిత్యాన్ని విశ్లేషిస్తూ వారి నిలువెల్లా జాతీయ విప్లవ జ్యోతులే ప్రకాశిస్తాయని అన్నారు. ఈ మాటలు వారి సంపాదకీయాలకు కూడా సరిపోతాయి. శ్రీమతి కె. లావణ్య గారు “వారి ప్రతి రచనలో, ఉపన్యాసంలో, తరగతి గదిలో చెప్పే పాఠంలోనూ జనాన్ని జాగృతం చేయాలనే తపన కనిపిస్తుంది” అని పేర్కొంటారు. ఈ అభిప్రాయాలు కసిరెడ్డి గారి సంపాదకీయాల ప్రత్యేకతను, వాటి ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి.

కసిరెడ్డి గారి సంపాదకీయాలు పాఠకులపై ఎంతటి ప్రభావాన్ని చూపించాయి? ఈ ప్రశ్నకు సమాధానం ఆయన సంపాదకత్వంలో వెలువడిన పత్రికల నేటి పరిస్థితే చెబుతుంది. ‘శివానంద భారతి’, ‘విశ్వహిందు’, ‘గీతాజ్ఞాన యోగ సమాచార్’ ఈ పత్రికలకు ఈనాటికీ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతమైన చందాదారులు ఉన్నారు. ఈ పత్రికలు నేటికీ విజయవంతంగా కొనసాగుతుండటం ఆయన సంపాదకీయాలకు ఉన్న ఆదరణకునిదర్శనం. ఈ పత్రికలను చదివిన పాఠకులు అనేక ఆధ్యాత్మిక, ధార్మిక విషయాలతో పాటు భారతీయ సంస్కృతిని సరళమైన భాషలో అర్థం చేసుకోగలుగుతున్నారు. ప్రజల్లో ఈ పత్రికల ద్వారా భక్తి భావాలే కాకుండా పాఠకులు చైతన్యం దిశగా పయనించడం కూడా గమనించవచ్చు. ఒక పాఠకుడు చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి “కసిరెడ్డి గారి సంపాదకీయాలు చదివితే ఒక విధమైన ఉత్సాహం కలుగుతుంది. అవి మనల్ని ఆలోచింపజేస్తాయి, మంచి దారిలో నడిపిస్తాయి. అవి కేవలం చదవడానికి మాత్రమే కాదు, జీవించడానికి కూడా నేర్పిస్తాయి.”

తెలుగు పత్రికా చరిత్రలో సంపాదకీయ రచనకు ఒక గొప్ప సాంప్రదాయం ఉంది. కందుకూరి వీరేశలింగం పంతులు,

కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, ముట్నూరి కృష్ణారావు వంటి మహనీయులు ఈ సాంప్రదాయానికి పునాదులు వేశారు. ముట్నూరి కృష్ణారావు సంపాదకీయాలు జాతీయోద్యమ కాలంలో తెలుగు జాతిని ఉత్తేజపరిచాయి, స్వాతంత్ర్య సమరంలో ముందుకు నడిపించాయి. కసిరెడ్డి గారు ఈ సాంప్రదాయాన్ని నూతన యుగంలో కొనసాగించారు. ముట్నూరి కృష్ణారావు సంపాదకీయాలు బ్రిటిష్ పాలనను వ్యతిరేకించినట్లే, కసిరెడ్డి గారి సంపాదకీయాలు నవ్య దురాచారాలను, విధ్వంసక శక్తులను వ్యతిరేకించాయి. కానీ కసిరెడ్డి గారికి ఒక ప్రత్యేకత ఉంది. ఆయన ఆధ్యాత్మికత, ధర్మం, జాతీయత, సామాజిక సమానత్వం వంటి అంశాలను ఒకే తాటిపై నిలిపారు. ఇది ఆయన సంపాదకీయాల వైశిష్ట్యం.

ముగింపు

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారి సంపాదకీయ వ్యాసాలు తెలుగు పత్రికా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించాయి. ఈ వ్యాసాలు ఆధ్యాత్మికత, ధర్మం, తాత్త్వికత, సామాజిక సమస్యలు, దేశభక్తి, జాతీయత, పండుగలు ఇలా వివిధ అంశాలను సమర్థవంతంగా చర్చించాయి. వాటిలో కనిపించే విషయ వైవిధ్యం, దార్శనికత, భాషా సరళత, సాంప్రదాయ నిరంతరత, సాహిత్య విలువ ఇవన్నీ కలిపి ఆయన సంపాద కీయాలను శాశ్వతమైన సాహిత్య సంపదగా నిలిపాయి.

కసిరెడ్డి గారి సంపాదకీయాలు సమాజాన్ని సరిదిద్దేలా, మానవతను దేవతగా నిలబెట్టేలా, సదా అభ్యుదయాన్ని ఆకాంక్షించేలా ఉన్నాయి. ఆయన సంపాదకీయాలు కేవలం వ్యాసాలు మాత్రమే కావు అవి సమాజ విజ్ఞానశాస్త్రం, మానవ చైతన్య వ్యాసాలు. సమాజాన్ని మేల్కొలిపే 'వైతాళికుడు'గా, ధర్మ జాగరణ ధనుర్ధారిగా, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించిన ఏకాత్మ మానవతావాదిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారి సంపాదకీయ వ్యాసాలు తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వతంగా ప్రకాశిస్తూనే ఉంటాయి.

'శివానంద భారతి', 'విశ్వహిందు', 'గీతాజ్ఞాన యోగ సమాచార్' వంటి పత్రికలు ఈనాటికీ విజయవంతంగా కొనసాగుతూ, ఆయన సంపాదకీయాలకు ఉన్న ఆదరణను, శాశ్వతత్వాన్ని చాటుతున్నాయి. ఈనాటికీ ఆయన సంపాదకీయ బాధ్యతలు, ప్రవచనాలు, సాహిత్య సేవ కొనసాగిస్తూనే ఉన్నారు. తెలుగు పత్రికా చరిత్రలో కసిరెడ్డి సంపాదకత్వం ఒక నిలువెత్తు మానవతా దర్పణంగా, శాశ్వత వైతాళికుని అక్షర రూపంగా నిలిచిపోయింది.

'అక్షరం చచ్చిపోదు. మంచి అక్షరం ఎప్పటికీ బతికే ఉంటుంది.' ఈ మాటకు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారి సంపాదకీయాలు సజీవ సాక్ష్యం. ఆయన అక్షరాలు ఈనాటికీ లక్షలాది పాఠకుల హృదయాల్లో చైతన్యాన్ని రేకెత్తిస్తూనే ఉన్నాయి. రేపటి తరాలకు కూడా అవి దారిదీపాలుగా నిలుస్తాయి. ఎందుకంటే, ఆ అక్షరాల్లో దేశభక్తి ఉంది, సంస్కృతి ఉంది, ధర్మం ఉంది, మానవత్వం ఉంది. ఇవన్నీ కలిసి ఆయన సంపాదకీయాలను కాలాతీతంగా, శాశ్వతంగా నిలిపాయి.

ఉపయుక్త గ్రంథాలు

1. కమలాకర శర్మ, సాగి. (సంపా.) అక్షరాకాశం, ఆచార్య కసిరెడ్డి సాహిత్య సమాలోచనం, మూసి మాసపత్రిక, వేద సంస్కృతిక పరిషత్, హైదరాబాద్, 2005.
2. కసిరెడ్డి వెంకటరెడ్డి, చైతన్యశ్రీ (పద్యకవితా సంహిత), 1992.
3. కసిరెడ్డి వెంకటరెడ్డి, సిందూరం (వచనకవితా సంపుటి), 1988.
4. కసిరెడ్డి వెంకటరెడ్డి, నేటి వేమన శతకం, 2015.
5. కసిరెడ్డి వెంకటరెడ్డి, అమృతసూక్తం (వచనకవితా సంపుటి), 2002.
6. కసిరెడ్డి వెంకటరెడ్డి, జాతిజీవనంపై రామాయణ ప్రభావం, 1980.
7. కసిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీకృష్ణ సందేశం, 1991.
8. కసిరెడ్డి వెంకటరెడ్డి, హిందూధర్మ రక్షణ మనకర్తవ్యం, 1992.
9. కసిరెడ్డి వెంకటరెడ్డి, పీఠికల పేటిక, 2002.
10. కసిరెడ్డి వెంకటరెడ్డి, నవీన సాహితి (వ్యాస సంపుటి), 2001.
11. కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ యాస-బాస, 2016.
12. కసిరెడ్డి వెంకటరెడ్డి, బ్రతుకమ్మ సంస్కృతి, 2016.
13. గీతాజ్ఞాన యోగ సమాచార్ మాసపత్రిక, వివిధ సంచికలు.
14. దివ్యభారతి (సాహిత్య ప్రత్యేక సంచిక), ఆచార్య కసిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా, 2006.
15. ధర్మసారథి మాసపత్రిక, వివిధ సంచికలు.
16. రాపోలు ఆనంద భాస్కర్, జర్నలిజం చరిత్ర-వ్యవస్థ.
17. విశ్వహిందు మాసపత్రిక, వివిధ సంచికలు.
18. శివానంద భారతి మాసపత్రిక, వివిధ సంచికలు (2004-2014).

రచయిత: పరిశోధక విద్యార్థి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్

సాహిత్య
పరిశోధన

కాసుల లింగారెడ్డి కవిత్వం-విశ్లేషణ

మలిపెద్ది రాజు

పరిశోధన వ్యాస సంక్షిప్తి:

ఆధునిక తెలుగు కవిత్వం రెండు పాయలుగా ప్రవహిస్తోంది. ఒకటి భావుకతతో కూడిన కవిత్వం. ప్రకృతి, ప్రణయం, ఆధ్యాత్మికత, కాల్పనికత దీని ప్రధాన వస్తువులు. దీని ప్రయోజనం కాలక్షేపం మాత్రమే! రెండోవది ప్రజా కవిత్వం. ఇది ప్రజల సమస్యల కోసం పుట్టింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సంస్కృతులను వివరిస్తుంది. వివక్ష, దోపిడి లేని వర్గరహిత సమసమాజం ఏర్పాటు ప్రధాన లక్ష్యంగా ఈ కవిత్వం రాయబడుతుంది. దీనికి రాజ్య ధిక్కరణ స్వభావం ఉంటుంది. ఈ రెండవ కోవకు చెందిన కవి కాసుల లింగారెడ్డి. వృత్తిరీత్యా డాక్టర్ అయినప్పటికీ చాలా సీరియస్ కవిత్వ రచనలు చేసారు. ఇతను జలపాత శబ్దంలోకి... (1998), ఎన్నాద్రి (2007), ఇడుపు కాయితం (2014) కవితా సంపుటాలను అందని చందమామ (2009) దీర్ఘ కవితను రాశాడు. లింగారెడ్డి సమాజంలోని చాలా సమస్యలపై స్పందించి కవిత్వాన్ని రాయడం జరిగింది. ఇతని రచనల్లో ముఖ్యంగా మూడు ప్రధాన కోణాలున్నాయి. అవి : విప్లవోద్యమ కవితలు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రోద్యమ కవితలు, వైద్యరంగంలోని లోపాలపై రాసిన కవితలు. పై మూడు విషయాలు ప్రధానంగా ఇతని కవిత్వాన్ని ఈ వ్యాసంలో విశ్లేషించాను.

కీలక పదాలు: కవిత్వం, లింగారెడ్డి, సమాజం, విప్లవం, ఉ ద్యమం, తెలంగాణ, వైద్యరంగం, ఆల్మాఆట.

లింగారెడ్డి కవిత్వం – విశ్లేషణ

లింగారెడ్డికి తన జీవితంలో జరిగిన సంఘటనలు బలంగా నాటుకున్నాయి. సమాజ సమస్యలు, విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమాల ప్రభావం అధికంగా పడింది. ఈ సంఘర్షణలే ఇతనిని కవిత్వం వైపు మళ్ళించాయి. "ఎక్కడ జీవితం అవస్థ పడుతదో అక్కడ కవిత్వం మొదలైతది. ఎక్కడ ప్రయాణం కుంటుపడుతదో అక్కడ అక్షరం వెన్నుతడుతది. ఎక్కడ అణచివేత మిడిసిపడుతదో అక్కడ ఘర్షణ ఎగిసిపడుతది. కాలం పరిక్షకకు నిలిపిన దశలను దాటుకుంటూ కవిత్వాన్ని సాక్ష్యంగా కాకుంట సామాజిక లక్ష్యంగా కవిత్వం రాస్తున్న కవి కాసుల లింగారెడ్డి" ***(జలపాత శబ్దంలోకి, పుట. 07)*** అని లింగారెడ్డిపై నందిని సిధారెడ్డి రాసిన మాటలు అక్షరసత్యం.

విప్లవోద్యమం : 1967లో పశ్చిమ బెంగాల్ నక్సల్బరిలో విప్లవోద్యమం మొదలయింది. తెలుగు నేలలో మొదట శ్రీకాకుళం జిల్లాపై పడింది. సిరిసిల్ల, జగిత్యాల ఉద్యమాలతో ఉధృతంగా మారింది. ఈ ప్రభావం నాటి కవులపై పడ్డట్లుగానే లింగారెడ్డిపై పడింది. తెలంగాణ సాయుధపోరాటం చేసిన చరిత్ర కలిగిన నేల కాబట్టి ఈ ప్రాంత కవులపై అధిక ప్రభావం పడింది.

లింగారెడ్డి విరసంలో సభ్యుడు కాకపోయినా విప్లవ కవితలు రాశాడు. విప్లవ వీరుడు ఎలాంటి గమ్యాన్ని నిర్దేశించుకొని వెళ్తాడో అలా ఇతని కవితల్లో కనిపిస్తాయి. నాటి కల్లోల పరిస్థితులను కవిత్వంగా మలిచాడు. "ఈ కవిది ఒక ధిక్కార స్వరం. చెప్పదలుచున్నది కచ్చితంగా ధైర్యంగా వెల్లడిస్తాడు. ఆయన కవిత్వానికో లక్ష్యం ఉంది. దైన్యంతో మునిగి ఉన్న వారికి ఓదార్పునిస్తుంది. ఉద్యమాలకు అండగా నిలుస్తుంది. ఆయన కవిత్వంలో కల్లోల జీవితాలు కదలాడుతుంటాయి" ***(వెంకటేశ్వర్లు ఉన్నం, తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, పుట. 432)***

ఏ రాజ్యంలో శ్రమకు తగ్గ ఫలితానికై
కంఠాలెత్తిన శ్రమ జీవులు
నడిరోడ్డులో కాల్చి కూల్చబడుతున్నారో
ఏ రాజ్యంలో అగ్రవర్ణ అహంకారమూ,
భూస్వామ్య దోపిడీలూ
రావణ కాష్టంలా రాజ్యమేలుతున్నాయో
ఏ రాజ్యంలో నల్లనోట్లు ప్రజల ఓట్లుగా మారి
నిరంకుశాన్ని నిక్షిప్తం చేస్తున్నాయో
ఏ రాజ్యంలో నల్లకోట్లు ధనవంతులకు దాసోహమంటూ
జనసామాన్యాన్ని జైళ్ళపాలు చేస్తున్నాయో
ఆ రాజ్యంలో మేము సంఘటితమౌతున్నాం
ఆ రాజ్యంలో మేము సాయుధులమౌతున్నాం

(జలపాతంలోకి, పుట. 20)

అణచివేతల నుండి ఉద్యమాలు పుట్టుకువస్తాయి. పెట్టుబడిదారి వ్యవస్థ శ్రామికుల శ్రమను దోచినప్పుడు పుడతాయి. అగ్రవర్ణాలు చేసే దోపిడి, వివక్షల నుండి వస్తాయి. రాజ్యహింసకు వ్యతిరేకంగా ఉద్భవిస్తాయి. సమాజంలో న్యాయం కరువు అయినప్పుడు విప్లవలు పుడతాయి. ఏ రాజ్యంలో అయితే ఈ పరిస్థితులు దాపురిస్తాయో ఆ రాజ్యంలో ప్రజలు సాయుధ పోరాటానికి సిద్ధమవుతారని పై కవిత పాదాలలో తెలియజేశాడు.

విప్లవాలు ప్రజ శ్రేయస్సు కోసం వస్తాయి. రేపటి కొత్త సమాజ వెలుగు కోసం ఉద్యమలు జరుగుతాయి. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విప్లవ పౌరులు సాయుధులై అడవి బాటపట్టారు. రాత్రి, పగలు తేడా లేకుండా వారి పోరాటం ఉంటుంది. వీరి పట్ల ప్రజలు అంకిత భావంతో ఉంటూ వారి ఆశయాలను, సిద్ధాంతాలను అర్థం చేసుకోవాలి.

"ఆయుధాల్ని ప్రేమించాలి
ఆశయాల సాయుధున్ని ప్రేమించాలి
నూతన కాంతులకోసం సమిధులౌతున్న
సైద్ధాంతిక సాయుధుల్ని ప్రేమించాలి"

(ఎన్నాద్రి, పుట:55)

అంతర్జాతీయంగా ప్రజా ఉద్యమాలు ఎన్నో జరిగాయి. జరుగుతున్నాయి. ఆయా ఉద్యమాలు ఇతర దేశాలకు స్ఫూర్తినిచ్చాయి. తెలుగు విప్లవ కవులు, రచయితలు ఆ దేశాల పోరాటాలను తమ సాహిత్యంలోకి తీసుకురావడం జరుగుతూ వస్తుంది. అలాగే లింగారెడ్డి కూడా !

"వర్తమాన ప్రాపంచిక శిఖల మీద వికసించిన
ఎర్ర మందారమా!
....
విప్లవాభివందనాలు -
అసమాన పోరాట యోధుడు
ఛావెజ్‌ని కన్నందుకు వందనాలు
సామ్రాజ్యవాద ఇనుప దేగను నిలువరించిన
ఛావెజ్‌ని వెన్నంటి వున్నందుకు వందనాలు"

(అదే, పుట:46)

పై కవితలో వెనెజురా పోరాటాన్ని గురించి రాశాడు. పోరాట యోధుడయిన ఛానెజ్ గురించి పేర్కొనడం జరిగింది. నేపాల్‌లో జరిగిన విప్లవాన్ని కీర్తిస్తూ "నేలవాసనలు" కవిత రాశాడు.

తెలంగాణ ఉద్యమం : తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కవిత్వం రాశాడు. ప్రజ సమస్యలనే వస్తువులుగా స్వీకరించి కవిత్వం రాసే లింగారెడ్డి తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని చాలా సీరియస్‌గా రాశాడు. కవిగా తన బాధ్యతను అంకిత భావంతో నిర్వర్తించాడు.

"సాన్పి చల్లి ముగ్గు పెట్టి
తిరొక్క పువ్వులతోటి పేర్చిన
బతుకమ్మ సొంటి ఆకిలి
పొక్కిలైందన్న
....
కండ్ల నిండ చూసి తుర్తి పడాల్సిన
పాల పిట్టను గుళ్ళేరు పెట్టి కొట్టొద్దన్న
జెండాగా ఎత్తి పెట్టాల్సిన జొన్న కర్రలను
మర్లవడ్డ దుడ్డోలె సెంద్రం సెద్రం చెయ్యొద్దన్న
నీ అన్నాలం పాడుగాను
నేన్నేమన్న?" ***(ఇదుపు కాయితం, పుట:29)***

నిజాం పాలనలో అణచివేతకు గురి అయిన తెలంగాణ! ఆంధ్రవాళ్ళ పాలనలో వివక్షకు గురయింది. వాళ్ళు తెలంగాణ ప్రాంతాన్ని చిన్నచూపు చూశారు. సహజ సంపదను దోచి నీళు మళ్ళించి తెలంగాణను ఎండబెట్టారు. ఉద్యోగాలను లూటి చేసి భాష, సంస్కృతులను హేళన చేశారు. ఇన్ని దోపిడిలకు గురయిన తెలంగాణ ప్రాంత పరిస్థితిపై 'నేనేమన్న' కవితలో వ్యంగ్యంగా రాశాడు.

"సమ్మక్క, సారలమ్మ శూరత్వం
రాణి రుద్రమ రణన్నినాదం
కొమరం భీం ధర్మాగ్రహం
ఒందగీ తెగింపుల తేటదనం
పాలుసాలని నా బిడ్డలకు సాలుపోస్తున్న
సరిగ్గా అరవై ఏండ్లకింద
అలసిన నా బిడ్డలు దాచిన
జమ్మిచెట్టు మీది ఆయుధాలు తీయమన్న
నీ అన్నాలం పాడుగాను
నేనేమన్న?" ***(అదే, పుట:31)***

స్వరాష్ట్ర సాధనకై ప్రజలను ఉత్సాహపరచడం, ఉద్రేక పరచడం కవి బాధ్యత లింగారెడ్డి పై కవితలో అలానే చేశాడు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం వీరోచిత పోరాటం చేసిన తెలంగాణ చారిత్రక వీరుల వీరనారీల శౌర్యాన్ని గుర్తు చేశాడు. ఈ గడ్డమీదనే భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తికై చేసిన నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటన్ని గుర్తు చేశాడు. ప్రపంచ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన్న ఆ ఉద్యమాన్ని మనసులో నిలుపుకొని తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమించాలని కవి ప్రజలకు గుర్తు చేశాడు.

ఉద్యమం ఉధృతంగా మారి ఉవ్వెత్తున లెచింది. విద్యార్థులు, ఉద్యోగులు, కవులు, కళాకారులు, మేధావులు, నాయకులు, ఆడ, మగ తేడా లేకుండా అందరూ ఉద్యమంలో పాల్గొన్నారు. రోడ్లు, రైల్వేస్టేషన్లు విద్యాసంస్థలు ఎక్కడ చూసినా "జై తెలంగాణ" నినాదమే!

ఈ సకల జనుల సమ్మెను గురించి ఈ కవిత!

"కాటగలసిన నేల పానాదులు తీసింది
కుల మతాలు వెన్నెముక మీద గుద్ది
తోవలు పంక్తిభోజన మల్లెసాలలైనవి
కాలం వసంతాల్ని కౌగలించుకునే వేళ
ధూంధాం దరువులు
కోడికూతవైనవి
జ్ఞానపు ఎన్నాద్రి కోసం
అక్షరాల్ని ఇరువాలు దున్నే విద్యాలయాలు
ఉద్యమ యుద్ధభూములైనవి
....
అంటుకుంటున్న దేహాల కొలుముల్లో
సానపెట్టబడ్డ కలాల పాళీలను
మత్తడివడ్డ గుండె చెరువులో ముంచి
ఉద్యమ గీతాలల్లుతున్నరు
కవులు
....
గోసి పోసి, గొంగడి భూజానేసి
పల్లె
పోరు పట్టాలెక్కింది
....
మిలియన్ మార్చ్
టాంకుబండును విముక్తం చేసింది."

(అదే పుట:61,62)

ఇక తెలంగాణ ఆంధ్రతో కలసి ఉందటం జరగదని "ఇదుపుకాయితం" కవిత రాశాడు.

<u>**వైద్యరంగం :**</u> లింగారెడ్డి వృత్తి డాక్టర్. ప్రవృత్తి కవిత్వం రాయడం. ఇక్కడ వృత్తికి సంబంధించిన సమస్యలను ప్రవృత్తిలో పేర్కొనడం జరిగింది.

వైద్య రంగంలోని సమస్యలను "అందని చందమామ" అను దీర్ఘ కవితగా మలిచాడు. మానవులు తమ కృషితో నింగిలోని చందమామను అందుకున్నారు. కాని ఇక్కడ 'సంపూర్ణ అరోగ్యం అనే చందమామను అందుకోలేక పోతున్నాం' అని ఈ కవితకు అందని చందమామ అని పేరు పెట్టాడు. 14 భాగాలుగా ఈ కవితను రాశాడు.

"ఆర్థిక వ్యత్యాసాల అసహజ సామాజిక కట్టదాల్నుంచి
సరికొత్త వ్యవస్థ శిశువుకు
పురుడు పోద్దామనుకున్నప్పటి మాట
ఆల్మాఆటా అందరి నోటి పాటైన నాటి మాట"

(అందని చందమామ, పుట:11)

1978లో ఆల్మాఆట (సోవియట్ యూనియన్)లో ప్రపంచ ఆరోగ్య సంస్థయునిసెఫ్ ఆధ్వర్యంలో ఒక అంతర్జాతీయ సభ జరిగింది. సభలో పాల్గొన్న దేశాలు ముకుమ్మడిగా 2000 సంవత్సరాని కల్ల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా తీర్మానించి సంతకం చేశాయి. అందులో భారతదేశం కూడా ఉంది. ఒప్పందం సంతకాల వరకే పరిమితమైంది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలివేసింది.

"కలుషిత నీరు కంఠం దాటితే
కందరాలను కాలదోషం
బతుకంతా పోరాడుడే" ***(అదే పుట.18)***

నేడు సహజ వనరులన్ని కలుషితమయ్యాయి. వాటివల్ల అనేక జబ్బులు వస్తాయని రాశాడు. ఋతువులు మారినప్పుడు వచ్చే సీజనల్ జబ్బులతో పాటు AIDS వంటి అంటురోగాలు కూడా ప్రబలుతున్నాయని లింగారెడ్డి హెచ్చరించారు.

ఎన్నో వ్యాధులు వస్తున్న ప్రజలకు పరిశుభ్రత మీద సరైన అవగాహన ఉండదు. వారు పట్టించుకోరు. ప్రభుత్వాలు కూడా వారికి అవగాహన కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుంది. అందుకే లింగారెడ్డి

"మరుగు దొడ్ల కంటె

బుల్లి తెరలెక్కువున్న దేశం కదా నాది"

(అదే పుట.20) అని రాశాడు.

అల్మాఆట ఒప్పందం ప్రకారం సంపూర్ణ ఆరోగ్యం వసతులు ప్రభుత్వం అందించసాధ్యపడకున్న అక్కడక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశాయి. కాని వీటి పనితీరు ఎలా ఉంటుందో లింగారెడ్డి ఇలా వర్ణించారు.

"ప్రజారోగ్య సుడి గుండాల సంద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అది వైద్యుడు లేని చోటు

చోటంటూ లేకపోవడం మరోచేటు

మందులంటే

జెండా వందనం నాటి పిప్పరమెంట్ల పంపకం"

(అదే పుట.43)

గాంధీ, ఉస్మానియా, నిలోఫల్, కాకతీయ వంటి ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు ఎంతో సేవ చేశాయి. నేటి ప్రభుత్వాలు ఈ ఆసుపత్రుల వసతులను గాలికి వదిలేసి కార్పొరేట్ ఆసుపత్రులకు విచ్చలవిడిగా పర్మిషన్‌లు ఇస్తున్నారని లింగారెడ్డి ఆవేదన చెందుతూ కవిత్వం రాసాడు.

"అసంబద్ధ శాస్త్ర పరీక్షలు

అనవసర శస్త్ర చికిత్సలు

కాసుల సంచుల కోసం

గర్భ సంచుల కత్తిరింపులు" ***(అదే పుట.52)***

ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాకం ఇది. వీరికి ప్రజా శ్రేయస్సు కన్నా డబ్బు సంపాదనే ముఖ్యం. చిన్న జ్వరం వచ్చినా కూడా పరీక్షల పేరుతో వేలకు వేలు గుంజుతారు.

ఇలా కొనసాగుతూ పోతే సామాన్యులకు ఆరోగ్యం అందని చందమామనే అవుతుందని సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రజలు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని ఈ కవితను ఇలా ముగిస్తారు.

"సరికొత్త అంతరిక్ష నౌకలో

సరికొత్త వ్యోమగామి సమూహాలమై

చందమామ ఆలింగనాల్లో సేదతీరేందుకు

ఆరోగ్య జ్ఞాన సమాజాల నావిష్కరించేందుకు

పద... పద...

Hurry up... Hurry up..."

(అదే పుట.56)

ముగింపు

డాక్టర్ వృత్తిలో తీరికలేకుండా ఉన్నప్పటికీ సామాజిక, రాజకీయ సమస్యలపై స్పందించి కవిత్వం రాయడంతో సమాజంపై ఇతనికి ఉన్న బాధ్యత తెలుస్తుంది. శిల్ప సొగసుల కోసం ఎక్కడ ఆరాటపడ్డట్టు ఇతని రచనల్లో కనిపించదు. చెప్పదలచుకున్న విషయాలను చాలా స్పష్టంగా కవిత్వంలో చిత్రించారు. విప్లవోద్యమం, విప్లవకారులపై సానుకూల దృక్పథం ఉన్నట్టు తెలుస్తుంది. తెలంగాణ ప్రాంతంపై ఆంధ్రవాళ్ళ వివక్షను, తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులను కవిత్వం ద్వారా పాఠకులకు చేర్చడంలో సఫలీకృతులయ్యారని చెప్పవచ్చు. డాక్టర్ అయ్యుండి కూడా వైద్యరంగంలోనే లోపాలను ఎత్తిచూపడంతో ఇతని ముక్కుసూటి వ్యక్తిత్వం అర్థమవుతుంది. వర్తమాన తెలంగాణ మేటి కవులలో లింగారెడ్డి ఒకరు అనడంలో సందేహమేమి లేదు.

ఆధార గ్రంథాలు

1. ప్రతాపరెడ్డి, కాసుల. తెలంగాణ సాహిత్యోద్యమాలు, 2015, తెలంగాణ ప్రచురణలు, హైదరాబాదు.

2. లింగారెడ్డి, కాసుల. జలపాత శబ్దంలోకి..., 1998, శైలి పబ్లికేషన్స్, హైదరాబాదు.

3. లింగారెడ్డి, కాసుల. ఎన్నాద్రి. 2007, శైలి పబ్లికేషన్స్, హైదరాబాదు.

4. లింగారెడ్డి, కాసుల. అందని చందమామ. 2009, శైలి పబ్లికేషన్స్, హైదరాబాదు.

5. లింగారెడ్డి, కాసుల. ఇదుపు కాయితం. 2014, శైలి పబ్లికేషన్స్, హైదరాబాదు.

6. వెంకటేశ్వర్లు, ఉన్నం. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, 2015, ఉన్నం బ్రదర్స్ పబ్లికేషన్స్, హైదరాబాదు.

రచయిత: పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,

ఉస్మానియా విశ్వవిద్యాలయం

బంజారా - తెలుగు భాషా విశ్లేషణ

● డా. లావుడ్యా నర్సింగ్ నాయక్

పరిశోధన సంక్షిప్తి:

భారతదేశ వ్యాప్తంగా బంజారాలు కొండకోనల్లో, వాగువంకల్లో, అడివంచు పల్లెల్లో నివాసం ఉంటున్నారు. నాగరిక సమాజానికి దూరంగా, వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవిస్తున్నారు. తరతరాలుగా బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావి తరాలకు అందిస్తున్నారు. సహజ వనరుల్ని కాపాడుతూ ప్రకృతితో మమేకమవుతున్నారు. బంజారా భాషలో తమ జాతి అస్తిత్వ మూలాలను గానం చేస్తున్నారు. కథలు అల్లుతున్నారు. లిపి లేదు. ఐనా ఈ భాష వేల ఏళ్లుగా మనుగడలో ఉన్నది. మౌఖిక సంప్రదాయంలో చరిత్ర, సంస్కృతిని వివిధ కళారూపాల ద్వారా కాపాడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో అనేక జాతులతో కలసిమెలసి జీవిస్తున్నారు. ఎక్కువగా తెలుగు ప్రజలతో సహజీవనం చేయడం వల్ల తెలుగు భాష–బంజారా భాషల మధ్య సంబంధం ఏర్పడింది. బంజారా–తెలుగు భాషా విశ్లేషణ చేయడం ఈ పరిశోధన పత్రం ముఖ్య ఉద్దేశం.

కీలక పదాలు: *బంజారా, భాష, చరిత్ర, గోర్‌బోలి, హిందార్య, ఆదాన ప్రదానాలు, సంస్కృతి, సాహిత్యం, ఇండో ఆర్యన్, సామెతలు, సహజీవనం, పర్సో – అరబిక్.*

పరిచయం:

భారతదేశంలో వ్యవహృతమౌతున్న భాషల్ని గ్రియర్‌సన్ పండితుడు పరిశోధించి లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అని పది సంపుటాలుగా ప్రచురించాడు. ఇందులో నాల్గవ సంపుటాన్ని స్టెంకెనో ప్రధానంగా సంతరించాడు. భారతదేశం వివిధ జాతి పక్షులకు, జంతువులకు, వివిధ మతాల వారికి ఏ రీతిగా ప్రదర్శనశాల అని పేరు మోసిందో అదే విధంగా వివిధ భాషా కుటుంబాలకు కూడా ఖ్యాతిగాంచింది. ఈ సంపుటాలలో 175 భాషలు, 544 మాండలికాలు సర్వే చేయబడ్డాయి. భారతదేశంలో నాలుగు భాషా కుటుంబాలు ముఖ్యంగా ఉన్నాయి. అందులో పెద్దది హిందార్య భాషా కుటుంబం.

గ్రియర్సన్ భారతీయ భాషలపై చేసిన పరిశోధనలలో గోర్‌బోలి మాటను గుర్తించలేదని, కాని బంజారాలపై చేసిన విషయ సేకరణలో కొన్ని విషయాలు క్రింది విధంగా పేర్కొన్నాడు. బంజారా భాషలో కొన్ని విలక్షణ పదాలను గుర్తించి, ఈ పదాలు ఉత్తరాది భాషల్లో కనిపించడం లేదని ఆయన స్పష్టం చేశాడని ఆ పదాలు ఆజి = ఇంకా, ఆట్ = ఎనిమిది, బాటి = రొట్టె, కమేడి = పక్షి, కేల్డా = దూడ, కొత్ర = కుక్క, మాటి = మనిషి, యాడి = తల్లి మొదలగునవి. గోర్ భాష(లింగో) ఒక ప్రత్యేకమైన గిరిజన భాషని బంజారా స్టడి టీమ్ అభిప్రాయపడింది. దేహభాగ వాచకాలు, వేష భాషలు, ఆహార పానీయాలు, వృత్తులు వీటికి సంబంధించిన పదజాలాల ఆధారంగా ఇండో ఆర్యన్ భాషలో ఇదోక ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కలిగిన భాషని స్టడి టీమ్ అభిప్రాయాన్ని ప్రకటించింది.

పైన పేర్కొన్న అభిప్రాయాలను పరిశీలించినట్లయితే గ్రియర్సన్ భారతీయ భాషలను పరిశోధించినప్పుడు బంజారా భాష గురించి కూడా విషయ సేకరణ చేసినట్లు తెలుస్తోంది. ఆ తరువాత ఆల్ ఇండియా బంజారా స్టడి టీమ్ కూడా బంజారా భాష భారతదేశంలో వ్యవహారంలో ఉన్నట్లు తెలిపిందని తెలుస్తోంది. అయితే బంజారా భాష వివిధ ప్రాంతాలలో వివిధ భాషల మధ్య ఉన్నట్లు స్పష్టం అవుతున్నది.

బంజారా భాష లక్షణాలు:

హల్లులు: బంజారా భాషలో గుర్తించదగిన హల్లులు మొత్తం: 32

అచ్చులు: బంజారా భాషలో అచ్చులు మొత్తం: 10

పదాది

బంజారా భాషలో పదాదిన వచ్చే హల్లులు ఈ విధంగా ఉన్నాయి.

బంజారా	తెలుగు
/క/ కత్త	ఎక్కడ
/గ/ గల్	మింగు
/చ/ చడా	ఎక్కించు
/జ/ జడ్	వేరు
/ట/ టక్కన్	నిలిచి
/డ/ డర్	భయం

పద మధ్యం

బంజారా భాషలో పద మధ్య హల్లులు ఇలా ఉన్నాయి.

బంజారా	తెలుగు
/క/ పకడ్	పట్టు
/గ/ మంగర్	మొసలి
/చ/ మాచర్	దోమ
/జ/ విజళి	పిడుగు
/ట/ అటకళ్	జాగ్రత్త
/డ/ లడరో	పోట్లాడు
/ణ/ మణసాయి	కామం

పద మధ్య ద్విత్వ హల్లులు

బంజారా భాషలో ద్విత్వ హల్లులు ఈ విధంగా ఉన్నాయి.

బంజారా	తెలుగు
/క/ జక్కన్	దాక్కోని
/గ/ అగ్గిగాల్	
మంటపెట్టు	
/చ/ అచ్చుమ్‌కళా ఆశ్చర్యము	
/జ/ ఇజ్జత్	గౌరవము
/ట/ టట్టాతి	
పరిహాసంతో	
/డ/ బడ్డు	
పనికిమాలినవాడా	
/ణ/ గోణ్ణిగ్వార్ భార్యభర్త	
/త/ జత్తన్	జాగ్రత్త
/ద/ గద్దర్	మురికి

పద మధ్య సంయుక్త హల్లులు

బంజారా భాషలో పద మధ్య సంయుక్త హల్లులను, రెండు హల్లుల సంయుక్తత, మూడు హల్లుల సంయుక్తతగా చూపించవచ్చు.

రెండు హల్లుల సంయుక్తత

ఈ భాషలో రెండు హల్లుల సంయుక్తాలు కనిపిస్తున్నాయి.

బంజారా	తెలుగు
/క/ అక్షర్	అక్షరము
/గ/ ఝుగ్లా	చొక్కా
/చ/ ఖర్చ్	ఖర్చు
/జ/ జ్యాద	ఎక్కువ
/ట/ పోట్లి	
చిన్నమూట	

సంధి విజ్ఞానం

సంధి నిర్వచనం

"పూర్వ పర స్వరంబులకు పర స్వరం బేకాదేశంబగుట సంధి యనంబడు"(బాలవ్యాకరణం).

త్వరితోచ్చారణలో అవ్యవహితంగా వచ్చిన శబ్దాల్లో జరిగే ధ్వనుల మార్పిడి సంధి. వ్యవహితాచ్చారణలో పదాల మధ్య సంధి ప్రవర్తించదు. స్వర లోపమూ, దాని ఫలితంగా దగ్గరగా వచ్చిన వ్యంజనాల్లో సమీ కరణాది మార్పులు తెలుగు సంధిలో జరుగుతాయి.

కొన్ని అర్థకాలు కలిసి పదంగా ఏర్పడేటప్పుడూ, కొన్ని పదాలు కలిసి వాక్యంగా ఏర్పడేటప్పుడూ వాటిలో ధ్వనుల పరస్పర ప్రభావం వల్లనో లేక చారిత్రక కారణాల వల్లనో మార్పు చెందుతూ ఉంటాయి. ఇటువంటి ధ్వనుల మార్పును సంధి అంటారు.

రెండు మాటలను కలిపి ఉచ్ఛరించేటప్పుడు ఆ మాటల్లో కలిగే మార్పును సంధి అని వ్యవహరిస్తున్నారు.

బంజారా భాషా సంధులు

1. పదాంతములోని క, చ, ట, త, పలు నాద హల్లుల ముందు నాదాలుగా మారుతాయి.

బంజారా	తెలుగు
క భుక్	ఆకలి
భుక్‌లాగ్	
ఆకలివేయు	
చ పూచ్	అడుగు
పూచ్‌గో	
అడిగివెళ్ళాడు	
ట కాట్	నరుకు
కాట్‌నాక్	
నరికివేయు	
త గీత	గీత
గీత్‌కాడ్	గీతగీయు

నామ ప్రాతిపదికలు

నామ ప్రాతిపదికలు మూడు రకాలు 1. సామాన్యం 2. సంశ్లిష్టం 3. సమాసం సామాన్య ప్రాతిపదికలలో దేశ్యాలు, ఎరువు ప్రాతిపదికలు ఉన్నాయి. ఉదా: పేర్లు, గోనె మొదలైన

దేశ్య పదాలు, ఎరువు ప్రాతిపదికలలో తెలుగుభాషా చరిత్ర మొదటిదశ నుండి హిందార్వ భాషలకు సంబంధించిన అనేకం కనిపిస్తున్నాయి. మహ్మదీయుల పరిపాలన కారణంగా పర్సో–అరబిక్ పదాలన్నో చేరాయి. ఉదా: పరునామా, ఖరారు మొదలైనవి. ఇవి కాకుండా సోదర ద్రావిడ భాషలైన తమిళ, కన్నడ భాషల నుంచి వచ్చిన అనేక ఆదానాలు తెలుగులో కనిపిస్తాయి.

దేశ్య నామాలను ప్రాథమిక దేశ్య నామాలు, నిష్పన్న దేశ్య నామాలు అని విభజించవచ్చు. ప్రాథమిక దేశ్య నామాలలో మళ్ళీ రెండు ఉప విభాగాలు ఉంటాయి. అవి లింగ బోధక ప్రత్యయం చేరనివి, లింగ బోధక ప్రత్యయం చేరేవి. లింగ బోధక ప్రత్యయాలు చేరే నామాలలో మహద్వాచకాలు, మహతీ వాచకాలు, మహతీతరా మహద్వాచకాలు అని విభజితమౌతున్నాయి. లింగ బోధక ప్రత్యయం చేరని నామాలలో మహద్వాచకాలు, అమహద్వాచకాలు, మహతీతరా మహద్వాచకాలు అనే ఉప విభాగాలుగా విభజితమౌతున్నాయి. ఇక్కడ లింగ బోధక ప్రత్యయం చేరే నామాలను పేర్కొంటున్నాను.

1. మానవ సంబంధమైనవి:	మనిక్య (మనిషి) మహద్వాచకం, మహతీవాచకం ఎవరైనా కావచ్చు.
మహద్వాచకం:	బంజారా: దాదా, కాక, ససరో, సాళో
	తెలుగు: తాత, చిన్నాన్న, మామ, బావమరిది
మహతివాచకం:	బంజారా: బాయి, నాని, మోటాడి
	తెలుగు: అక్క, అమ్మమ్మ, పెద్దమ్మ
2. మానవేతర సంబంధమైనవి:	బంజారా: సాళా, బళద్, ఉందర్
	తెలుగు: నక్క, ఎద్దు, ఎలుక
3. అప్రాణ వాచకాలు:	బంజారా: పాక, ఘర్, కోరాడి
	తెలుగు: పందిరి, ఇల్లు, గొడ్డలి
4. ద్రవ్య వాచకాలు:	బంజారా: దయి, కాడో, దూద్
	తెలుగు: పెరుగు, బాలింతకు పెట్టే పాయసం, పాలు
5. భావ వాచకాలు:	బంజారా: దామ్, కాత్, కో, జో, కమా
	తెలుగు: వెల, వడుకు, తిను, వెళ్ళు, సంపాదించు
6. వ్యక్తుల పేర్లు:	బంజారా: బాలు. లాలు, తావుర్యా, బిక్కు, సోని, మోతి, చాంది.
7. స్థల నామాల పేర్లు:	బంజారా: మీట్యాతాండో, మేగ్యతాండో, భోజ్యతాండో
	తెలుగు: మీట్యాతండ, మేగ్యతండ, భోజ్యాతండ

ఆదాన రూపాలు

ప్రతి భాషకు అన్య భాష సంపర్కం అనేది ఉంటుంది. ఒక భాషా వ్యవహార ప్రాంతానికి పక్కన ఉన్నఇతర భాషలతోను, సోదర భాషలతోను, సహ సంబంధం కలిగి ఉంటుంది. అందువలన ఒక భాష పదాలు, నామాలు ఇంకోక భాషలో చేరడం జరుగుతుంది.

కొందరు కాని, కొన్ని సముహాలుగాని ఒకటి కన్నా ఎక్కువ భాషలు మాట్లాడుతూ ఉండవచ్చు. ఒక భాష మాట్లాడే ఒక సముదాయం వారు వలసవెళ్ళి మరొక భాష మాట్లాడే ప్రాంతంలో స్థిరపడడం వల్లా, ఒక భాషా ప్రాంతాన్ని మరొక భాషకు చెందిన పాలకులు ఆక్రమించి పరిపాలించడం వల్లా ద్విభాషా వ్యవహారం (bilinguastism) కాని, బహూ భాషా వ్యవహారం (multi linguastism) కాని ఏర్పడుతూ ఉంటుంది. ఇటువంటప్పుడు సాధారణంగా ఈ భాషలో ఒకటి ఉన్నతస్థాయి భాష(prestigelanguage)గా ఉంటుంది. పాలకుల భాష అవడం వల్ల గాని, సంఖ్యా బలం వల్ల గాని ఒక భాషకి గౌరవ స్థానం లభిస్తుంది.

బంజారాలు తెలుగు భాషా మాట్లాడే వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఉండడం వలన బంజారా భాషలో తెలుగు భాష పదాలు ఆదానాల రూపంలో చేరినాయి.

తెలుగు
పదాలు

అప్పు
గడ్డం
మూత
పుస్తా
కర్రు
కొలిమి

గీత
బండి
గంట
పట్టీల్
గుడి
ఉసిక
చదువు
జనం

ఇలా తెలుగు పదాలు ఈ భాషలో ఆదాన నామాలుగా చేరిపోయాయని తెలుస్తున్నది. చాలా మంది బంజారాలు ఈ పదాలనే వ్యవహారంలో వాడుతుండడం గమనించవచ్చు.

వచనం

తెలుగులో వచనం రెండు రకాలు. ఒక వ్యక్తిని గురించి గాని, ఒక వస్తువు గురించి గాని, తెలిపేది ఏకవచనం. ఒకటికి మించిన వ్యక్తులను గురించి, వస్తువులను తెలిపేది బహువచనం.

1. బంజారా భాషలో ప్రాతిపదిక మీద ఓ ప్రత్యయం వలన ఏక వచన రూపం ఏర్పడుతుంది. అలాగే ఏ ప్రత్యయం వలన బహూ వచన రూపాలు ఏర్పడుతున్నాయి.
ఉదాహరణ:

బంజారా	తెలుగు
కార్ + ఓ = కారో	తింటున్నాడు
కార్ + రే = కారే	తింటున్నారు
చూట్ + ఓ = చూటో	ఒంటరి
చూట్ + ఏ = చూటే	ఒంటరివాళ్ళు

2. ఇ కారంతో అంతమయ్యే స్త్రీ లింగ పదాలు 'యే' అనే ప్రత్యయాన్ని చేర్చుకొని బహూవచనంగా మార్పు చెందుతాయి.
ఉదాహరణ:

బంజారా	తెలుగు
బాయి	అక్క
బాయి+యే	అక్కలు
బ్వాడి	కోడలు
బ్వాడి+యే	కోడళ్ళు

విశేషణాలు

వ్యక్తుల, వస్తువుల గుణ ధర్మాలను తెలిపే పదాలే విశేషణాలు అని వ్యవహరిస్తున్నాం. రెండు నామాలు ఒక చోట చేరినప్పుడు ఒకటి విశేషణంగా, ఇంకొకటి విశేష్యంగాను చెప్పబడుతుంది.

సామాన్య విశేషణాలు

నామం ముందు విశేష్యం చేరడం వలన సామాన్య విశేషణాలు ఏర్పడతాయి.

1. నామ వాచక లింగాన్ని బట్టి విశేషణ లింగ రూపం మారుతుంది.
ఉదాహరణ:

బంజారా	తెలుగు
గోరో ఆద్మి	ఎర్రని మగవాడు
గోర్ తాంఁడ్రి	ఎర్రని స్త్రీ
ఆచో చోరా	మంచి అబ్బాయి
ఆచ్ చ్వారి	మంచి అమ్మాయి

సంఖ్యా వాచకాలు

బంజారా భాషలో సంఖ్యా వాచకాలు క్రింది విధంగా ఉన్నాయి

సామాన్య సంఖ్యా వాచకాలు

బంజారా	తెలుగు
ఏక్	ఒకటి
ది	రెండు
తీన్	మూడు
చార్	నాలుగు
పాంచ్	ఐదు
చో	ఆరు
సాత్	ఏడు
ఆట్	ఎనిమిది
నవ్	తొమ్మిది
దస్	పది

సమాసాలు

"సమర్థంబులగు పదంబు లేక పదంబగుట సమాసంబు" (బాలవ్యాకరణం సమాస: 1) వేరు వేరు అర్థాలు గల రెండు పదాలు ఒకే పదం అగుట ద్వారా సమాసం ఏర్పడుతుంది. సమాసంలోని మొదటి పదాన్ని పూర్వ పదం అని రెండవ పదాన్ని ఉత్తర పదం అని వ్యవహరిస్తారు. సమాసాన్ని వేరు చేసి దాని అర్థం పద బంధ రూపంలో గాని, వాక్య రూపంలో గాని చెబితే దాన్ని విగ్రహ వాక్యం అంటారు. బంజారాభాషలో సమాసాలు ఈ విధంగా ఉన్నాయి.

ఈ సమాసంలో రెండు పదాలకు సమానమైన ప్రాధాన్యత ఉంటుంది. ఈ సమాసంలోని రెండు పదాలు నామ వాచక పదాలే అయి ఉంటాయి.

క్రియా నిర్వచనం

క్రియా అనగా పనిని తెలుపునది అని అర్థం. క్రియ లేనిదే వాక్యం, దానికి సంబంధించిన భావం సంపూర్ణతను సంతరించుకోలేవు. బాలవ్యాకర్త "ధాతువునకు" అని అధికార సూత్రం చెప్పడం జరిగింది. క్రియా రూపాలు క్రియా ప్రాతిపదికల నుంచి ఏర్పడతాయని చెప్పవచ్చు.

అకర్మక సకర్మక క్రియలు

	అకర్మకం	సకర్మకం	
ఉదా: బంజారా	**తెలుగు**	**బంజారా**	**తెలుగు**
చడ్	ఎక్కు	చడా	ఎక్కించు
కర్	చేయు	కరా	చేయించు
మార్	కొట్టు	మరా	కొట్టించు
తోడ్	విరుచు	తోడా	విరిపించు

సకర్మకరా ప్రేరణార్థకం

	సకర్మకం	ప్రేరణార్థకం	
ఉదా: బంజారా	**తెలుగు**	**బంజారా**	**తెలుగు**
బాళ్	కాల్చు	బళా	కాల్పించు
ఫోడ్	పగులగొట్టు	ఫోడా	పగులకొట్టించు
బోల్	మాట్లాడు, పాడు	బోలా	మాట్లాడించు, పాడిపించు

సమాపక క్రియలు

వాక్యం భావాన్ని పూర్తి చేయ గల వాటిని సమాపక క్రియలు అంటారు. ఈ భాషలో వీటిని కింది విధంగా చూపించవచ్చు.

భూతకాలం

జరిగిపోయిన పనిని గురించి తెలియ జేస్తుంది.

భూతకాల రూపం = ధాతువు + భూతకాల ప్రత్యయం + పురుష ప్రత్యయం

అసమాపక క్రియలు

వాక్యం భావాన్ని పూర్తి చేయలేనటువంటి వాటిని అసమాపక క్రియలు అంటారు. వీటిని ఉపయోగించి వాక్యాలను ఎక్కువగా పొడగించే అవకాశం ఉన్నది.

ధాతుజ విశేషణాలు

ధాతువు నుండి పుట్టిన విశేషణాలు అని చెప్పవచ్చు.

భూతకాల ధాతుజ విశేషణం+భూత కాల ప్రత్యయం

ఉదా:

బంజారా	తెలుగు
కోర్+ఒ=కోరో	ఎంచుకున్న
చోల్+ఒ=చోలో	చెక్కిన

క్త్వార్థకం

భూతకాలిక అసమాపక క్రియా రూపం క్త్వార్థం. ఇది ఇ కారాంతమై ఉంటుంది. బంజారా భాషలో ధాతువు+అన్

ఉదా:

బంజారా	తెలుగు
చడ్+అన్=చడన్	ఎక్కి
క+అన్=కాన్	చెవి

శత్రర్థకం

వర్తమాన కాలము అసమాపక క్రియను శత్రర్థకము అని అంటారు. ఈ భాషలో స ను చూపించవచ్చు.

ఉదా:

బంజారా	తెలుగు
జావసకు	వెళ్ళగలను
జావసకా	వెళ్ళగలం
జావసక్	వెళ్ళగలవు
జావసకో	వెళ్ళగలరు

వాక్య విజ్ఞానం

వాక్యం

భాష వ్యవస్థలో గుర్తించదగిన విశ్లేషణ స్థాయి, వాక్య స్థాయి తన మనోభావాల్ని, అభిప్రాయాల్ని స్పష్టంగా ఇతరులకు తెలియజేయడానికి, ఇతరుల అభిప్రాయాలను, భావాలను తెలుసుకోవడానికి వాక్యం బాగా ఉపయోగపడుతుంది.

వాక్య భేదాలు

వాక్యాలను ఏభాషలోనైనా సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా విభజించవచ్చు. ఒక వాక్యంలో నిర్దిష్ట స్థానంలో ఇంకోక వాక్యాన్ని చేరిస్తే సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకో వాక్యాన్ని చేరిస్తే సంయుక్త వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకోక వాక్యాన్ని చేర్చినప్పుడు కొన్ని మార్పులు జరుగుతై. ఈ మార్పుల అనంతరమే సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు ప్రయోగార్హాలు అవుతై. ఈ దృష్టితో చూసినప్పుడు సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల్లో సామాన్య వాక్య లక్షణాలుండటం ఆశ్చర్యం కాదు.

పై నిర్వచనాన్ని ఆధారంగా చేసుకొని బంజారా భాషలో గల వాక్యాలను కూడ సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా విభజించి అధ్యయనం చేయవచ్చు.

సామాన్య వాక్యం

సామాన్య వాక్యాలు రెండు రకాలు. 1. క్రియారహితాలు 2. క్రియాసహితాలు

క్రియారహితాలు

ఇందులో మొదటి నామం ఉద్దేశ్యం, రెండో నామం విధేయం అయి ఉంటాయి. ఉద్దేశ్యంలో సర్వ నామం గాని, విశేష నామం గాని ఉండవచ్చు. విధేయంలో సిద్ధనామం గాని, విశేషణం నుండి వచ్చిన నామం గాని ఉండవచ్చు.

ఉదా:

బంజారా	తెలుగు
ఉ బాలాజి	అతను బాలాజి
ఈ లచ్మి	ఈమె లక్ష్మి
ఈ డోక్రి	ఈ ముసలామే
ఊ డోక్రా	ఆ ముసలివాడు

క్రియాసహితాలు

ఈ వాక్యాలలో క్రియ వాక్యం చివరన వస్తుంది.

ఉదా:

బంజారా	తెలుగు
మ గామేన జారోచు	నేను ఊరికి వెళ్తున్నాను
మన్ సీ లాగ్రోచ	నాకు చలిగా ఉంది

జాతీయాలు-సామెతలు
జాతీయం నిర్వచనం

భాషలో భావ వ్యక్తికరణ సందర్భంలో శ్రోత మనస్సుకు హత్తుకునేట్టు చెప్పటానికి సామెతలు, జాతీయాలు, అలంకారాలు ఉపయోగించడం జరుగుతుంది. భాష యొక్క అందం జాతీయాలలో ఇమిడి ఉంటుంది. ఒక భాష ప్రత్యేకతను జాతీయాలు పేర్కొంటాయని చెప్పవచ్చు. సమాజ స్వభావంలోని విలక్షణతకు జాతీయాలు ప్రతిబింబాలు. చెప్పే విషయం శ్రోత మనసులో హత్తుకు పోయేట్లుండాలంటే వీటి ప్రయోగం అవసరం.

జాతీయానికి నుడికారం, పలుకుబడి, పదబంధం అనే పర్యాయ పదాలు ఉన్నాయి. జాతీయాలు ఒకభాషా సమాజంలోని ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు తెలియజేస్తాయి. ఇవి అన్ని భాషా సమాజాలలోను వాడుకలో ఉన్నాయి.

బంజారా జాతీయాలు

బంజారా సమాజంలో వాడుకలో ఉన్న జాతీయాలలో కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1. బంజారా: వాంకో ముండేరో
తెలుగు: వంకర మూతి వాడా
2. బంజారా: కొత్రార్ బుద్ధి సరికో ఆద్మి
తెలుగు: కుక్క బుద్ధి గల మనిషి
3. బంజారా: కిడి సాంస మకోడ పాకి మారజు
తెలుగు: చీమ కూడ బెడితే గండు చీమ తిన్నట్లు
4. బంజారా: నశీబేర్ మాల్ నందీమా బగావతోయి యాయేని
తెలుగు: అదృష్టములో ఉంటే నదిలో వేసిన పోదు
5. బంజారా: తోన్ తాడన్ బగావు
తెలుగు: నిన్ను వెలి వేస్తా చూడు
6. బంజారా: ధర్మిర్ ధరం ఆడం ఆవజు
తెలుగు: ధర్మం గలవాడికి ఆ ధర్మమే ఆదుకున్నట్లు
7. బంజారా: హడ్డ కావజకో వలాదేరో
తెలుగు: మాంసం తినే వంశం కలవాడా
8. బంజారా: తార్ ఘర్ దూదేర్ జు ఉపణరో
తెలుగు: నీ ఇల్లు పాలలాగా పొంగుతోంది
9. బంజారా: గావడీన్ మారన్ భ్యాంసాన్ ఘాలోజు
తెలుగు: ఆవును కొట్టి దున్నపోతుకు వేసినట్టు
10. బంజారా: ఓర్ వేల్ కుడి వేలేజు వదీరేచ
తెలుగు: ఆయన వంశం చేదు తీగలాగా పెరుగుతుంది. (సామ.డి:80)

సామెతల నిర్వచనం

సామెత అనే మాట సామ్యత నుండి పుట్టిందని చెప్పుకుంటున్నాం. సంస్కృతంలో దీనిని "సూక్తి" అని "సుభాషితమని" ఆంగ్లంలో "ప్రోవెర్బ్" అని అంటున్నారు. సామెతలో ఒక వాక్యం గాని ఒకే పరిమాణం గల రెండు వాక్యాలు గాని ఉండవచ్చు. చివరికి సంఖ్యలో కూడా పోలిక కనిపిస్తుంది. అంటే సామెతలో రెండు భాగాల అక్షరాల సంఖ్య సమానంగా ఉంటుందన్నమాట. చేసిందిపోదు-చేయంది రాదు, చేసేవి లోపాలు - చెబితే కోపాలు, నలుగురు నడచిందే బాట - పలువురు పలికిందే మాట మొదలైనవి. సామెతల్లో సమానభాగాలు ఒకవేళ లేకున్నా ప్రాసాను ప్రాసలతో గూడిన లయ కనిపిస్తుంది. చంధో దృష్టితోచూస్తే వీటిలో ద్విపద పాదాలూ, తేటగీతి పాదాలూ, ఆటవెలది పాదాలూ కనిపించవచ్చు.

బంజారా సామెతలు

సామెతలు ఒక్కొక్క దాని వెనుక ఒక్కొక్క పరిపూర్ణ జీవిత సత్యమే దాగి ఉంటుంది. మానవుడు తన నిత్య జీవితంలో సుఖ దు:ఖాలన్నింటిని అనుభవసారంతో చెప్పుతున్నాడు. బంజారాల సామెతలు కూడ ఇలాగే ఉంటాయి.

లంబాడీల సామెతలు తరతరాల వారి అనుభవాల అంబుధి నుండి ఆవిర్భవించాయి. కథలు, గేయాలు, కథాగేయాలు మొదలైన ప్రక్రియల కంటే సామెత చాలా చిన్నది. కాని ఇది చేసే పని చాలా పెద్దది. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లు అల్పాక్షరాలతో అనల్పమైన అనుభవాలు సామెతలలో ఇమిడి ఉంటాయి. బంజారా సామెతలను 'సాకి' అని అంటారు.

1. బంజారా: ఏక్ ఆంకి కాణ్ నయి రేణు ఏక్ బేటా నయి రేణు

తెలుగు: ఒక కన్ను గుడ్డి ఉండకూడదు ఒక్కడే కొడుకు ఉండకూడదు

2. బంజారా: తన్ సంద్ జాయ పణణ్ మన్ సందేని

తెలుగు: శరీరం అతుక్కుంటుంది కాని మనసు అతకదు

3. బంజారా: హరే ఝాడే హేట దస్ జణా బ్యాస పణణ్ సూకే ఝాడే హేట కూణి బ్యాసేని

తెలుగు: పచ్చని చెట్టు కింద పది మంది కూర్చుంటారు కాని ఎండిన చెట్టు కింద ఎవరు కూర్చోరు.

పై విధంగా బంజారా, తెలుగు భాషలలోని ప్రాథమికాంశాలను సోదాహరణం చేయడం ద్వారా బంజారా భాష ఉనికి తెలుగు భాషతో సోదర సంబంధం ఎలా వుందనే విషయం ప్రస్ఫుటంగా అవగతమవుతుంది. దీనికి సంబంధించి అనేక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఇది ఒక శుభపరిణామంగా భావించవచ్చు. అలాగే, అరకులోయలో గిరిజన సంస్కృతి అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డా. జర్ర అప్పారావుగారు చేసిన పరిశోధన ఎందరో పరిశోధకులకు మార్గదర్శనం చేసింది. అలాగే ఇంకా అనేక కోణాల్లో పరిశోధనలు రావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఎన్నో విషయాల్లో నాగరిక ప్రపంచం కంటే కూడా అతిపురాతనమైన వ్యవస్థ కలిగిన ఈ గిరిజన తెగలు అన్నిటిపై తెలుగును పరస్పరం తులనాత్మకం చేస్తూ పరిశోధనలు వచ్చినట్లయితే అనాది నుండి ఉన్న దూరం చెరిగిపోవడానికి అవకాశం ఉంది. ఈ విషయంలో పత్రికలు, ప్రభుత్వం, విశ్వవిద్యాలయాల పరిశోధకులు వేగంగా అడుగులు కదపాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఈ పరిశోధన పత్రంలో తెలియజేయడం జరిగింది.

ఆధార గ్రంథాలు

1. కృష్ణమూర్తి, బి. 2000. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
2. కృష్ణమూర్తి, బి. 2000. భాషాసమాజరాసంస్కృతి. హైదరాబాదు: నీల్ కమల్ పబ్లికేషన్స్.
3. గోనానాయక్, ఎం. 2002. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు. హైదరాబాదు: లక్ష్మి పబ్లికేషన్స్.
4. గోనానాయక్, ఎం. 2005. భారతదేశంలో బంజారాలు. హైదరాబాదు: తెలుగు అకాడమి ప్రచురణ.
5. చిన్నయసూరి, పి. 1970. బాలవ్యాకరణం. వంతరాం రామకృష్ణారావు (వ్యాఖ్యాత) రాజమండ్రి: ప్రభుత్వ కళాశాల.
6. చీనియానాయక్, బి.1998. బంజారా చరిత్ర – సంస్కృతి – ప్రగతి. అనంతపురం: హాథీరాం బావాజి పబ్లికేషన్స్.
7. తిరుపతి, బి. 2005. లంబాడి భాష సాహిత్యాలపై తెలుగు భాష ప్రభావం. ఎం.ఫిల్: హైదరాబాదు విశ్వ విద్యాలయం.
8. దక్షిణామూర్తి, పి. 2007. భాష ఆధునిక దృక్పథం. హైదరాబాదు: నీల్ కమల్ పబ్లికేషన్స్.
9. నర్సింగ్‌నాయక్, ఆర్. 2005. బంజారా – తెలుగు నిఘంటువు. (తెలుగు లిపిలో) హైదరాబాదు: కళాంజలి గ్రాఫిక్స్
10. పద్మావతి బాయి, కె. 2005. తెలుగు సామెతలు–బంజారా సామెతలు తులనాత్మక పరిశీలన.
11. పవన్‌కుమార్, పి. 2003. కట్టా వరదరాజు ద్విపద రామాయణం: భాషా పరిశీలన. పిహెచ్.డి హైదరాబాదు విశ్వవిద్యాలయం అముద్రితం.
12. పురుషోత్తం, బి. 1982. భాషా శాస్త్ర పరిశీలన. నరసరావుపేట: నాగలక్ష్మి గ్రంథమాల.
13. మోహన్ జి,యస్. 2001. జానపద విజ్ఞానాధ్యయనం. కుప్పం:ద్రావిడ విశ్వవిద్యాలయం.
14. రాధాకృష్ణ బి. 1999. తెలుగు జాతీయాలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్స్.
15. రాధాకృష్ణమూర్తి, వేమూరి.,సుబ్బారావు, టివిఆర్, కె. 2003. హింది– తెలుగు–ఇంగ్లీషు త్రి భాషా–డిక్షనరి. న్యూఢిల్లీ: లింక్ పబ్లికేషన్స్
16. రామారావు, సి.హెచ్. 1998. తెలుగు వాక్యం. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.
17. శంకరయ్య, జె. 2001. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.
18. సరస్వతి పి. 2006. తెలంగాణ జానపదుల వంటలూ ఆరోగ్యాంశాలు. హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్.
19. సుబ్రహ్మణ్యం, పి.యస్. 2004. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం.

రచయిత: పరిశోధకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

సాహిత్య
పరిశోధన

నలిమెల భాస్కర్ నానీలు-వస్తువైవిధ్యం

● రేణ ఈశ్వరయ్య

పరిశోధన పత్ర సంక్షిప్తి:

కవి తన కవిత్వంలో తాను జీవించిన సమకాలీన పరిస్థితులు, అనుభూతులు, ప్రతిఫలిస్తాయి. అందుకు ఆయన జీవించిన కాలం ప్రభావితం చేస్తుంది. నలిమెల భాస్కర్ తాను పుట్టిన ప్రాంతం మీద ఉన్న అభిమానం ఆ ప్రాంతంలోని పండుగలు, జాతరల విశిష్టత, జన్మనిచ్చిన మట్టి మీద మమకారం, రైతుల, శ్రామికుల మీద గౌరవం, ప్రకృతి మీద ప్రేమ, తన ప్రాంతం దోపిడీకి, వంచనకు గురవుతుందన్న ఆవేశం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష , ఆయన వ్యక్తిత్వం ప్రతిఫలించే వాటినే వస్తువుగా చేసుకొని 'నానీ'లలో చిత్రించాడు. ఆ వస్తు వైవిధ్యాన్ని నిక్షిప్తం చేయడమే నా వ్యాస ఉద్దేశం.

కీలక పదాలు: *నలిమెల భాస్కర్, ప్రకృతి, వ్యవసాయం, నానీలు, రైతు జీవితం*

పరిచయం:

నలిమెల భాస్కర్ కవి, రచయిత, అనువాదకుడు, పరిశోధకుడు, వ్యాసకర్త, తెలంగాణ భాషా పదకోశం నిర్మాణ కర్త, మంచి వక్త. 14 భాషలను అవపోసన పట్టిన బహుభాషా వేత్త. ఆయా భాషల్లోని సాహిత్యాన్ని తెలుగు నేలకు అందించాలని తండ్లాడిన మనిషి. ఆ కోవలోనే ఇతర భాషల్లోనికథ, నవల, కవిత, వ్యాసం, వంటి ప్రక్రియల్లోని సాహిత్యాన్ని అనువదించాడు.

సృజనాత్మక సాహిత్యంలో కవిత్వం, కథ, గేయం, వ్యాసం వంటి ప్రక్రియలతో పాటుగా నానీలు కూడా వారి కలం నుంచి వెలువడినాయి.

నలిమెల భాస్కర్ నానీలలో రైతు జీవన చిత్రణ, తెలంగాణ బతుకు చిత్రణ,బతుకమ్మ వైశిష్ట్యం, ప్రకృతి వర్ణన,మట్టి ఔన్నత్యం, వాస్తవిక దృష్టి, శ్రమ సౌందర్యం మొదలైన వస్తు వైవిధ్యం నానీ లలో కనిపిస్తుంది.

రైతు జీవన చిత్రణ:

ప్రతీ కవి సామాజిక దృక్పథం కలిగి ఉంటాడు.నలిమెల భాస్కర్ మధ్యతరగతి రైతుబిడ్డ. కావున రైతుల కష్టనష్టాలను కల్లారా చూసినవాడు, రైతు విలువ, శ్రమ సౌందర్యం తెలిసినవాడు. అందుకే కవి నానీలలో కూడా రైతు జీవితాన్ని చక్కగా ఆవిష్కరించాడు. అలతి పదాల్లోనే అనల్పర్థాన్ని చిత్రించాడు.

"ఖానేవాలే కా
నామ్ ఛోడో
ప్రతి గింజ మీద
రైతు సంతకం ఉంది"

అని రైతు శ్రమ విలువను గుర్తించి నొక్కి వక్కానించాడు. ఆరుగాలం కష్టంచేసి పంట పండించిన రైతన్నను మనం తినేటప్పుడు గుర్తుపెట్టుకోవాలని శ్రమ సౌందర్యానికి గౌరవాన్ని అపాదించాడు.

"నాగలితో
తెడ్డు వేస్తున్నాడు
ఏ దరికి చేరునో
రైతు బిడ్డ"

రైతు పరిస్థితి నడి సముద్రపు నాటు పడవలా ఉందని, తీరం, గమ్యం తెలియని నావికుడిలా రైతన్న వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడని, చివరగా అతడు ఏ దరికి చేరుతాడోనని రైతు ఆవేదనను తన ఆవేదనగా కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. మరొక నానీలో

"రైతుకు
గిట్టుబాటు ధర రాలేదని
మిర్చీ కూడా
కళ్ళెర్రా చేస్తోందా !

రైతుకు కష్టం మాత్రమే తెలుసు. దాని ఫలితాన్ని ఎలా పొందాలనేది తెలియదు -- ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే తగిన గిట్టుబాటు ధర రాలేదని ఆ పంటే దుఃఖించి కళ్ళెర్రా చేస్తోందా? ఆ వ్యవస్థలోని దళారి వ్యవస్థను, లోపభూయిష్టమైన మార్కెట్ వ్యవస్థను ఎత్తి చూపుతూ మిర్చి రూపంలో కవి ఎద్దేవా చేశాడు. శ్రమించిన వాడికి ఫలితం దక్కడం లేదనే సత్యాన్ని తెలియజేస్తూ

"అన్నం
కుత కుత ఉడుకుతోంది
పండించిన వాడికి
అందలేదనేమో"

ఎంతో కష్టపడి పంట పండించి దేశానికే అన్నం పెట్టే రైతన్నకు చివరిగా తినడానికి తిండి దొరకడం లేదనే నగ్న సత్యాన్ని తెలియజేస్తూ అన్నం కూడా కుతకుత ఉడుకుతూ బాధపడుతున్నదని వాస్తవిక స్థితిని కవి చిత్రించాడు.

"రైతు భుజం మీద
బలరాముడి ఆయుధం
మరి
బలహీనుడయ్యాడేలా

బలరాముడి ఆయుధం నాగలి. ఆ నాగలి రైతు భుజం మీద ఎప్పుడూ ఉంటుంది. ఆ ఆయుధాన్ని ధరించి వ్యవసాయం చేస్తే రైతు బలవంతుడు (సంపన్నుడు) కావాలి. కాని దానికి విరుద్ధంగా మహాభారత కాలం నుండి నేటి వరకు బలహీనుడవుతున్నాడు. అనేటువంటి వాస్తవ పరిస్థితిని మన కళ్ళ ముందు సాక్షాత్కరింపజేశాడు.

"దున్నేవాడిదే
భూమి లాగా
పండించే వాడిదీ
బువ్వ కావాలి"

ఎన్నో రైతాంగ పోరాటాల ఫలితంగా జమీందారీ, భూస్వామ్య వ్యవస్థ పోయి భూ సంస్కరణ చట్టాలు వచ్చాయి. వీటి ద్వారా రైతులకు కొంత మేలు జరిగింది. కాని ప్రస్తుతం పండించినవాడికి తగిన ఫలితం దక్కడంలేదని, శ్రమించే వాడికి తిండికూడా దొరకడం లేదని, సమాజంలో అసమానతలు ఇంకా అలానే ఉన్నాయని,రైతు శ్రమ విలువను గుర్తించి పండించిన వాడికి కొంతైనా ఫలితం దక్కి అతడు సుఖంగా జీవించాలని కవి కాంక్షించాడు.

వర్షాకాలంలో తొలకరి చినుకులు కురియంగానే రైతులు తమ వ్యవసామ పనిముట్లను సిద్ధం చేసుకుంటారు. రైతు దుక్కి దున్నడానికి ఉపయోగించే నాగలి ప్రత్యేకమైనది దీనిని కవి వర్ణిస్తూ

"వాన చినుకుల
సుప్రభాతానికి
నిద్ర లేచింది
నాగలి"

వేసవి కాలంలో నాగలిలో రైతులకు పని ఉండదు కాబట్టి తొలకరి చినుకుల సుప్రభాతానికి నాగలి నిద్ర లేచింది అనడం ఔచిత్యంగా ఉంది. అంటూ కవి సంతోషాన్ని వ్యక్తపరిచాడు.

"పుడమి గిన్నెలో
చెమట పోసి
నాగలితో కలిపితే
అన్నం తయారు."

అన్నం తయారు కావడానికి ఎంతో ప్రయాస ఉంటుందని భూమిని గిన్నెతో, నాగలిని చేతులతో, శ్రమను చేతులతో పోలుస్తూ రైతన్న కష్టాన్ని, శ్రమ విలువను తెలియజేశాడు.

రైతన్నకు మట్టి స్వభావం బాగా తెలుసు.రైతుకు మట్టికి విడదీయని అవినాభావ, ఆత్మీయ సంబంధం ఉంది. మట్టిలో గింజ నాటినది మొదలు అది పెరిగి ధాన్యంగా మారే వరకు తల్లి తన పిల్లల్ని లాలించి పెంచినట్టుగా రైతు పంటను జాగ్రత్తగా కాపాడుతాడు. ప్రతి పంట ఎదుగుల రహస్యం రైతన్నకే తెలుస్తుందని రైతు యొక్క సమస్త జీవితాన్ని నానీలలో ఆవిష్కరించాడు.

తెలంగాణ చిత్రణ:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కవి నలిమెల భాస్కర్ పాల్గొన్నాడు. ముఖ్యంగా తెలంగాణ భాషావిశిష్టతను, అస్తిత్వాన్ని నిలుపడానికి భాషావరంగా తెలంగాణ పదకోశాన్ని శాస్త్రీయంగా ప్రచురించాడు. భాషాపరంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రధానపాత్ర పోషించాడు. అంతే కాకుండా తెలంగాణ ప్రజలు మాట్లాడేది భాష కాదు, యాస మాత్రమే అన్న సీమాంధ్రులకు ఈ పదకోశం ద్వారా గట్టి సమాధానమిచ్చాడు.

తెలంగాణ రాష్ట్ర గొప్పదనాన్ని, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వలసవాదుల దోపిడీని నిరసిస్తూ..... నానీల రూపంలో ఎత్తి చూపుతూ ప్రజల్లో చైతన్యం కలిగించాడు.

"చిన్న రాష్ట్రాలు
కావు కావు అన్న కాకులే
ఐతయి
అనక తప్పదు రేపైనా"

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న తరుణంలో సీమాంధ్ర రాజకీయ నాయకులు, చిన్న రాష్ట్రాలు ఏర్పడవు అని కారు కూతలు కూశారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఈ రోజు వ్యతిరేకించిన వారే రేపు (భవిష్యత్తు) తప్పక ఒప్పుకుంటారని ఆకాంక్షించారు . కవి ఆకాంక్షించినట్టుగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. అంతకు ముందే తెలంగాణ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన ప్రాంతం. 1956 నవంబర్ 1న తెలంగాణాను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసినప్పటి నుండి కష్టాలు మొదలయ్యాయని

"యాభై యార్నుండి
తెలంగాణా మోయలేని
బరువొకటి
నవంబరు వొకటి"

1956 నవంబర్ 1 నుండి సీమాంధ్ర నాయకులు నీళ్ళు, నిధులు, నియామకాలు ఇలా అన్ని రంగాలలో తెలంగాణ ప్రజలను దోపిడీకి గురుచేస్తున్నారని ఆ బరువు దిగిపోవాలంటే ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆకాంక్షించాడు.

భారతదేశంలో కాశ్మీరుకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో చరిత్ర, సంస్కృతి పరంగా తెలంగాణకు అంతకంటే ప్రాధాన్యత ఉంది. భారతదేశ పటాన్ని గమనించినట్లైతే భౌగోళికంగా కాశ్మీరును శిరస్సుగా భావిస్తారు. మానవ దేహంలో ముఖ్యమైన

అవయవం గుండె కాబట్టి అది తెలంగాణే అని తెలంగాణ ప్రాముఖ్యాన్ని నొక్కివక్కానించాడు.

"నీళ్లిక్కడియి
పార్కం అక్కడ
మనుషులక్కడోల్లే
దోప్కం యిక్కడ"

తెలంగాణ ప్రాంతం ఎన్నో సహజ వనరులున్న ప్రాంతం. ఇక్కడ కృష్ణా, గోదావరి లాంటి జీవనదులు ప్రవహిస్తున్నప్పటికీ పరిపాలించే నాయకులు సీమాంధ్ర నాయకులు కావడం వలన తెలంగాణాలో ప్రాజెక్టులు కట్టక,ఇక్కడి భూములకు పార్కం లేకుండా భీడు భూములుగా మారుస్తున్నారని, ఈ నీళ్ళ దోపిడి ఆగాలంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాడాలని, స్వయం పరిపాలన జరగాలని కవి కాంక్షించాడు.

"సార్థకమైన పేరు
సర్కారు ప్రాంతం
దొరతనం ఎపుడూ
వాళ్ళది కాదా"?

'పెద్దమనుషుల' ఒప్పందానికి తూట్లు పొడిచి తెలంగాణ ప్రాంత నాయకులను ముఖ్యమంత్రులు కాకుండా చేసి సర్కారు ప్రాంతం (ఆంధ్రప్రాంతం) వాళ్ళే ముఖ్యమంత్రులు కావడం, ఇతర ముఖ్యమైన పదవులు వారే తీసుకోవడాన్ని ఇలా తెలంగాణ ప్రాంతవాసులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎద్దేవా చేశాడు. ఈ రకంగా తెలంగాణకు రాజకీయంగా మరియు సహజ వనరులను దోచుకుంటున్న తీరును, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను తెలియజేస్తూ ప్రజల్ని చైతన్యపరిచాడు.

బతుకమ్మ వైశిష్ట్యం:

కవి తెలంగాణ ప్రాంత సాంస్కృతిక వైభవాన్ని నానీలలో చిత్రించాడు. బతుకమ్మ, బోనాలు పండుగలు ఇక్కడి సాంస్కృతిక చిహ్నాలు. ఇందులో కవి బతుకమ్మ పండుగ ప్రాముఖ్యాన్ని ఉన్నతంగా వర్ణించాడు. ఇది తెలంగాణ ఆడపడుచులు ఆడుకునే పండుగ. దీనిని స్త్రీలు తమ సౌభాగ్యం బాగుండాలని తీరొక్క పూలను పేర్చి, ఆటపాటలతో తొమ్మిది రోజుల పాటు సామూహికంగా గౌరమ్మను ఆరాధించి జరుపుకుంటారు.
బతుకమ్మ పండుగ విశిష్టతను తెలుపుతూ కవి

"పీఠ మీద బతుకమ్మా
పీఠభూమి తెలంగాణ
రెండూ
ఒక్కటే"

అని స్త్రీలు బతుకమ్మను తంగేడు, గునుగు, గుమ్మడి, గన్నేరు, సీతజడ, కట్ల, టేకు, బంతి, చామంతి ఇలా తీరొక్క పూలతో పేర్చి పీటమీద పెట్టి పూజించటం ఆనవాయితీ. బతుకమ్మ పీట మీద ఎంతటి గౌరవాన్ని పొందుతుందో తెలంగాణ పీఠభూమి ప్రాంతానికి కూడా అంత గౌరవం, పసిద్ధి ఉన్నాయని అందుకే ఈ రెండూ ఒకటేనని, ఈ ప్రాంత ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు.

బతుకమ్మ పండుగలో భాగంగా చివరి రోజైన సద్దుల బతుకమ్మ రోజు తీరొక్క పూలతో పెద్దగా పేర్చుకున్న బతుకమ్మలను సాయంత్రం చెరువు దగ్గర ఆడిన తర్వాత "పోయిరా బతుకమ్మ, పోయిరావమ్మా మళ్ళొచ్చే యాదాది తిరిగి రావమ్మా" అంటూ బతుకమ్మలను చెరువు నీటిలో వదులుతారు. ఈ దృష్యాన్ని కవి వర్ణిస్తూ ..

"చెరువుల నిండా
పూల హారతులు
అవును కదూ/
నిన్న బతుకమ్మ పండుగ"

సద్దుల బతుకమ్మ రోజు బతుకమ్మలపై దీపాలు (హారతులు) పెట్టి ఆటాడిన తర్వాత వాటిని చెరువులో వదిలిన తర్వాత కనబడే సుందర దృశ్యం చూపరులను ఆకట్టుకుంటుంది. అందుకు కవి చెరువులనిండా పూల హారతులు అని కార్తిక మాసపు పండుగను గుర్తు చేశాడు. ఇట్లా కవి బతుకమ్మ పండుగలోని సౌందర్యాన్ని పండుగ ఔన్నత్యాన్ని పలు రకాలుగా వర్ణించాడు.

ప్రకృతి వర్ణన:

కవి ప్రకృతి ప్రేమికుడు. నింగి, నేల, చెట్లు, పూలలో జరిగే అద్భుత అంశాలను అలతి అలతి పదాల్లోనే అందంగా నానీలలో చిత్రిస్తూ ప్రకృతి వైశిష్ట్యాన్ని దాని ఆవశ్యకతను వర్ణించాడు.

"చెట్టు నెత్తి నిండా
నెత్తుటి పూలు
ఏమిటవి?
అందాల మందారాలు"

అంటూ ప్రకృతిలోని మందార చెట్టు పూల సౌందర్యాన్ని వర్ణించాడు. మందార పూలు ఎర్రగా ఉంటాయి. అవి చెట్టు కొమ్మల పైభాగాన విరగబూస్తాయి. అందుకే కవి చెట్టు తలనిండా ఎర్రని పూలు అని పూల వర్ణాన్ని చిత్రించాడు.
మరొక నానీలో వసంత ఋతువు గురించి వర్ణిస్తూ ...

"వసంత ఋతువు
అందాల పోటీ
నిర్వహిస్తోంది పూల అమ్మాయిలతో"

వసంత ఋతువులో చెట్లన్నీ చిగురించి పూలు పూస్తాయి. ఈ సుందర దృష్యాన్ని కవి అమ్మాయిలలో ఏవిధంగానైతే అందాల పోటీలు నిర్వహిస్తారో అలాగే ఇక్కడ వసంత ఋతువే పూలు అనే అమ్మాయితో అందాల పోటీలు నిర్వహిస్తుందని వసంతఋతువు సౌందర్యాన్ని, ఆహ్లాదాన్ని వర్ణించాడు. మరొక నానీలో వసంతంలో పూసే వేరు, వేరు పువ్వులను చూసి దాని

అందానికి ముగ్ధుడై ఇంత సూక్ష్మంగా ఎవరు వేపపువ్వును చెక్కుతున్నారని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

కవి మొక్కజొన్న చెట్టు సౌందర్యాన్ని అందాల రాణితో పోలుస్తూ..

"ప్రపంచ పంటల/
అందాల రాణి
మొక్క జొన్న/
పైన కుచ్చుల కిరీటం"

'అందాల పోటీలలో నెగ్గిన అమ్మాయికి కిరీటం పెట్టి అందాలరాణిగా కీర్తించటం ఆనవాయితీ. ప్రపంచ పంటలలో మొక్కజొన్న కంకులకు తప్ప ఏ పంటకు కుచ్చులు ఉండవు. అందుకే కవి ప్రపంచ పంటల అందాల రాణి మొక్కజొన్న అని వర్ణించాడు.

కవిది సున్నిత మనస్తత్వం ప్రకృతిలో ప్రతి సౌందర్యాన్ని ఆస్వాదించడమే గాక దానిపట్ల తన స్పందనను నానీలలో చేర్చాడు. కొత్తిమీర ఆకులను చూసిన కవి దానిని వర్ణిస్తూ.

"కొత్తి మీర ఆకుల్ని
ట్రిం చేశారెవరో
ఆ బుజ్జి కత్తెరను
చూడాలి"

కొత్తి మీర ఆకులను, చిన్న కత్తెరతో ఎవరో ట్రిం చేశారని ఆ కత్తెరను చూడాలనడం కవి యొక్క సూక్ష్మ పరిశీలనకు నిదర్శనం.

"మా నవ్వుల్ని కోసుకెళ్ళాక
చెట్లు బోసి పోయినై
నా కంట్లో
కన్నీటి పుష్పాలు"

చెట్లకు విరగబూసిన పువ్వులను నవ్వులతో పోలుస్తూ ఆ పువ్వులను మనుషులు కోసుకెళ్ళాక చూస్తే చెట్లు కళావిహీనమైనవి. అందుకు తన కంట్లో నీళ్ళు తిరిగాయని పువ్వుల మీద తనకున్న ప్రేమను చాటుకున్నాడు. అంతే గాకుండా చెట్లను ప్రేమించే తన మనస్తత్వాన్ని చూసే, చెట్లు గాలికి కాకుండా తనను చూసే సంతోషంతో తలలూపుతూ పలకరిస్తున్నాయని మురిసిపోయాడు.

మట్టి ఔన్నత్యం:

కవికి మట్టి అంటే ప్రాణం. మనిషికి మట్టికి విడదీయరాని సంబంధం ఉంటుందని బలంగా నమ్మిన వ్యక్తిత్వం నలిమెల భాస్కర్. అందుకే మట్టికి ప్రాణం ఉంటుందని కుండల్లో కూడా మట్టి గుండెలను దర్శించాడు. తనకు మట్టి పట్ల ఉన్న మమకారాన్ని, విశిష్టతను తెలియచేస్తూ

"నిలువు గొట్టాలను
చెక్కెరతో నింపింది
మట్టి గుండె
మహా మధురం!"

అని చెరుకుగడల తీయదనానికి కారణం మట్టినే అంటూ కీర్తించాడు. శరీరంలోని గుండె అన్ని భాగాలకు రక్తాన్ని సరఫరా చేసినట్టు మట్టి అనే గుండె ఏపుగా, నిలువుగా పెరిగె చెరుకు గడలకు తన మధురాన్ని అందిస్తుందని తెలిపాడు.

మనిషి జీవించడానికి ఉపయోగపడే వస్తు సామాగ్రిని మట్టి అందించిందని తెలియజేస్తూ–

"అగ్ని పరీక్షకు
నిలిచాయి మరి!
అందుకే ఇటుకల
ఇల్లై నిలిచాయి"

మట్టిలో తయారయ్యే ఇటుకలు అగ్ని పరీక్షను ఎదుర్కొన్నపుడు అవి గట్టిగా, బలంగా తయారై ఇంటి నిర్మాణానికి ఉపమోగపడుతాయని అలాగే మనిషి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్న, స్థిరంగా జీవించాలన్న అనేక పరీక్షలను ఎదుర్కొన్నపుడే మనిషి మనుగడ సాధ్యమవుతుందనే విషయాన్ని, శ్రమశక్తిని మరియు మట్టి ఔన్నత్యాన్ని తెలియజేశాడు.

మన్ను వెన్న కంటే నున్నగా పువ్వు కంటే సుకుమారంగా ఉంటుందని,ఈ భూమి మీద మట్టి కంటే మృదువైనది మరేదీ లేదని మట్టి మీద తనకున్న మమకారాన్ని వెల్లడించాడు. ఈ రకంగా కవి నానీలలో జీవిత సత్యాలను, శ్రమ సౌందర్యం వంటి పిన్నమైన వస్తు వైవిధ్యంతో రచించాడు.

ముగింపు:

కవి తన జీవితంలోని అనుభవాలను అలాగే తాను సమాజాన్ని, ప్రకృతిని పరిశీలించి అల్పక్షరాలలో అనాల్పర్థం వచ్చే విధంగా నానీలలో చిత్రించాడు. కవి నానీలలో తెలంగాణ మట్టి విశిష్టతను, బతుకమ్మ పండుగ వైశిష్యాన్ని, రైతుల జీవితాన్ని ప్రకృతిని,మట్టి మనుషుల జీవితాన్ని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను, ప్రత్యేక రాష్ట్రం ఆవశ్యకతను తెలియజేస్తూ మొత్తంగా తెలంగాణ ఔన్నత్యాన్ని, తెలంగాణ జీవితాన్ని, ఆవిష్కరించాడు.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. నారాయణరెడ్డి. సి. 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు'. హైదరాబాద్: విశాలాంధ్ర, 1977

2. భాస్కర్, నలిమెల. మట్టి ముత్యాలు, సిరిసిల్ల: నయనం ప్రచురణలు, 2006.

3. రంగనాథాచార్యులు, కె. కె. 'తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు'. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్. 2015.

రచయిత: తెలుగు సహాయాచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పరకాల.

సాహిత్య విమర్శ

చెరబండరాజు స్మరణలో సావిత్రి కవిత్వం

వంగాల సంపత్‌రెడ్డి

పరిచయం:

తెలుగు విప్లవ సాహిత్యంలో చెరబండరాజు ఒక కీలక స్థానాన్ని సంపాదించుకున్న ప్రజాకవి. ఆయన రచనలు కేవలం కథలు, నవలలు, కవిత్వంగా మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు దారితీసే ఉద్యమ పిలుపులు. తెలుగు సాహిత్యంలో 'దిగంబర' కవిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, 'విప్లవ' కవిగా పరిణామం చెందిన అరుదైన వ్యక్తిత్వం చెరబండరాజుది. వ్యవస్థలోని అన్యాయాలను ఎండగట్టడంలో ఆయన అక్షరం ఒక పదునైన ఆయుధంలా పనిచేసింది. చెరబండరాజు ప్రజల బాధలను తన కవిత్వంలో ప్రతిబింబించారు. ఒక సామాజిక బాధ్యతగల వ్యక్తిగా ఎదిగి, తన కవిత్వాన్ని ఆయుధంగా ఉపయోగించాడు. అలాంటి కవి తన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రభావితం చేస్తాడు. అలాగే సావిత్రిని ప్రభావితం చేసాడు. ఆ ప్రభావంతో చెరబండరాజు మరణానంతరంహా చెరబండరాజును స్మరించుకుంటూ సావిత్రి వ్రాసిన పాట "జోహార్", కవిత "జూలై-2". సావిత్రి వ్రాసిన ఈ పాట, కవిత ద్వారా చెరబండరాజు వ్యక్తిత్వాన్ని, ఆలోచనలను, ప్రజలతో ఆయన అనుబంధాన్ని ప్రతిబింబించేవిగా అర్థం చేసుకోవచ్చు.

చెరబండరాజు జూలై 2, 1982 నాడు మరణించాడు. చెరబండరాజు సాహిత్య వ్యక్తిత్వంతో చాలామంది ప్రభావితమైనారు. చెర స్మరణలో కవిత్వం వెలువరించారు, మరికొందరు వ్యాసాలు వ్రాసారు. ఇంకొంతమంది పాటలు వ్రాసారు. చెరబండరాజు మరణించగానే 'బందిపోట్లు' కవిత ద్వారా ప్రసిద్ధి పొందిన సావిత్రి చెరబండరాజును స్మరిస్తూ వ్రాసిన పాట జోహార్. ఇప్పుడు ఆ జోహార్ పాటను పరిశీలిద్దాం.

జోహారు జోహారు చెరబండరాజా!
జోహారులివె నీకు వో భానుతేజా!
తాకట్టు పాలైన తల్లి భారతిని
తలచి తలచీ నీవు తల్లడిల్లావు
నిజము చెప్పినవాడ! నిన్ను కోల్పోయి
ఆ తల్లి ఆవురని అడలుచున్నదిరా ॥ జోహారు ॥

తప్పుచేయని నిన్ను శిక్షించినారు
చెప్పరానీ హింస పెట్టి చంపేరు
వొప్పుకోలేమురా నీ చావు మేము
యెప్పటికైన పగతీర్చుకుంటాము ॥ జోహారు ॥
దిక్కులేని ప్రజను దీక్షతో చేరి
రక్కసీమూకలను కక్షతో యెదిరి
లెక్కచేయక నిలచి కష్టాల బోను
యెక్కినా యోధుడా! నీకిదే మా ॥ జోహారు ॥

"జోహార్" అనే పదం గౌరవ నివాళి. శ్రద్ధాంజలి అనే అర్థాన్ని కలిగిస్తుంది. "జోహారు" పదం పునరుక్తిగా వచ్చింది. ఫలితంగా పాటలో భావోద్వేగ తీవ్రత పెరిగింది. పాటలో వ్యక్తిగత దుఃఖం కంటే సామూహిక బాధ ప్రధానంగా కనిపిస్తుంది. "జోహారు జోహారు చెరబండరాజా!" అనే పిలుపు, కవి పట్ల ప్రజల గౌరవాన్ని వ్యక్తం చేస్తుంది.

ఈ పాటలో మూడు భాగాలున్నాయి. మొదటి భాగంలో వందేమాతరం కవితలో తాకట్టు పెట్టబడిన భారతదేశ దుస్థితిని చెరబండరాజు చిత్రించాడు. ఆ విషయాన్ని జ్ఞాపకం చేసుకొని సావిత్రిహా "తాకట్టు పాలైన తల్లి భారతిని" అనే పాదం ద్వారా చెరను స్మరించింది. వందేమాతరం కవిత ఒక పెనుసంచలనం. తరిమెల నాగిరెడ్డి వ్రాసిన "తాకట్టులో భారతదేశం" ను మొత్తాన్ని వందేమాతరం కవితలో చిత్రించాడని విమర్శకులు భావించారు. భానిసత్వంలో మగ్గుతున్న, తాకట్టు పడ్డ దేశాన్ని రక్షించాలని చెరబండరాజు పడ్డ తపనను ఈ పాదంలో సావిత్రి గుర్తు చేసింది.హా హాదేశ స్థితి గతులను ఉన్నది ఉన్నట్లు చెప్పి తల్లడిల్లి పోయిన చెరబండ రాజును గుర్తు చేసుకొని బాధ పడ్డది."తాకట్టు పాలైన తల్లి భారతిని తలచి తలచీ నీవు తల్లడిల్లావు" అన్న పంక్తులు చెరబండరాజులోని గాఢమైన దేశాభిమానాన్ని సూచిస్తాయి. ఇక్కడ దేశం అంటే కేవలం మట్టి కాదు, మనుషులు. సామాన్యుడి బతుకు తాకట్టు పడుతున్న వేళ ఆయన పడ్డ తల్లడపాటు, నిజాయితీ కలిగిన కవి ఆవేదనకు నిదర్శనం. 'నిజము చెప్పినవాడ!' అన్న సంబోధన ద్వారా, అబద్ధపు విలువల మధ్య సత్యాన్ని ధైర్యంగా ప్రకటించిన ఆయన నైజాన్ని మనం చూడవచ్చు.

రెండవ పాదంలో "తప్పు చేయని నిన్ను శిక్షించినారు" అని పాలక వర్గాల నిరంకుశత్వాన్ని విమర్శించింది. ఏ తప్పు చేయకుండానే చెరబండరాజును పాలకవర్గం జైలు పాలు చేసి హింసించింది. అతను అనారోగ్యం బారిన పడేటట్లు చేసింది. అలాంటి పాలకవర్గం మీద ఎప్పటికైనా పగ తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేసింది. పగ తీర్చుకునేది సావిత్రి మాత్రమే కాదు ప్రజలు కూడా అని అర్థం చేసుకోవాలి. మరొక విధంగా చెప్పాలంటే ప్రజల నాయకత్వంలో నడిచే విప్లవోద్యమం పగ తీర్చుకుంటుంది. కాళోజి అన్నట్లు"కాలంబు రాగానే కాటేసి తీరాలెమన కొంపలార్చిన మన స్త్రీల చెరచినమన పిల్లలను చంపి మనల బంధించిన మానవాధములను మండలాధీశులను మరిచి పోకుండగ గురుతుంచుకోవాలె కసి ఆరిపోకుండ గురుతుంచుకోవాలె కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె కాలంబు రాగానే కాటేసి తీరాలె"- అన్న కవిత గుర్తుకు వస్తుంది. చెరబండరాజు మరణానికి కారణమైన వ్యవస్థ మీద, పాలక వర్గం మీద కాలం వచ్చిన రోజున ప్రజలు పగతీర్చుకొంటారని సావిత్రి భావించింది.

చెరబండరాజు జీవితం ఒక నిరంతర పోరాటం. కవితలోని ఈ క్రింది పంక్తులు ఆయన అనుభవించిన జైలు శిక్షను, శారీరక హింసను గుర్తుచేస్తాయి:"తప్పుచేయని నిన్ను శిక్షించినారు.. చెప్పరానీ హింస పెట్టి చంపేరు" వ్యవస్థను ప్రశ్నించినందుకు ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులు, అనారోగ్యం పాలైన స్థితి ఆయన 'బలిదానాన్ని' సూచిస్తాయి. ఆయన మరణాన్ని 'కాలధర్మం' (సహజ మరణం) గా కాకుండా, వ్యవస్థ చేసిన హత్యగా కవి భావించడం ఇక్కడ గమనార్హం.

నక్సల్బరీ వెలుగులో దేశ స్థితినిహౌ అర్థం చేసుకున్నాడు. ఈ దేశ స్థితి ని మార్చడానికి మార్క్సిజం లెనినిజం మావోయిజం పరిష్కారమని నమ్మాడు. దీర్ఘకాలిక సాయుధ పోరాటం తప్ప మరో మార్గం లేదనుకున్నాడు. "దిక్కులేని ప్రజను దీక్షతో చేరి" నక్సల్బరీ వెలుగులో హౌఆరుగాలం కష్టం చేస్తూ కడుపునిండని శ్రామిక వర్గంను ఏకం చేస్తూ శ్రమదోపిడిని అడ్డుకొని పీడిత వర్గం తరఫున నిలబడిన చెరబండరాజు ప్రజలను సమీకరించాడు. శ్రమ దోపిడీ చేసే వారితో పోరాటం చేశాడు. ఫలితంగా చెరబండరాజు అనేక కష్టాలను ఎదుర్కొన్నాడు. అయినా ప్రజల కోసం ఆ కష్టాలను లెక్కచేయలేదు. తన కష్టాలను లెక్క చేయని యోధుడు చెరబండరాజు అని సావిత్రి భావించింది. చెరబండరాజు కేవలం రచయిత మాత్రమే కాదు, ప్రజల పోరాటంలో భాగస్వామి అని సావిత్రి నమ్మింది అని ఈ పాట ద్వారా అర్థం చేసుకోవచ్చు."దిక్కులేని ప్రజను దీక్షతో చేరి.. రక్కసీమూకలను కక్షతో యెదిరి" అన్న వాక్యాలు ఆయన కవిత్వ సిద్ధాంతాన్ని స్పష్టం చేస్తాయి. అణగారిన వర్గాల పక్షాన నిలబడి, దోపిడీ వర్గాలను (రక్కసీమూకలు) ఎదిరించడమే ఆయన లక్ష్యం. కష్టాల బోను ఎక్కినా వెరవని ఆయన ధైర్యం విప్లవకారులకు ఒక ప్రేరణ. చెరబండ రాజు స్మరణలో సావిత్రి వ్రాసిన కవిత "జూలై-2"

వ్యవస్థ చెరసాల బీగం కోసం వెతుకులాట/ బండ గుండెల్ని వేటాడే బతుకుబాట - నినదించునీపాట/కవిగా నువ్వేం రాసినా చెల్లు/ కార్యరంగాన్ని వరిస్తేనే మా ఎదలో ముల్లు -నీ ఒళ్ళంతా చిల్లు/కాలం చావునిస్తే/ కార్యం మార్పుని తెస్తుంది/ అయితే నీ మృతి /కానేకాదు కాలధర్మం /నీ స్మృతి/ కోరదు ఓ కన్నీటి కణం/ రెండు నిముషాలు మౌనం / రాజుకుంటుంది నువ్వు రగిలించిన నిప్పు / ముంచుకొస్తుంది దోపిడికి పెనుముప్పు

('చెఱ' సంస్మరణలో) (కవితా వేదిక, 1983,
సాహితీ వేదిక, రాజమండ్రి)

దోపిడీ వర్గ సమాజాన్ని రూపు మాపడానికి చెరబండరాజు పరిష్కారాన్ని నక్సల్బరీలో చూసాడు. భారత సమాజం అర్ధ వలస అర్ధ భూస్వామ్య సమాజమని నక్సల్బరీ భావించింది. భారత సమాజాన్ని మార్చడానికి దీర్ఘకాలిక సాయుధ పోరాటం అవసరమని భావించింది. దొపిడీ పాలకులు నిర్మించిన బందీఖానా తాళాన్ని తెరిచే మార్గం కోసం నినదించాడు. ఆ మార్గం ప్రజా పోరాటాలే అని నమ్మాడు. అందుకు అనుగుణంగా ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలను నిర్మించడానికి సాహిత్యం వెలువరించాడు. ప్రజలను సమీకరించాడు. తనేం వ్రాసినా ప్రజల గురించే వ్రాసాడు. ప్రజల పక్షమే నిలబడ్డాడు. ఫలితంగా జైలు పాలయ్యాడు. కుట్ర కేసులను భరించాడు. ఎన్ని భరించిన అవి ప్రజలకోసమేనని నమ్మాడు. అనారోగ్యం పాలయ్యాడు.హౌ మరణించాడు.

"కవిగా నువ్వేం రాసినా చెల్లు / కార్యరంగాన్ని వరిస్తేనే..." అని చెరబండరాజు ని స్మరించడం అంటే అతను వ్రాసిందే ఆచరించాడు. అందువల్లే ఇబ్బందులు పడ్డాడు. కేవలం కవిత్వం మాత్రమే సరిపోదు; ఆచరణహౌ అవసరం అని నమ్మినవాడు చెరబండరాజు అని సావిత్రి విశ్వాసం.చెరబండరాజు మరణం సహజం కాదని, అది వ్యవస్థ హింస ఫలితమని "నీ మృతి కానేకాదు కాలధర్మం"ద్వారా సూచించింది. ''నీ స్మృతి కోరదు ఓ కన్నీటి కణం'' చెరబండరాజు స్మరణను శోకంగా కాకుండా, పోరాటంగా మార్చాలని సావిత్రి ఈ కవితలో పిలుపునిచ్చింది.

మొత్తంగా చెరబండరాజు స్మరణలో సావిత్రి వ్రాసిన పాట, కవిత వర్గపోరాటాన్ని ప్రతిబింబిస్తాయి.పాలక వర్గం దోపిడీకి వ్యతిరేకంగా పీడిత వర్గం చేసే పోరాట ప్రాధాన్యతను నొక్కి చెప్పాయి.సావిత్రి స్మరణ ద్వారా చెరబండరాజు ప్రత్యక్ష పోరాట కవి. విమర్శకుల దృష్టిలో శ్రీశ్రీ ఆధునిక విప్లవ చైతన్యం ప్రారంభ కాలానికి ప్రతినిధి, వరవరరావు ఉద్యమ కవిత్వ విస్తరణ కాలానికి ప్రతినిధి.

సావిత్రి చెరబండరాజును స్మరిస్తూ వెలువరించిన సాహిత్యం కేవలం స్మారక సాహిత్యమే కాదు, ఒక సిద్ధాంత ప్రకటన. ఒక ఉద్యమ పిలుపు. శోకాన్ని చర్యగా మార్చే అరుదైన సాహిత్యం.

ముగింపు:

"జోహార్", "జూలై--2" లు చెరబండరాజు మరణాన్ని మాత్రమే కాదు, అతని వ్యక్తిత్వాన్ని, ఆయన ఆలోచనలను, పోరాటాన్ని, ప్రజాస్వామ్య స్వప్నాన్ని సజీవంగా ఉంచుతున్నాయి. చెరబండరాజు మరణం ముగింపు కాదు -- అది ఒక ప్రారంభం. ఆయన "రగిలించిన నిప్పు" సమాజ మార్పుకు దారితీస్తూనే ఉంటుంది.

చెరబండరాజు మరణం ఒక వ్యక్తి ముగింపు కాదు, ఒక నిరంతర ధ్వని. ''వ్యవస్థ చెరసాల బీగం కోసం వెతుకులాట''లో ఆయన తన జీవితాన్నే త్యాగం చేసిన యోధుడు.

ఆధార గ్రంథాలు:

1. ఆమె అస్తమించలేదని... 2018, సంపాదకులు అరణ్య కృష్ణ

2. చెరబండరాజు సాహిత్య సర్వస్వం -1, 2002, విరసం ప్రచురణ

– అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వర్ధన్నపేట, వరంగల్ జిల్లా.

అచ్చమైన ఆడపడుచులు-గాథాసప్తశతి నాయికలు

ప్రొఫెసర్ వెంకటరామయ్య గంపా

గాథాసప్తశతిలోని స్త్రీల అస్తిత్వాన్ని, వారి స్వేచ్ఛా స్వరాలను విశ్లేషించడం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం. వారి భావ వ్యక్తీకరణలో ఉన్న నిజాయితీని, ప్రకృతి ఒడిలో జీవించిన ఆనాటి స్త్రీలు, తమ జీవితాన్ని తామే ఎలా నిర్వచించుకున్నారో, పురుషాధిక్య సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఎలా ఏర్పరచుకున్నారో ఈ వ్యాసం చర్చిస్తుంది. ఈ సంకలనం కేవలం ప్రాచీన సాహిత్య విశేషాలు మాత్రమే కాదు, అవి తరాలు మారినా, యుగాలు మారినా చెరిగిపోని స్త్రీల ఆలోచనలు, హృదయ స్పందనలు. వాటిని చర్చించడమే ఈ వ్యాస లక్ష్యం.

భారతీయ సాహిత్య చరిత్రను పరిశీలిస్తే, అందులో సంస్కృత భాషా వైభవం, పండితుల పాండిత్య ప్రకర్ష ఎక్కువగా కనిపిస్తాయి. కానీ, ఆ రచనల్లో, సామాన్య ప్రజల జీవితం, వారి ఆశలు, ఆశయాలు, సుఖదుఃఖాలు, ప్రేమానురాగాలు ఎలా ఉండేవో చెప్పే ఆధారాలు చాలా అరుదు. సరిగ్గా ఈ వెలితిని పూరిస్తూ, క్రీస్తుశకం ఆరంభ కాలంలో దక్కన్ పీఠభూమి నుండి వినిపించిన ఒక మట్టి వాసన కలిగిన స్వరమే 'గాథాసప్తశతి'. దీనినే ప్రాకృతంలో 'గాహాసత్తసయీ' అని పిలుస్తున్నారు. భారతీయ సాహిత్యంలోనే కాక, ప్రపంచ సాహిత్యంలోనే ఒక ఉత్తమ సంకలన గ్రంథంగా దీనికి విశేష స్థానం ఉంది. ఇది కేవలం కవిత్వ సంకలనం మాత్రమే కాదు, దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం నాటి తెలుగు నేల, మహారాష్ట్ర ప్రాంతాల గ్రామీణ జీవన విధానానికి, అక్కడి మనుషుల మనోభావాలకు నిలువుటద్దం. ముఖ్యంగా, ఇందులో వినిపించే స్త్రీల స్వేచ్ఛాస్వరం అసాధారణమైనది. నాటి సామాజిక, కుటుంబ వ్యవస్థలో స్త్రీకి ఉన్న స్థానం, ఆమె అనుభవించే అంతర్మథనం, ఆమెకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఇంత స్పష్టంగా, ఇంత బలంగా వినిపించిన మరో ప్రాచీన గ్రంథం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ అద్భుత కావ్య సంకలనకర్త శాతవాహన చక్రవర్తి హాలుడు. శాతవాహనుల పాలన దక్షిణ భారత చరిత్రలో, ముఖ్యంగా ఆంధ్రుల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయం.

మౌర్య సామ్రాజ్య పతనం తరువాత, దక్కన్ ప్రాంతంలో ఒక సుస్థిరమైన, విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించిన ఘనత శాతవాహనులది. ఈ వంశంలో పదిహేడవ రాజుగా (చారిత్రక ఆధారాల ప్రకారం) చెప్పబడే హాలుడు, క్రీస్తుశకం మొదటి శతాబ్దంలో పరిపాలించాడు. స్వయంగా కవి అయిన హాలుడు, తన ఆస్థానంలో అనేక మంది కవులను, పండితులను పోషించాడని చరిత్రకారులు పేర్కొంటారు. ఆ రోజుల్లో ప్రజల వాడుక భాషగా ఉన్న మహారాష్ట్ర ప్రాకృతంలో వెలువడిన వేల గాథల నుండి, ఆణిముత్యాల వంటి ఏడు వందల గాథలను ఏరి, కూర్చి హాలుడు ఈ 'గాథాసప్తశతి'ని రూపొందించాడని పండితుల అభిప్రాయం. ఆనాటి పండిత భాష సంస్కృతం అయినప్పటికీ, శాతవాహన చక్రవర్తి హాలుడు దేశీభాష అయిన ప్రాకృతాన్ని (మహారాష్ట్ర ప్రాకృతం) ఎంచుకోవడం ఒక సాహసోపేతమైన నిర్ణయం. సంస్కృతం కన్నా ఇది ఎంతో సరళంగా, శ్రావ్యంగా ఉంటుంది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ తన పుస్తకంలో దీని గురించి చాలా గొప్పగా చెప్పారు. సంస్కృతం కృత్రిమ అలంకారాలతో నిండినదైతే, ప్రాకృతం సహజ సుందరమైనదని వారి అభిప్రాయం. "సంస్కృత కవిత్వమునకును ప్రాకృత కవిత్వమునకును గల భేదమును సహృదయులు ఇట్లు వర్ణించియున్నారు. సంస్కృత కవిత్వము పౌరుల (నగరవాసుల) వనితల వంటిది, అలంకారములచేతనే అది ప్రకాశింపవలెను. ప్రాకృత కవిత్వము పల్లెటూరి పడుచు వంటిది, అది తన సహజ లావణ్యముచేతనే రాణించును." (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గాథా సప్తశతీ సారము, పీఠిక) ఈ మాటలు అక్షర సత్యాలు. గాథల్లోని మాండలిక సొగసు, అలంకారాల బరువు లేని భావ వ్యక్తీకరణ నేటికీ పాఠకుడిని కట్టిపడేస్తుంది అని దీవి సుబ్బారావు తన గాథా సప్తశతీ అనువాదంలో పేర్కొన్నారు.

గాథా స్వరూపం:

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచించిన 'గాథా సప్తశతీ సారము' పీఠికను అనుసరించి... 'గాథ' అనేది ఒక ఛందస్సు పేరు. సంస్కృతంలో 'శ్లోకం' ఎలాగో, ప్రాకృతంలో 'గాథ' అలాగ. ఇది మాత్రా ఛందస్సుకు సంబంధించినది. దీనిని సంస్కృతంలో 'ఆర్యా' వృత్తం అంటారు. గాథాసప్తశతిలోని ప్రతి పద్యం ఒక 'ముక్తకం'. అంటే, దేనికదే స్వతంత్రమైన భావాన్ని కలిగి ఉంటుంది. ఒక పద్యానికి, మరో పద్యానికి కథా సంబంధం ఉండదు. కానీ, అన్నింటినీ కలిపి చూస్తే ఒక సమగ్రమైన గ్రామీణ జీవన చిత్రం కళ్ళ ముందు కదులుతుంది. సామాన్య ప్రజలైన రైతులు, గొల్లవారు, బోయవారు, వడ్రంగులు మొదలైన వారి జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని ఈ కావ్యం సాగింది.

ఇందులో నగర జీవితపు వాసనలు ఏమాత్రం లేవు. సంస్కృత కావ్యాల్లో కనిపించే ఎత్తైన భవనాలు, రాజప్రాసాదాలు,

కృత్రిమ ఉద్యానవనాలు, విలాసవంతమైన నగర వర్ణనలు ఇందులో కనిపించవు. దీనికి బదులుగా పచ్చని పంట పొలాలు, గోదావరి నది, వింధ్య పర్వతాలు, మోదుగ పూలు, ఇప్ప చెట్లు, తామర కొలనులు, గేదెలు, ఆవులు, కుక్కలు, కోతులు వంటి గ్రామీణ ప్రకృతి దృశ్యాలు దర్శనమిస్తాయి. ఇక్కడి పాత్రలు కూడా మట్టి మనుషులై ఉంటారు. గ్రామ పెద్ద (గ్రామణి), అతని కూతురు, బాటసారులు (పథికులు), వేటగాళ్లు, హాలికులు (రైతులు) – ఇలా సమాజంలోని అట్టడుగు వర్గాల నుండి మధ్య తరగతి వరకు అందరూ ఈ గాథల్లో భాగస్వాములే. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అన్నట్లు, 'ఇందులో నాగరకత అనే కృత్రిమత్వం లేదు. ఇది అచ్చమైన పల్లెటూరి బతుకు.' ఇదే గాథాసప్తశతిని ప్రపంచ సాహిత్యంలో 'వాస్తవిక కవిత్వానికి' మార్గదర్శిగా నిలబెట్టింది.

ఈ గ్రంథం ప్రధాన ఇతివృత్తం 'శృంగారం'. అయితే, ఇది వాత్సాయనుడి గ్రంథంలో చెప్పినట్లుగా శాస్త్రీయమైన, యాంత్రికమైన శృంగారం కాదు. ఇది హృదయ సంబంధమైనది. పల్లెటూరి వాతావరణంలో, స్వేచ్ఛగా విహరించే స్త్రీపురుషుల మధ్య సహజంగా పుట్టే ఆకర్షణ, ప్రేమ, విరహం, కోపం, అలక, బుజ్జగింపులు ఇందులో ప్రధాన అంశాలు. "వంటింటి పనుల్లో మసి అంటుకున్న చేతితో, చెమట పట్టిన ముఖంతో ఉన్న ఇల్లాలిని చూసి, ఆమె శ్రమను, సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ భర్త ముసిముసి నవ్వులు నవ్వుకోవడం లాంటి అతి సహజమైన, ఆపేక్షతో కూడిన చిత్రణలు ఇందులో కోకొల్లలు" (దీవి సుబ్బారావు, ప్రాకృత గాథా సప్తశతి, 12).

అయితే, ఈ మొత్తం సంకలనంలో అత్యంత ఆశ్చర్యకరమైన, విశేషమైన అంశం – 'స్త్రీల ఆధిపత్యం'. ఈ ఏడు వందల గాథల్లో సింహభాగం స్త్రీలే మాట్లాడతారు. పురుషుడు రచయితగా ఉన్నప్పటికీ, స్త్రీల మనోభావాలను ఇంత లోతుగా ఆవిష్కరించడం అరుదు. "పగలు సిగ్గుతో తలవంచుకుని, మొగ్గలా ఉండే భార్యే, రాత్రిళ్ళు మాత్రం ఏకాంతంలో సంతోషంతో పొంగిపోతూ, భర్తకు ఆజ్ఞలు జారీ చేసే చనువును ప్రదర్శిస్తుందని కవి వర్ణించడాన్ని బట్టి ఆనాటి దాంపత్యంలో స్త్రీకి ఉన్న స్వేచ్ఛను మనం అర్థం చేసుకోవచ్చు" (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గాథా సప్తశతీ సారము, 5).

ఇక్కడి స్త్రీలు సంస్కృత నాటకాల్లో కనిపించే బిడియస్తులైన, పురుషుడి మాటే వేదంగా భావించే ఆదర్శ నాయికలు కారు. వీరు రక్తమాంసాలు కలిగిన సామాన్య స్త్రీలు. వీరికి కోరికలు ఉన్నాయి, వాటిని వ్యక్తపరిచే ధైర్యం ఉంది. సమాజం విధించిన కట్టుబాట్లు ఉన్నాయి, వాటిని అతిక్రమించే చాకచక్యం ఉంది. "ముఖ్యంగా, మనసులో చెడు ఆలోచనతో వెనుక తిరిగే మరదికి (భర్త సోదరుడికి), గోడమీద ఉన్న రాముడిని అనుసరించే లక్ష్మణుడి చిత్రాన్ని చూపిస్తూ, ఏమీ ఎరగనట్లుగా నవ్వుతూనే బుద్ధి చెప్పే ఒక ఇల్లాలి సమయస్ఫూర్తి ఆనాటి స్త్రీల వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది" (పైదే, 7).

ఈ గాథలు కేవలం ప్రేమ కవిత్వం మాత్రమే కాదు, ఇవి నాటి సమాజ స్థితిగతులకు సంబంధించిన అమూల్యమైన సాక్ష్యాలు. ఆనాటి కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలు, ఆడపిల్లల పెంపకం వంటి అనేక ప్రశ్నలకు ఈ గాథలు సమాధానాలిస్తాయి. ఉదాహరణకు, ఇందులో 'అసతి' (పరపురుష సంబంధం కలిగిన స్త్రీ) పట్ల కవి చూపిన దృక్పథం చాలా విశాలమైనది. ఆమెను ఒక నేరస్తురాలిగా కాక, తన కోరికల కోసం పోరాడే ఒక మనిషిగా చిత్రించారు.

స్త్రీల స్వరం

'గాథాసప్తశతి'లోని స్త్రీల స్వర స్వభావాన్ని రెండు విధాలుగా విశ్లేషించవచ్చు. మొదటగా, 'స్వరం' అనేది ఒక స్వతంత్ర అస్తిత్వానికి, స్వేచ్ఛాయుత భావ ప్రకటనకు ప్రతీక. ఈ కావ్యంలోని గ్రామీణ స్త్రీల జీవన విధానం నగరపు కృత్రిమత్వానికి దూరంగా, అత్యంత సహజంగా సాగుతుంది. వారు ఎవరి నీడలోనో కాక, తమకంటూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారని ఈ 'స్వరం' నిరూపిస్తుంది. రెండవది 'స్వేచ్ఛా స్వరం'. ఇది వారిలోని అధికార ధోరణిని, నిర్భీతిని లేదా కర్తృత్వాన్ని తెలియజేస్తుంది. ఇక్కడి స్త్రీలు తమ కోరికలను కోరుకోవడంలోగానీ, అన్యాయాన్ని నిలదీయడంలోగానీ ప్రదర్శించే తెగువ అసాధారణమైనది. వారు తమ నిరసనలను నేరుగా లేదా వ్యంగ్యంగా, చాలా ఘాటుగా వ్యక్తం చేస్తారు. స్త్రీల స్వేచ్ఛాస్వరం పురుషాధిపత్య సమాజంపై తమ ఉనికిని చాటుకున్న బలమైన సాక్ష్యం కనిపిస్తుంది. నాటి ధర్మశాస్త్రాలు విధించిన సంప్రదాయ కట్టుబాట్ల చట్రం నుండి బయటకు వచ్చి, తమ శారీరక, మానసిక అనుభూతులను వారు స్వేచ్ఛగా ఆవిష్కరించారు. తమ సుఖదుఃఖాలను తామే నిర్ణయించుకునే ఆత్మవిశ్వాసం, తమ జీవితానికి తామే కర్తలమనే భావన స్త్రీల స్వేచ్ఛా స్వరంలో స్పష్టంగా ప్రతిధ్వనిస్తుంది. గాథాసప్తశతిలోని స్త్రీల స్వరం 'దీన స్వరం' కాదు, అది 'అధికార స్వరం'. వారు గొంతులో వణుకు లేకుండా, స్పష్టంగా, సూటిగా మాట్లాడతారు. వారు ఉపయోగించే 'వ్యంగ్యం' వారి స్వరంలోని పదునును తెలియజేస్తుంది. వారు అత్తగారిని, భర్తను, ప్రియుడిని శాసించే స్థాయిని వారి కంఠ స్వరం సూచిస్తుంది. ఇది వంటింటి గొంతుక కాదు, పొలిమేర దాటిన స్వేచ్ఛా స్వరం. పురుషుల భాష తర్కం మీద ఆధారపడితే, స్త్రీల భాష శరీరం, అనుభూతి మీద ఆధారపడి ఉంటుందని వీరి వాదన. స్త్రీల స్వేచ్ఛా ఆలోచన అనేది పితృస్వామ్య వ్యవస్థ విధించిన మౌనాన్ని బద్దలు కొట్టడం. స్త్రీవాద విమర్శకుల అభిప్రాయం ప్రకారం, 'స్త్రీ తన గురించి తాను నిజాయితీగా రాయడమే' ఆమె అసలైన స్వరం.

గాథాసప్తశతిలో స్త్రీలు మాట్లాడేది ప్రాకృతమే. కానీ సంస్కృత నాటకాల్లోలాగా అది తక్కువ స్థాయి భాష కాదు, అది కావ్య భాష. అంటే, స్త్రీల సహజ భాషకే ఇక్కడ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. పాశ్చాత్యులు చెప్పినట్లు, ఇక్కడి స్త్రీలు తమ శారీరక కోరికలను, విరహాన్ని, ప్రసవ వేదనను, యవ్వనపు మార్పులను దాచుకోకుండా వ్యక్తం చేశారు. వారి స్వరం నైతికత ముసుగులో లేదు. భారతీయ దృక్పథంలో స్త్రీ ప్రకృతి స్వరూపిణి. గాథాసప్తశతిలో స్త్రీ స్వరం గోదావరి అలల శబ్దంలో ప్రతిధ్వనిస్తుంది.

గాథాసప్తశతిలోని స్త్రీల స్వరాలను అర్థం చేసుకోవాలంటే, వారు జీవించిన సామాజిక నేపథ్యాన్ని పరిశీలించడం అత్యావశ్యకం. ఈ గాథలు చిత్రించిన సమాజం పూర్తిగా గ్రామీణమైనది. ఇక్కడ కనిపించే స్త్రీలు రాచనగరులలోని అంతఃపుర కాంతలు కారు, వీరు పొలాల్లో పనిచేసే శ్రమజీవులు, ఇంటి బాధ్యతలను భుజాన వేసుకున్న గృహిణులు. నాటి శాతవాహన కాలపు సామాజిక నిర్మాణం, కుటుంబ వ్యవస్థ, ఆర్థిక పరిస్థితులు స్త్రీల జీవనశైలిని, వారి ఆలోచనా విధానాన్ని ఎలా ప్రభావితం చేశాయో విశ్లేషించడం ద్వారా మనం వారి స్వరంలోని లోతును పట్టుకోవచ్చు.

గాథాసప్తశతిలోని స్త్రీలకు, సంస్కృత కావ్యాలలోని నాయికలకు ఉన్న ప్రధాన వ్యత్యాసం వారి 'స్వేచ్ఛ'. ఈ స్వేచ్ఛ వారికి ఆర్థిక స్వావలంబన లేదా శ్రమలో భాగస్వామ్యం ద్వారా లభించింది. ఇక్కడి స్త్రీలు నాలుగు గోడలకే పరిమితం కాలేదు. వారు పురుషులతో సమానంగా వ్యవసాయ పనుల్లో పాల్గొనేవారు. వరి మడులకు నీళ్లు పెట్టడం, జొన్న చేలల్లో మంచె ఎక్కి పంటను పక్షుల నుండి కాపాడటం, పత్తి ఏరడం వంటి పనులను స్త్రీలు స్వయంగా నిర్వహించేవారు. ఈ పనుల నిమిత్తం వారు ఇంటి నుండి బయటకు వెళ్లడం, ప్రకృతిలో గడపడం వారికి ఒక రకమైన సామాజిక స్వేచ్ఛను ప్రసాదించింది. నీళ్ల కోసం నదికి లేదా బావికి వెళ్లడం, పూలు కోయడానికి అడవికి వెళ్లడం వంటి దైనందిన కార్యకలాపాలు స్త్రీలకు బయటి ప్రపంచంతో సంబంధం ఏర్పరచుకోవడానికి అవకాశాన్నిచ్చాయి. ఈ సందర్భాలే వారి ప్రేమాయణాలకు, ప్రియుల కలయికలకు వేదికలుగా మారాయని అనేక గాథలు స్పష్టం చేస్తున్నాయి. ఇంటి పని, పొలం పని రెండింటినీ సమన్వయం చేసుకునే నేర్పు నాటి స్త్రీలకు వెన్నతో పెట్టిన విద్య.

సామాజిక నీతి నియమాల విషయంలో గాథాసప్తశతి ఒక విప్లవాత్మకమైన వైఖరిని ప్రదర్శించింది. ధర్మశాస్త్రాలు స్త్రీకి పతివ్రతా ధర్మాన్ని బోధిస్తే, గాథలు మానవ సహజమైన బలహీనతలను, కోరికలను సానుభూతితో చూశాయి. కులస్త్రీ ధర్మాన్ని మీరిన స్త్రీని (అసతి) ఈ గాథాసప్తశతి నిందించలేదు. ఆమె ఎందుకు అలా ప్రవర్తిస్తోంది? ఆమె అసంతృప్తి ఏమిటి? అనే కోణంలో ఆలోచించాయి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గమనించినట్లు, "కవి వారిని (పాత్రలను) సమర్థించడు, నిందించడు. వారి చిత్తవృత్తులను ఉన్నదున్నట్లుగా మనముందుంచును" (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గాథా సప్తశతీ సారము, iv). పొరుగువారు, చెలికత్తెల మధ్య ఉండే రహస్య ఒప్పందాలు, ఒకరి తప్పులను ఒకరు దాచిపెట్టే సహకారం నాటి స్త్రీల మధ్య ఉన్న ఐక్యతను సూచిస్తుంది. ఒక స్త్రీ తన ప్రియుడి కోసం పడే తపనను మరొక స్త్రీ అర్థం చేసుకోవడం, ఆమెకు సహాయం చేయడం వంటివి నాటి సామాజిక సంబంధాల్లోని గాఢతను తెలియజేస్తాయి. గాథాసప్తశతిలోని స్త్రీని కేవలం ఒక ప్రేయసిగానో, విరహిణిగానో మాత్రమే చూడలేము. ఆమె ఒక సంక్లిష్టమైన ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో కీలకమైన భాగం. ఇంటి గడప లోపల ఆమెకున్న స్థానం, గడప దాటిన తర్వాత (పొలాల్లో) ఆమెకున్న స్వేచ్ఛ మధ్య ఉన్న వైరుధ్యం ఈ గాథల్లో స్పష్టంగా కనిపిస్తుంది. గాథాసప్తశతి కుటుంబ చిత్రణలో 'అత్త' ఒక తిరుగులేని అధికార కేంద్రం. ఇంటి యజమాని (మామ) ఉన్నప్పటికీ, గృహ నిర్వహణలో, కోడళ్ళను అదుపు చేయడంలో అత్తగారిదే పైచేయి. అయితే, అత్తగారి చాదస్తం లేదా కాఠిన్యం వల్లనే కోడలిలో తెలివితేటలు పెరుగుతాయని గాథలు సూచిస్తాయి. అత్తగారికి కళ్లు కప్పి ప్రియుడిని కలవడం ఒక కళగా మారుతుంది. 'ఉదాహరణకు, తేలు కుట్టిందని నాటకమాడి, వైద్యం కోసం అంటూ అందరి ముందే ప్రియుడి ఇంటికి వెళ్ళే స్త్రీల యుక్తులను కూడా ఈ గాథలు నిక్షిప్తం చేశాయి' (దీవి సుబ్బారావు, ప్రాకృత గాథా సప్తశతి, 69).

విచిత్రంగా, గాథాసప్తశతిలో భర్త పాత్ర తరచుగా నిస్తేజంగా లేదా అమాయకంగా కనిపిస్తుంది. అతను పొలం పనుల్లో అలిసిపోయిన రైతు (హాలికుడు) లేదా వ్యాపారం కోసం దూరంగా ఉండే బాటసారి. 'నా భర్త గుణవంతుడే, కానీ మోటువాడు. నా మనసులోని సున్నితమైన కోరికలు అతనికి అర్థం కావు' అని స్త్రీలు వాపోతారు. భర్తకు తన భావాలు అర్థం కానప్పుడు ఆమె పడే నిరాశ, ఆ నిరాశ నుండే పుట్టే వెటకారం అనేక గాథల్లో ఇతివృత్తం. ఇంటిలో ఉండే ఇతర స్త్రీలతో కోడలి సంబంధాలు కూడా వైవిధ్యంగా ఉంటాయి. భర్త సోదరి (ఆడబిడ్డ) తరచుగా అత్తగారికి వేగులా పనిచేస్తుంది. "ముఖ్యంగా, మనసులో చెడు ఆలోచనతో వెనుక తిరిగే మరదికి (భర్త సోదరుడికి), గోడమీద ఉన్న రాముడిని అనుసరించే లక్ష్మణుడి చిత్రాన్ని చూపిస్తూ, ఏమీ ఎరగనట్లుగా నవ్వుతూనే బుద్ధి చెప్పే ఒక ఇల్లాలి సమయస్ఫూర్తి ఆనాటి స్త్రీల వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది" (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గాథా సప్తశతీ సారము, 7). ఇక బహుభార్యత్వం ఉన్న ఆ రోజుల్లో, సవతి పట్ల అసూయ, స్పర్ధ సహజం. కుటుంబ వ్యవస్థలో స్త్రీకి ఉన్న పరిమితులు కేవలం ఇంటి నాలుగు గోడలకే పరిమితం. ఒక్కసారి గడప దాటి పొలంలోకి వెళ్తే ఆమె ప్రపంచం వేరు. పొలం పనులు (కాపలా, కలుపు తీయడం) ఆమెకు కుటుంబ నియంత్రణ నుండి విముక్తిని ప్రసాదిస్తాయి. గోదావరి గట్టున, జొన్న చేలల్లో ఆమెకు అత్తగారి భయం ఉండదు, ఆడబిడ్డ నిఘా ఉండదు.

గాథాసప్తశతిలో ప్రకృతి కేవలం కథా నేపథ్యం మాత్రమే కాదు, అది కథలో ఒక భాగం. ఇందులోని స్త్రీలు నాలుగు గోడల మధ్య బందీలు కారు, వారు ప్రకృతి ఒడిలో జీవించేవారు. వారి సుఖదుఃఖాలు, ఆశలు, నిరాశలు అన్నీ ప్రకృతితో పెనవేసుకుని ఉంటాయి. గాథాసప్తశతిలోని అనేక గాథలు గోదావరి నదీ తీరంలో నడుస్తాయి. ఈ నది స్త్రీల

రహస్యాలకు మూగ సాక్షి. తమ ఏకాంతానికి భంగం కలగకుండా ఉండటానికి, స్త్రీలు గోదావరి తీరంలో ప్రమాదాలు ఉన్నాయని ఇతరులను భయపెడతారు. 'గోదావరి తీరంలోని ఆ పొదల్లో సింహం తిరుగుతోంది, ఓ బాటసారీ! నీవు ఇంటికి వెళ్ళిపో అని చెప్పడం ద్వారా, అక్కడ తన ప్రియుడితో ఉన్న ఏకాంతానికి భంగం కలగకుండా చూసుకునే జాణతనానికి ఈ గాథలు అద్దం పడతాయి' (దీవి సుబ్బారావు, ప్రాకృత గాథా సప్తశతి). గ్రామాలకు ఆవల ఉండే వింధ్య అటవీ ప్రాంతం స్త్రీల కష్టాలకు, వారిలోని తెగువకు అద్దం పడుతుంది. కాలం మారినప్పుడల్లా స్త్రీల స్వరంలో మార్పు వస్తుంది. వసంతం రాకతో మామిడి చెట్లు పూత పూయడం, 'మామిడి చిగురును చూసి నా భర్తను తలుచుకుంటే, నా కోపం మంచులా కరిగిపోయింది' అని ఒక నాయిక చెబుతుంది. స్త్రీలు తమ తోటి మనుషులకన్నా చెట్లతో, లతలతో ఎక్కువ చనువుగా ఉంటారు. చంచలమైన ప్రియుడిని స్త్రీలు 'తుమ్మెద'తో పోలుస్తారు. ఆకాశంలో ఎగిరే తెల్లని కొంగల బారులు, ఇంటిపై వాలే కాకులు స్త్రీలకు భర్త రాకను సూచించే శకునాలుగా కనిపిస్తాయి.

ప్రేమ – స్త్రీల దృక్కోణం

గాథాసప్తశతి ప్రధాన ఇతివృత్తం శృంగారమే అయినప్పటికీ, అది పురుషుల కన్నులతో చూసిన శృంగారం కాదు. ఇది స్త్రీల అనుభూతి ప్రాధాన్యంగా సాగిన కావ్యం. సంస్కృత కావ్యాలలో శృంగారం తరచుగా నాయకుడి వీరత్వానికో, లేదా నాయిక సౌందర్య వర్ణనకో పరిమితమై ఉంటుంది. కానీ హాలుడి గాథల్లో శృంగారం అనేది స్త్రీల ఆత్మవిష్కారం. ప్రేమలో వారు అనుభవించే తపన, వారు తీసుకునే చొరవ, వారిలో కలిగే సంఘర్షణ ఇక్కడ ప్రధాన అంశాలు. వాత్సాయనుడి గ్రంథం శృంగారాన్ని ఒక శాస్త్రంగా, పద్ధతుల వారీగా వివరిస్తుంది. కానీ గాథాసప్తశతి ఆ శాస్త్రానికి, వాస్తవ జీవితానికి మధ్య ఉన్న అంతరాన్ని చూపిస్తుంది. పీటర్ ఖోరోచే, హెర్మన్ టీకెన్ తమ విశ్లేషణలో పేర్కొన్నట్లు, 'వాత్సాయనుడి గ్రంథం నగరవాసుల విలాసాలను వర్ణిస్తే, సత్తసఈ పల్లెటూరి స్త్రీల యథార్థ ప్రేమను వర్ణిస్తుంది'. ఇక్కడ ప్రేమ పద్ధతి ప్రకారం పుట్టదు, అది పొలాల గట్ల మీద, బావి దగ్గర, జాతరలో అనుకోకుండా పుడుతుంది. ఆ ప్రేమలో ఉండే తీవ్రతను, అస్తవ్యస్తతను స్త్రీలు తమ మాటల్లోనే వివరిస్తారు. యవ్వనారంభ దశలో ఉన్న బాలికలను 'ముగ్ధలు' అంటారు. వీరి ప్రేమ వర్ణనలో కవులు అద్భుతమైన సున్నితత్వాన్ని చూపించారు. నిన్నటి వరకు తనతో ఆడుకున్న బావను లేదా స్నేహితుడిని, నేడు చూడగానే ఆ బాలికలో కలిగే కొత్త బిడియం, అర్థం కాని ఆకర్షణ ఎంతో సహజంగా ఉంటాయి. 'అమ్మో! అతడు నన్ను చూస్తున్నాడు' అనే వారి అమాయకత్వానికి నిదర్శనం. ఒకవైపు పెద్దల భయం, మరోవైపు ప్రియుడి పట్ల ఆకర్షణ – ఈ రెండింటి మధ్య నలిగిపోయే ముగ్ధల మానసిక స్థితిని గాథలు అద్భుతంగా పట్టుకున్నాయి. అయితే గాథాసప్తశతిలోని అత్యంత బలమైన గొంతుక 'పరకీయా నాయికలది' (పరపురుష సంబంధం కలిగిన స్త్రీలు). ఆనాటి సాంఘిక నీతి వీరిని అంగీకరించకపోయినా, సాహిత్యం మాత్రం వీరిని సానుభూతితో, ఆరాధనతో చూసిందని విమర్శకుల అభిప్రాయం. ప్రియుడిని కలవడానికి వీరు చేసే సాహసాలు అసామాన్యం. చీకటి పడిన తర్వాత, వర్షంలో తడుస్తూ, పాములకు, తేళ్లకు భయపడకుండా అడవి దారిలో నడిచే 'అభిసారిక'ల ధైర్యం వారి ప్రేమ తీవ్రతను తెలియజేస్తుంది. 'నాకు ఆ దారిలోని పాములు పూల దండల్లా కనిపిస్తున్నాయి' అని ఒక నాయిక అనడం ఆమె ప్రేమ పారవశ్యాన్ని చాటుతుంది. కొంతమంది వివాహితలైన స్త్రీలు తమ ప్రేమ వ్యవహారాలను నడపడానికి ప్రదర్శించే సమయస్ఫూర్తి గాథల్లోని మరో ప్రధాన ఆకర్షణ. ఇది వారిని అమాయక బాధితులుగా కాకుండా, తెలివైన క్రీడాకారిణులుగా నిలబెడుతుంది. ప్రియుడితో గడిపినప్పుడు శరీరంపై ఏర్పడిన గుర్తులను అత్తగారికి తెలియకుండా దాచడానికి వారు చెప్పే కారణాలు చాలా వినూత్నంగా ఉంటాయి. 'తోటలో పని చేస్తుంటే ముళ్ళు గీసుకున్నాయి' అనో, 'తుమ్మెదలు దాడి చేశాయి' అనో చెప్పి వారు తప్పించుకుంటారు.

గాథాసప్తశతిలోని గాథలను పరిశీలిస్తే స్త్రీల ప్రేమలో కృత్రిమత్వం ఉండదు. వారు ధనవంతులైన భర్తల కంటే, గుణవంతులైన, అందమైన ప్రియులనే కోరుకుంటారు. 'సంపాదించే భర్త దూరదేశంలో ఉంటే నాకేంటి? నా కళ్ళ ముందు ఉండి నన్ను అలరించేవాడే నాకు కావాలి' అనే స్త్రీల మాటలు వారి ప్రాధాన్యతలను స్పష్టం చేస్తాయి. సంపద కన్నా సాన్నిహిత్యమే వారికి ముఖ్యం. ఈ విధంగా, గాథాసప్తశతిలోని ప్రేమ, శృంగారం పూర్తిగా స్త్రీల పక్షాన నిలబడి, వారి అంతరంగాన్ని ఆవిష్కరిస్తాయి.

భారతీయ అలంకార శాస్త్రంలో శృంగారం రెండు విధాలు: సంభోగం, విప్రలంభం (విరహం). గాథాసప్తశతి కవులు సంభోగం కన్నా విప్రలంభ శృంగారానికే పెద్దపీట వేశారు. ప్రియుడి సాన్నిహిత్యంలో స్త్రీ పొందే ఆనందం కంటే, ఎడబాటులో ఆమె అనుభవించే వేదన, నిరీక్షణ ఆమె ప్రేమ గాఢతను మరింత స్పష్టంగా ఆవిష్కరిస్తాయి. ఈ గాథల్లో విరహం కేవలం కన్నీరు పెట్టుకోవడం మాత్రమే కాదు, అది ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడే ఒక మానసిక సంఘర్షణ. గాథాసప్తశతి కాలంలో పురుషులు వ్యాపారం, ఉద్యోగం లేదా రాజుల సేవ నిమిత్తం దూర దేశాలకు వెళ్ళడం సర్వసాధారణం. ఇలా భర్త దూరంగా ఉన్న స్త్రీని 'ప్రోషితభర్తృక' అంటారు. వీరి జీవన విధానం, నిరీక్షణ ఈ కావ్యంలో ఒక ప్రధాన ఇతివృత్తం. భర్త వెళ్ళేటప్పుడు ఎంత బాధపడుతుందో, వెళ్ళిన తర్వాత అతని రాక కోసం అంతకన్నా ఎక్కువ తపిస్తుంది. 'అతను వెళ్తుంటే ఆపలేకపోయాను, కనీసం నా మనసునైనా అతనితో పంపాను' అని ఒక నాయిక అనడం, ఆమె శారీరకంగా ఇక్కడ ఉన్నా,

మానసికంగా భర్తతోనే ప్రయాణిస్తోందని తెలియజేస్తుంది. భర్త తిరిగి వస్తానన్న గడువు (అవధి) కోసం స్త్రీలు లెక్కించే తీరు హృదయవిదారకంగా ఉంటుంది. ఇంటి గోడల మీద గీతలు గీస్తూ రోజులు లెక్కించడం నాటి ఆచారం. 'రోజులు గడుస్తున్న కొద్దీ గోడ మీద గీతలు ఎక్కువవుతున్నాయి, కానీ ఆమె వేళ్లు అరిగిపోతున్నాయి, ఆశ సన్నగిల్లుతోంది' అని కవులు వర్ణించారు. గీతలు గీసిన గోడను చూస్తూ, ఎక్కడ ఆ గీతలు చెరిగిపోయి లెక్క తప్పుతుందోనని ఆమె భయపడటం, ఆమె అమాయక ప్రేమకు నిదర్శనం.

గాథాసప్తశతిలో విరహ వేదనను వర్ణించడానికి కవులు ఎంచుకున్న అత్యంత శక్తివంతమైన నేపథ్యం 'వర్ష రుతువు'. బాటసారులు (పథికులు) ప్రయాణం ఆపివేసే కాలం ఇది. ఆకాశం నిండా నల్లని మేఘాలు, ఉరుములు, మెరుపులు విరహిణుల గుండెల్లో భయాన్ని, కోరికను ఏకకాలంలో రగిలిస్తాయి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ అనువదించిన ఒక గాథలో, 'మేఘాల ఉరుములు వినలేక, విరహిణి తన చెవులను చేతులతో గట్టిగా మూసుకుంటుంది'. ఆ శబ్దం ఆమెకు మరణ శాసనంలా వినిపిస్తుంది. భర్త దగ్గర లేనప్పుడు వర్షం కురవడం ఆమెకు ప్రకృతి చేస్తున్న అన్యాయంగా తోస్తుంది. కొత్తగా పూసిన పూల వాసనలు, తడిసిన మట్టి వాసన, నెమళ్ల అరుపులు ఆమె ఒంటరితనాన్ని మరింత భరించలేనివిగా మారుస్తాయి. 'ఓ మేఘమా! నా భర్త వచ్చే దారిలో వర్షం కురిపించకు, అతను ఆగిపోతాడు. అతను ఇంటికి వచ్చాక, మా ఇంటిపై కురు, మేము బయటకు వెళ్ళకుండా ఉంటాం' అని మేఘాన్ని వేడుకునే స్త్రీల స్వగతాలు ఇందులో కనిపిస్తాయి. నిజజీవితంలో భర్తను కలవలేని స్త్రీలు, కనీసం కలలోనైనా అతన్ని కలవాలని కోరుకుంటారు. కానీ విరహ వేదన వల్ల వారికి నిద్ర కూడా కరువవుతుంది. 'నిద్ర వస్తే కదా కల వచ్చేది, కలలోనైనా నా ప్రియుడు కనిపించేది? కానీ ఈ పాపిష్టి కళ్ళు నిద్రకు కూడా నోచుకోలేదు' అని నాయిక వాపోతుంది. ఇంటి ముందు కాకి అరిస్తే చుట్టాలు వస్తారనే నమ్మకం నాటి నుండే ఉంది. భర్త రాక కోసం కాకి కాళ్ళ మీద పడి మొక్కుకునే స్త్రీల చిత్రణ గాథల్లో ఉంది. కాకి అరుపు వినగానే ఆమెలో కలిగే ఆశ, ఆ తర్వాత అది నిజం కాదని తెలిసాక కలిగే నిరాశ పాఠకులను కదిలిస్తాయి. విరహం అనేది కేవలం మనసుకే కాదు, శరీరానికి కూడా శిక్షే. దుఃఖం వల్ల స్త్రీలు చిక్కిపోవడాన్ని కవులు అలంకారికంగా వర్ణించారు. 'ఆమె చేతులు ఎంతగా చిక్కిపోయాయంటే, ఆమె వేసుకున్న గాజులు వాటంతటవే జారిపోతున్నాయి. వాటిని ఆపడానికి ఆమె మళ్ళీ మళ్ళీ చేతులు పైకి ఎత్తాల్సి వస్తోంది' అని ఒక గాథ వివరిస్తుంది. ఏడుపు ఆపుకోలేక కళ్లు వాచిపోవడం, ఆ కన్నీటి వల్ల చూపు మనకబారడం సహజం. చివరకు భర్త వచ్చినా, ఆనందబాష్పాలతో నిండిన కళ్ళ వల్ల అతన్ని స్పష్టంగా చూడలేకపోతున్నానని నాయిక బాధపడటం విరహంలోని ఒక మధురమైన మలుపు.

వ్యంగ్యం, హాస్యం, చాకచక్యం

గాథాసప్తశతిలోని స్త్రీలు కేవలం ప్రేమికులే కాదు, వారు గొప్ప మేధావులు కూడా. వారి మాటల్లోని హాస్యం కేవలం నవ్వించడానికి మాత్రమే కాదు, అది జీవిత సత్యాలను, సామాజిక వైరుధ్యాలను ఎత్తిచూపడానికి ఒక ఆయుధంగా పనిచేస్తుంది. ముఖ్యంగా 'వ్యంగ్యం' అనేది ఈ గాథల్లో స్త్రీల చేతిలో ఉన్న బ్రహ్మాస్త్రం. పురుషుల అబద్ధాలను, అత్తగారి ఆంక్షలను, సామాజిక కట్టుబాట్లను వారు తమ వాగ్ధాటితో ఎలా ఎదుర్కొన్నారో గాథా సప్తశతిలో కనిపిస్తుంది. సంస్కృత అలంకార శాస్త్రంలో 'వక్రోక్తి'కి (వంకర మాట/చమత్కారం) పెద్ద పీట వేశారు. గాథాసప్తశతిలోని స్త్రీలు దీనిని అద్భుతంగా ప్రయోగిస్తారు. వారు చెప్పేది ఒకటి, కానీ ఆ మాటల వెనుక ఉన్న అర్థం మరొకటి. ఒక స్త్రీ తన భర్త పరస్త్రీ వ్యామోహాన్ని పసిగడుతుంది. కానీ గొడవ పడదు. బదులుగా, 'గోదావరి నది అందరినీ కలుపుకుపోతుంది, అందుకే అది పవిత్రం కాదు' అని నదిని నిందిస్తున్నట్లు నటిస్తూ, పరోక్షంగా భర్త ప్రవర్తనను ఎత్తిచూపుతుంది. ఇక్కడ నది అనేది పరస్త్రీకి లేదా భర్త చంచల మనస్తత్వానికి ప్రతీక. అలాగే, దారిన పోయే బాటసారితో (నిజానికి తన ప్రియుడితో), 'ఓ బాటసారీ! ఈ ఊర్లో ఉండటానికి నీకు చోటు దొరకదు, ఎందుకంటే ఇక్కడ అందరూ కఠినాత్ములే... ఒక్క నా ఇల్లు తప్ప' అని చెబుతుంది. పైకి నిరాకరిస్తున్నట్లు కనిపిస్తూనే, తన ప్రేమను తెలపడం ఆమె చాకచక్యం. అలాగే భర్త ప్రవర్తన నచ్చనప్పుడు లేదా అతను చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించినప్పుడు, భార్యలు వేసే వ్యంగ్య బాణాలు చాలా పదునుగా ఉంటాయి. భర్త బయట తిరిగి వచ్చి, 'నేను స్నేహితులతో ఉన్నాను' అని అబద్ధం చెబుతాడు. కానీ అతని బట్టల మీద ఉన్న పూల వాసన, చెదిరిన తలకట్టు నిజం చెబుతాయి. అప్పుడు భార్య, 'నిజమే, మీ స్నేహితులకు పూల వాసనలు అంటే చాలా ఇష్టం కాబోలు' అని నవ్వుతూనే చురకలు వేస్తుంది. యుద్ధానికి వెళ్తానని ప్రగల్భాలు పలికే భర్త, చిన్న శబ్దానికే భయపడితే, భార్య అతని 'వీరత్వాన్ని' చూసి నవ్వుకుంటుంది. ఈ హాస్యం దాంపత్య జీవితంలోని వాస్తవికతను చూపిస్తుంది. కొంతమంది అమాయకపు స్త్రీలు (ముగ్ధలు) చేసే పనులు కూడా హాస్యాన్ని పుట్టిస్తాయి. అప్పుడే పెళ్లయిన ఒక ముగ్ధ, రాత్రిపూట నీళ్లలో ప్రతిఫలించిన చంద్రుడిని చూసి, అది వెండి పళ్ళెం అనుకుని తీసుకోవడానికి చేయి పెడుతుంది. అది దొరకక్కపోవడంతో ఏడుస్తుంది. ఈ సన్నివేశం చూసి భర్త నవ్వుకుంటాడు. ఇది కల్మషం లేని హాస్యం. ఇంట్లోకి వచ్చిన కోతిని చూసి భయపడి, భర్తను గట్టిగా వాటేసుకునే భార్యను చూసి, కోతిని తరిమేయకుండా భర్త అలాగే ఉండిపోతాడు. ఇక్కడ హాస్యం శృంగారానికి దారితీస్తుంది. సమాజంలోని ద్వంద్వ ప్రమాణాలను ప్రశ్నించడానికి కూడా స్త్రీలు హాస్యాన్ని వాడుకుంటారు. 'మగవాళ్ళు ఎన్ని తప్పులైనా చేయవచ్చు, కానీ ఆడవాళ్ళు గడప దాటకూడదా?' అని ప్రశ్నించే గాథల్లోని స్వరం, తీవ్రమైన సామాజిక విమర్శను హాస్యం పూతలో అందిస్తుంది. 'మా అత్త నన్ను చూడవద్దని చెప్పింది, కానీ ఆమె

మాత్రం ఊరంతా చూస్తుంది' అని కోడలు అనడం ఇందుకు ఉదాహరణ.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో స్త్రీ పాత్రలు తరచుగా పురుషుల కవిత్వానికి వస్తువులుగానో, లేదా ఆదర్శాలకు ప్రతిరూపాలుగానో కనిపిస్తారు. కానీ గాథాసప్తశతి ఈ సంప్రదాయాన్ని బద్దలు కొట్టింది. ఇందులోని స్త్రీలు కేవలం వర్ణనలకు పరిమితం కాలేదు, వారు తమ భావాలను, కోరికలను, నిరసనలను నిర్భయంగా ప్రకటించే 'కర్తలు'. హాలుడి సంకలనంలోని అత్యంత ఆకర్షణీయమైన అంశం ఈ 'భావ ప్రకటన స్వేచ్ఛ'. గ్రామీణ వాతావరణం, ప్రాకృత భాషలోని దేశీయత ఈ స్వేచ్ఛకు ఊపిరి పోశాయి. గాథాసప్తశతిలోని స్త్రీల మాటల్లో ఎక్కడా దాపరికం ఉండదు. తమకు నచ్చిన దానిని నచ్చినట్లు, నచ్చని దానిని నచ్చనట్లు చెప్పే ధైర్యం వారి సొంతం. సాధారణంగా ప్రాచీన కావ్యాల్లో స్త్రీలు తమ కోరికలను బయటకు చెప్పడానికి సిగ్గుపడతారు. కానీ సప్తశతిలో స్త్రీలు తమ ప్రేమను, శారీరక ఆకర్షణను చాలా సహజంగా, ఎటువంటి అపరాధ భావం లేకుండా వ్యక్తం చేస్తారు. 'నా ప్రియుడు దూరంగా ఉన్నాడు, ఈ వెన్నెల నా శరీరాన్ని దహించి వేస్తోంది' అని చెప్పడం లో వారికి ఎలాంటి బిడియం లేదు. ఇది వారి మానసిక స్వేచ్ఛకు నిదర్శనం. కేవలం ప్రేమనే కాదు, కోపాన్ని కూడా వారు అంతే స్పష్టంగా చూపిస్తారు. ప్రియుడు చేసిన తప్పును నిలదీయడంలో, అతని మోసాన్ని ఎండగట్టడంలో వారి మాటలు కత్తుల్లా దిగుతాయి. 'ఓయీ! నీవు పరస్త్రీని కలిసి వచ్చావని నీ కళ్లే చెబుతున్నాయి, నా దగ్గర ఈ నాటకాలెందుకు?' అని భర్తను లేదా ప్రియుడిని సూటిగా ప్రశ్నించే స్త్రీలు ఇందులో కనిపిస్తారు.

స్త్రీల భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రధాన వేదిక 'సఖి' (చెలికత్తె)తో జరిపే సంభాషణలు. స్త్రీల మధ్య ఉండే ఈ స్నేహ బంధం వారికి ఒక సురక్షితమైన స్థలాన్ని కల్పించింది. తల్లికి, భర్తకు చెప్పుకోలేని అనేక విషయాలను స్త్రీలు తమ చెలికత్తెలతో పంచుకుంటారు. అత్తగారి పోరు వల్ల కలిగే బాధను, భర్త అమాయకత్వం వల్ల కలిగే అసహనాన్ని, ప్రియుడిపై ఉన్న మమకారాన్ని వారు తమ స్నేహితురాళ్లతో స్వేచ్ఛగా చర్చిస్తారు. చెలికత్తెలు కేవలం వినేవారు మాత్రమే కాదు, వారు సలహాలు ఇచ్చేవారు కూడా. 'అమ్మాయి! ఆ మగవాడిని నమ్మి మోసపోకు' అని హెచ్చరించడం లేదా 'ఈ రాత్రికి తోటలోకి వెళ్లు, అతడు అక్కడ ఉంటాడు' అని ప్రోత్సహించడం వంటివి వీరి మధ్య ఉన్న స్వేచ్ఛను సూచిస్తాయి. సమాజం విధించిన కట్టుబాట్ల మధ్య తమ స్వేచ్ఛను కాపాడుకోవడానికి స్త్రీలు ఎంచుకున్న ఒక అద్భుతమైన మార్గం 'అన్యాపదేశం' లేదా 'వక్రోక్తి'. ప్రియుడిని నేరుగా పిలవలేని పరిస్థితిలో, స్త్రీలు ప్రకృతిని పావుగా వాడుకుంటారు. దారిన పోయే బాటసారితో మాట్లాడుతూ, 'ఓ బాటసారీ! ఈ దారిలో వెళ్లకు, అక్కడ సింహం ఉంది' అని చెబుతూనే, వాస్తవానికి అక్కడ తన ప్రియుడు ఉన్నాడని, ఇతరులు అక్కడికి వెళ్లకూడదని పరోక్షంగా హెచ్చరిస్తారు. అలాగే, 'ఈ కొలను ఒడ్డున ఉన్న చెట్టు ఎండిపోయింది' అని చెప్పడం ద్వారా, అక్కడ కలయికకు అవకాశం లేదని ప్రియుడికి సంకేతం ఇస్తారు. మాటల్లో చమత్కారం వాడటంలో వీరిది అందెవేసిన చేయి. పైకి సాధారణంగా కనిపించే మాటల్లో శృంగారపరమైన లేదా విమర్శనాత్మకమైన అర్థాలను దాచిపెట్టి మాట్లాడటం వీరి ప్రత్యేకత. ఇది వారి మేధోపరమైన స్వేచ్ఛను తెలియజేస్తుంది. గాథాసప్తశతిలో స్త్రీలు కేవలం మాట్లాడటంతో ఆగిపోరు, వారు కార్యాచరణలో కూడా స్వేచ్ఛను ప్రదర్శిస్తారు. ప్రియుడిని కలవడానికి స్వయంగా సంకేత స్థలానికి వెళ్లే స్త్రీని 'అభిసారిక' అంటారు. చీకటి రాత్రులలో, వర్షంలో తడుస్తూ, పాములకు, తేళ్లకు భయపడకుండా అడవి దారిలో నడిచే స్త్రీల సాహసాన్ని అనేక గాథలు వర్ణించాయి. ఇందులో ఆమె ఒక బాధితురాలు కాదు, తన ఆనందం కోసం ఇబ్బందులు ఎదుర్కోవడానికి సిద్ధపడే సాహసి. కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు, దానిని పరిష్కరించడానికి స్త్రీలే చొరవ తీసుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పుడు లేదా కుటుంబ కలహాలు రేగినప్పుడు, వారు తమ లౌక్యంతో పరిస్థితిని చక్కదిద్దుతారు.

శాతవాహన చక్రవర్తి హాలుడు సంకలనం చేసిన ఈ ఏడు వందల గాథలు కేవలం కవిత్వ పాదాలు కావు, అవి రెండు వేల సంవత్సరాల క్రితం నాటి సామాజిక జీవితానికి, మానవ సంబంధాలకు, ముఖ్యంగా స్త్రీల మనోభావాలకు సజీవ సాక్ష్యాలు. వాస్తవంగా గాథాసప్తశతి 'స్త్రీల పుస్తకం'. ఇందులోని సింహభాగం గాథలు స్త్రీల గొంతుకనే వినిపిస్తాయి. సంస్కృత సాహిత్యం స్త్రీని ఒక వస్తువుగానో, లేదా అలంకారిక బొమ్మగానో చూపిస్తే, హాలుడి గాథలు ఆమెను రక్తమాంసాలు, కోరికలు, ఆలోచనలు కలిగిన 'మనిషి'గా నిలబెట్టాయి. ఆమె మాటల్లో పదును ఉంది. పరిశోధనా దృష్టితో చూసినప్పుడు గాథాసప్తశతిని ఒక 'వాస్తవ సాహిత్యం'గా పేర్కొనవచ్చు. ఇందులో ఆదర్శాల ముసుగు లేదు. మనుషుల బలహీనతలను, తప్పులను, కోరికలను కవులు సానుభూతితో, హాస్యంతో చిత్రించారు తప్ప, తీర్పులు ఇవ్వలేదు. అందుకే ఈ గ్రంథం ఇన్ని శతాబ్దాలైనా తన వన్నె తగ్గకుండా నిలిచింది. హాలుడు చేసిన ఈ బృహత్తర కృషి వల్లనే, చరిత్ర మరుగున పడిపోవాల్సిన ఎందరో అనామక గ్రామీణ స్త్రీల గొంతుకలు నేటికీ మనకు వినిపిస్తున్నాయి. ఆ గొంతుకల్లోని ఆర్ద్రత, ఆవేదన, ఆనందం ఎప్పటికీ పాఠకులను కదిలిస్తూనే ఉంటాయి. భారతీయ స్త్రీవాద సాహిత్యానికి తొలి బీజాలు ఈ గాథల్లోనే పడ్డాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఉపయోగించిన పుస్తకాలు

తెలుగు:

1.అనంతకృష్ణ శర్మ, రాళ్ళపల్లి. గాథా సప్తశతీ సారము. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1984.

2. సుబ్బారావు, దీవి. ప్రాకృత గాథా సప్తశతి. హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్, 2012.

English: Khoroche, Peter and Tieken, Herman. Poems on Life and Love in Ancient India: Hala's Sattasai. Albany: State University of New York Press, 2009.

సాహిత్య సమీక్ష

ప్రాణమసొంటి పాటకు కేరాఫ్ 'మిట్టపల్లి'

డా. పసునూరి రవీందర్

తెలంగాణ నేల మీద పాటకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. వందలాది మంది పాటకవులు చేసిన మహత్తర కృషి వల్లే రాష్ట్ర సాధన సులభతరమైంది. ప్రజల బతుకును పల్లవి, చరణాలుగా ఆలపించిన ప్రజావాగ్గేయకారుల కృషి విలువైనది. పాటలేని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించలేం. మలిదశ తెలంగాణ ఉద్యమానికి అంతకంటే ముందు వచ్చిన ఉద్యమాల సాంస్కృతిక బలమే ఒక దారి చూపించింది. పాట రచనలో, ప్రదర్శనలో సరికొత్త ప్రయోగాలకు దారులు వేసింది. ముఖ్యంగా పాటల్లో ప్రజల బతుకును, సంఘర్షణను ఎలుగెత్తి చాటిన తీరు ఆశ్చర్య పరుస్తుంది. వెయ్యి ఉపన్యాసాలు చేయలేని పని ఒక్క పాట చేయగలిగింది. అలాంటి ఉద్యమ పాటల చరిత్రలో ఒక్కో వాగ్గేయకారునిది ఒక్కో రకమైన శైలి. పదజాలంలో, బాణి కట్టడంలో, కవిత్వ ఇంధనాన్ని జోడించడంలో ఎవరి శైలి వారిదే. పాటను ప్రజలకు మరింత చేరువ చేసిన ప్రజాయుద్ధనౌక గద్దర్ నుండి ఇవాళ్టి యువ రచయితల దాకా ఈ రకమైన వైవిధ్యాన్ని మనం గమనించవచ్చు.

ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన మలిదశ కాలానికి అందివచ్చిన రచయిత మిట్టపల్లి సురేందర్. మిట్టపల్లి పాటల్లో ఒక సజీవత ఉంటుంది. అది ఎవ్వరి హృదయాన్నైనా మెలిపెడుతుంది. ఆలోచింపజేస్తుంది. తెలంగాణ సాధన కోసం అవసరమైన పాటలను అంబుల పొది నుండి సంధించిన అస్త్రాల వంటివి మెట్టపల్లి పాటలు. నెత్తురుకు ఒక మండే గుణముంటది. కొట్లాడే లక్షణముంటది. పట్టుకుంటే తగిలే ఒక తడి ఉంటది. అలాగే తిరగబడే తనముంటది. భగ్గున మండి ఇతరులను మండించే స్వభావముంటది. ఈ గుణలన్నీ మనం ఒకే చోట చూడాలంటే మిట్టపల్లి సురేందర్ పాటలు వినాలి. అందుకే ఇవి నెత్తురసొంటి పాటలు. తెలంగాణ నేల మీద మిట్టపల్లి పాట తెలియని ఊరు లేదంటే అతిశయోక్తి కాదు. అలాగని మిట్టపల్లి తెలంగాణ ఉద్యమంలో అంది వచ్చినవాడు కాదు. అంతకంటే ముందే వెలిశాల మీద, ఆదిలాబాదు మీద, వరకట్న చావుల మీద, అమరవీరుల మీద పాటలు రాసి మట్టిలో మాణిక్యంలా జీవించినవాడు. సరిగ్గా తెలంగాణ ఉద్యమం రగులుకునేటప్పటికీ తాను పాటల తుపాకీతో సిద్ధమై ఉన్న కల్చరల్ సోల్జర్. మిట్టపల్లి పాట ఎట్లా ఉంటది? అది ఎట్లా అల్లుకుపోతది? అది ఎలాంటి ఆలోచనలు కలిగిస్తది?

ఎట్లా మనల్ని కుదురుగా కూర్చోనివ్వదో తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తది. ఇంతటి పాటశక్తి మిట్టపల్లికి ఎట్లా అబ్బిందో తెలుసుకోవాలంటే మనం వెలిశాల దాకా వెళ్లిరావాలి.

పొద్దంతా ఒకరకమైన తుపాకులు, రాత్రంతా మరోరకమైన తుపాకులు తెలంగాణ పల్లెలను పహారా కాసిన కాలమది. పిట్ట కుయ్యిమనే అలికిడి మరిచిపోయిన కాలం. ఎదిగిన కొడుకులను చూసి అయ్యవ్వలు బిక్కుబిక్కుమన్న కాలం. అదిగో అలాంటి భయంకరమైన కాలంలో మిట్టపల్లికి పాట ఒంటపట్టింది. పరకాల గడ్డ మీద పుట్టిన వాడు పాటగాడో, పోరాటకారుడో కాకుండా జీవించడం అసాధ్యం. అందుకే మిట్టపల్లి పాటల వైపు వచ్చాడు. తానంతట తాను రాలేదు. కాలమే తనను పాటల వైపు మళ్లించింది. తాను పుట్టిన గడ్డ మీద తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిచింది. ఆ వారసత్వం విప్లవోద్యమం దాకా అందివచ్చింది. ఈ వారసత్వం ఉన్న తరువాత మిట్టపల్లి పాటగాడు కాకుండా ఉండే సవాలే లేదు. అలా పాటల పండువెన్నెలలో సేద తీరిన బాల కార్మికుడు మిట్టపల్లి. పాటే తన సోపతి. పాటే తన గుర్తింపు. పాటే తన ప్రాణం. పాటతో ఎంత సుదీర్ఘ ప్రయాణం చేశాడో తనకే తెలుసు. తన పాట కోసం ఊళ్లల్ల నుండి జనం ఎడ్లబండ్లు కట్టుకుని రావడం ఒక చరిత్ర. ఆ చరిత్ర తెలంగాణ మలిదశ ఉద్యమం కంటే ముందే అందివచ్చింది. అలాంటి మిట్టపల్లి తెలంగాణ ఉద్యమ సమయానికి కాలం కన్న కవిగా బరిలో నిలిచాడు. నెత్తురసొంటి పాటలకు పురుడు పోశాడు. తన వంతు చారిత్రక బాధ్యతను నెరవేర్చాడు.

ప్రపంచ పోరాటాల చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. అరవయేండ్ల ఆకలి మంటల పోరాటం. మూడున్నర కోట్ల మంది సుందరస్వప్నం. ఆ స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు ఎన్ని త్యాగాలు? ఎన్ని

బలిదానాలు? తలుచుకుంటే ఒళ్లు పులకరిస్తది. అలాంటి మహా ఘట్టంలో లక్షలమందిని కదిలించిన పాట మిట్టపల్లిది. ప్రపంచంలో అత్యంత ఎక్కువమంది జనాలు ఒకే మీటింగ్లో పాల్గొన్నవి 2020కి ముందు చాలా తక్కువ. 50లక్షల మంది పాల్గొన్న మీటింగ్లో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ అమెరికాలో నల్లజాతి ప్రజల కోసం "I have a dream"అంటూ గర్జించాడు. ఆ తరువాత ఇరాక్లో శాంతి కోసం 2003లో మిలియన్ల కొద్ది జనం రోడ్డెక్కారు. ఇక తెలంగాణ కోసం వరంగల్లో నిర్వహించిన మహాగర్జన మీటింగ్కి అక్షరాల 27లక్షల మంది వచ్చారు. అదిగో ఆ మీటింగ్లో అన్ని లక్షలమందిని కంటతడి పెట్టించింది మిట్టపల్లి పాట. అమరుడు శ్రీకాంతా చారి మీద మిట్టపల్లి రాసిన **"రాతిబొమ్మల్లో కొలువైన శివుడా..."**పాట ఉద్యమ వేడిని రగిలించింది. అన్యాయంగా అసువులు బాసిన బిడ్డల చావులకు సీమాంధ్ర పాలనే కారణమని తేల్చింది.

అంతేకాదు 2009 ఉద్యమం భగ్గున మండిన కాలం. ఆ కాలంలో పాట అత్యంత ఎక్కువగా అవసరమైంది. ఆ అవసరాన్ని గుర్తించి పాటను టీవీ మీడియాకు ఎక్కించినవాడు మిట్టపల్లి. ఇండ్లల్లో కూర్చోని వార్తలు చూసే జనాలకు మిట్టపల్లి పాట ఒక పౌరుషాన్ని రగిలించింది. "జననీ జననీ జై తెలంగాణ"అంటూ ఎగిసిన పాట ఒంటి మీద రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. అదిగో అది మిట్టపల్లి వేసిన తోవ. ఆ తరువాత టీవీ ఛానళ్లన్నీ తెలంగాణ ఉద్యమ పాటల వైపు క్యూకట్టాయి. అనేకమంది కళాకారులకు స్పేస్ కలిగించాయి. ఆ విధంగా మిట్టపల్లి టీవీ ఛానళ్లలో పాటలు ప్రసారం చేసే ట్రెండ్కు 'ట్రెండ్ సెట్టర్' అయ్యాడు. అట్లా వేదికల మీది నుండి ఉద్యమ పాట టీవీ ఛానళ్ల దాకా పాకింది. ఉద్యమ పాటే కాదు బతుకమ్మ, బోనాలు వంటి ఏ పండుగ వచ్చినా దాని మీద ఇవాళ టీవీ ఛానళ్లలో పాట మోగాల్సిందే. లేకుంటే టీఆర్పీ రేటింగుల్లో వెనకబడి పోవడం ఖాయం అనే పరిస్థితి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో నుండి మిట్టపల్లి పాటను అర్థం చేసుకోవాలి.

పాట లేకుండా తెలంగాణ రాలేదు. సబ్బండ జనం ఎంత కొట్లాడారో ఒక్క పాట అంత పాత్ర పోషించింది. ప్రజలతో సమానంగా నడిచింది పాట. తెలంగాణకు జరుగుతున్న మోసాలను మిట్టపల్లి పాట కుల్లంకుల్లం చేసింది. పాటల పెద్ద దర్వాజ గద్దర్, మాస్టార్జీ, గూడ అంజన్న, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు, మిత్ర వంటి వాగ్గేయకారులది మొదటి తరం. ఆ తరం తరువాత కొనసాగింపుగా వచ్చిన తరంలో ముందు వరసలో వినబడే పేరు మిట్టపల్లి సురేందర్. తెలంగాణ ఉద్యమం మీద అనేక పాటలు రాశాడు.

కవిత్వాన్ని పాటల్లకు ఒంపినతనం మిట్టపల్లి పాటలో మనకు అడుగడుగునా కనిపిస్తది. దగాపడ్డ బిడ్డల దు:ఖాలకు తన పాట గొంతుకను ఇచ్చి మోసింది. మర్లబడకుంటే బతుకుమారదని తట్టి లేపి నిలబెట్టింది. తెలంగాణ అంటే విషాదాలు, దు:ఖాలే కాదు, ఉరిమే ఉత్సాహం, బరిగీసి నిలబడే తెగువ అని చాటి చెప్పింది. పల్లె తెలంగాణను ఆవాహన చేసుకున్నడు మిట్టపల్లి. అందుకే తన పాటల నిండా జీవితం ఉన్నది. అదే జీవం పోసింది. మిట్టపల్లి పాట వింటే తెలంగాణ వద్దన్న ఆంధ్రులకు సైతం మనసు పులకరిస్తది. అట్లా మిట్టపల్లి పాట ఖండాలు దాటి గుండెలను గెలిచింది.

"కన్నబిడ్డలనమ్మే కాలం కొనసాగదు
ఉన్న ఊరొదిలిపోయే వలసలు ఇక సాగవు
కార్చినా కన్నీళ్లన్నీ
పాల దారలయ్యేరోజు" అంటాడు

"పొడిసే పొద్దు కురుసే చినుకు" పాటలో. పాటలో కవిత్వమే లేకుంటే దానిలో జీవాత్మ ఉండదు. అది పేలవమై ప్రజలను కదిలించలేదు. ఇది మిట్టపల్లి పాటకు తెలియదు. వచన కవిత్వంలో గాఢతను అలవోకగా పాటలోకి పట్టుకురాగలిన చేయి తిరిగినతనం మిట్టపల్లికి అబ్బింది. "పల్లేరు పొదలన్నీ మల్లెలై పూసే రోజు"అంటాడు.

"చీకటి నెదురించక పున్నమి ఆగిపోదు
గ్రహణం సూర్యుణ్ణి పూర్తిగా దోచలేదు" అంటూ ప్రకృతి ప్రతీకాత్మకతతో పలికిస్తాడు.

"పడమట సూర్యుడు పతనం కానిదే
పొడవదు రేపటి పొద్దు"అంటాడు.

తెలంగాణ ఆత్మను పట్టుకున్నవాడు మిట్టపల్లి. ఇక్కడి ప్రజలను గురించి, ఇక్కడి సంస్కృతిని గురించి, ఇక్కడి ప్రజలు కలిసి బ్రతికేతనం గురించి మిట్టపల్లికి లోతైన అవగాహన ఉంది. ఆ దృక్పథం నుండి తెలంగాణను అనేకసార్లు వ్యాఖ్యానించాడు. ఏది తెలంగాణ అనే విషయాన్ని కుల్లంకుల్లం వర్ణించాడు.

"హిందూ ముస్లిం అన్నదమ్ములని
అల్లా ఈశ్వర్ అన్నారం
ఆ మేరీ మాత కొలువు దీరిన
మెదకమ్మా మేలిమి జన్మ
పరమేశ్వరుడే పాదం మోపిన
ఎండి గడి కదా ఎములాడ

మేడారం అడవుల్లో సమ్మక్క తల్లి సారక్క
మన జాతికి పసుపు కుంకుమ ఇచ్చిన
కొమురెల్లి సిరి మల్లన్న
సిందూరమద్ది మన దీవించుతున్నారు"అంటాడు
"రారో రగిలింది పోరు"పాటలో.

తెలంగాణను పైపైన చూస్తే ఇంత లోతైన గాఢత కలిగిన సాహిత్యం వెలువడదు. తెలంగాణ ప్రజా జీవన సంస్కృతి మూలాలను అర్థం చేసుకోవాలి. ప్రజల మధ్యన ఉండే సంబంధ బాంధవ్యాలను పట్టుకోవాలి. అప్పుడే ఏ సాహిత్య ప్రక్రియ సృజించడానికైనా సిద్ధపడాలి. అదిగో అలా మిట్టపల్లి కూడా పాటను అట్లా ఎక్కుపెట్టాడు. తెలంగాణ సబ్బండ వర్ణాల సంస్కృతిని పాటల్లోకి ఎత్తిండు.

"ఏ ఆయుధమన్నది వాడని స్థలం
మేధాశక్తే లక్షల బలం
రంగులు మార్చే రాజకీయాలకు
లొంగిపోని లోకం
ఇక్కడ అందరు ఏకం
విద్యతో పాటే విప్లవ గానం
వినిపించడమే ఓయూ నైజం
సంఘం కోసం సమిధలైన
వీరుల సందేశం అది మన అందరికాదర్శం
చైతన్యం గుండెల్లో చెలరేగే జ్వాలల్లో…"అంటాడు ఉస్మానియా మీద రాసిన "ఓ యుద్ధం పుడితే"పాటలో.

ఇట్లా ప్రకృతికి సంబంధించిన పోలికలతోనే మిట్టపల్లి పాట అల్లుతాడు. అది ఎవ్వరినైనా కదిలిస్తుంది. ఆ రహస్యం తెలిసిన వాగ్గేయకారుడు తాను. అందుకే తన పాటల్లో ఏది చూసిన తప్పకుండా ఒక ప్రకృతి పోలిక ఉంటుంది. నిజానికి పాటకు కవిత్వమే బలం. పాట శరీరమైతే, కవిత్వం దాని ప్రాణం. ఆ విషయాన్ని అర్థం చేసుకున్నడు కాబట్టే కవిత్వాన్ని పక్కన పెట్టి పాట రాయడు మిట్టపల్లి.

"నరికిన చిగురు తొడిగే మొక్క గుణం నేర్చుకో
నడకలు ఆపలేని ఏరులాగా సాగిపో
సంద్రాన్ని తట్టుకునే తీరం కథ చదువుకో
విరిగిన ఎగసి పడే అలల బలం తెచ్చుకో
సాహసం ఊపిరైతే సమరం నీ జీవితం
స్వరాష్ట్ర సాధనకు యోధునివై కదలరా"అంటాడు 'యువతరమంటే…' పాటలో.

ఉద్యమ పాటలన్నీ ఎక్కువగా జానపద బాణీలనే అనుకరిస్తాయి. ఇది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలపు పాట నుండి ఉంది. ఇదే ఆ తరువాత వచ్చిన ఉద్యమాల్లో కూడా కొనసాగింది. మిట్టపల్లి మాత్రం కొత్త బాణీని సృష్టించాడు. అది హృదయానికి హత్తుకునేలా ఉంటుంది. తాను చెప్పదలుచుకున్న లోతైన భావానికి వాహికలా ఉంటుంది. బాణీ పరమైన నైపుణ్యం కూడా మిట్టపల్లి పాటను మరో లెవెల్కు తీసుకెళ్లింది. కొత్త వస్తువు, దానికి తగిన కవిత్వం, దాన్ని గొప్పగా నిలబెట్టే బాణీ. ఈ మూడే మిట్టపల్లి పాటను కోట్లమంది చెంతకి చేర్చింది.

ఇట్లా తెలంగాణ రాష్ట్ర సాధనలో మిట్టపల్లి పాటలు కీలక పాత్రను పోషించాయి. బిడ్డలు చచ్చిపోతుంటే తన కలం కన్నీరు కార్చింది. తెలంగాణ లూటీ పోతుంటే తన గళం సముద్రమై పోటెత్తింది. ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడంటూ నిద్ర లేపింది. బలమైన తాత్విక గాఢతతో ఆధునిక వాగ్గేయకారుల్లో తనదైన ముద్రను వేసింది. మిగిలిన పాటకవులు చేయలేని ఎన్నో ప్రయోగాలు చేసి చూపించాడు. వస్తువులో, కవిత్వంలో, బాణీలో నూతనత్వాన్ని ప్రవేశపెట్టాడు. అట్లా తెలంగాణ ఉద్యమ పాటల చరిత్రలో తన పేజీని తానే లిఖించుకున్నాడు. చావులేని పాటలు రాసి రాష్ట్ర సాధనలో తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషించాడు. ఇవాళ తెలంగాణ సాధించుకున్న తరువాత కూడా మిట్టపల్లి కలం ఆగిపోలేదు. నిత్యం ఏదో ఒక పాట రాస్తూనే ఉన్నాడు.

"ఇదిగో, పాటలతో మేము నిప్పు రాజేస్తున్నాము. ప్రపంచపు భయం మా అంతరంగాల ప్రవాహాన్ని ఎన్నటికీ అడ్డుకోలేదు. అన్నింటికీ మించి, మా సొంతమైనది మాకు ఉన్నది ఒక్క దృక్పథమే. మరెవరి కళ్ల ద్వారానో ఈ ప్రపంచాన్ని మేము ఎందుకు చూడాలి? ఇది నిజమే; మేము ఈ ప్రపంచాన్ని ఒక ఉద్యానవనంగా మార్చలేకపోయాము. కానీ కనీసం, మేము పయనించిన దారుల నుండి కొన్ని ముండ్లనైనా తొలగించగలిగాము"అంటాడు సాహిర్ లుథియాన్వి.

అదిగో ఆ పనిని సమర్థవంతంగా చేశాడు మిట్టపల్లి. చరిత్రలో నిలబడే పాటలు రాశాడు. తెలంగాణ సాధనకు కావాల్సిన పాటల ఇంధనాన్ని తన వంతుగా అందించాడు. తెలంగాణ ఉద్యమ పాటల చరిత్రలో ఇవి చెరగని పాటలుగా ఇప్పటికే నిలిచాయి. ఇవి ఒక్క చోట చేర్చి రేపటి తరాలకు అందించడం అవసరం.

రచయిత: కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత

కడప జిల్లా కైఫియత్తులు-భాషా పరిశీలన

డా. కొల్లేటి రవిబాబు

1. పరిశోధన శీర్షిక (Title of the Research)

మెకంజీ(1754-1821) దక్షిణ భారతదేశంలో సర్వేయరుగా పనిచేసినప్పుడు కడపజిల్లా కైఫియత్తులు సేకరించాడు. వాటిని సి.పి.బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం, యోగివేమన విశ్వవిద్యాలయం వారు 7 సంపుటాలుగా ముద్రించారు. కడపజిల్లాలోని గ్రామాల చరిత్రను తెలిపే ఈ కైఫియత్తులలో (Village local records) ఆకాలంనాటి భౌగోళిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, భాషా విశేషాలు ఎన్నో పొందుపరచబడ్డాయి. ఈ కైఫియత్తులను కరణాలు లేదా గ్రామస్తులు రాయడంవల్ల ఆకాలంనాటి భాషే వీటిలో కనిపిస్తోంది. అందువల్ల కైఫియత్తులలోని భాషకి నేటి వ్యవహారికభాషకి మధ్య లేఖనపద్ధతులలోనూ, వర్ణం, సంధి, సమాసం, నామ, క్రియాపదాలలోనూ, వాక్యనిర్మాణంలోనూ తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదేవిధంగా ఎన్నో ధ్వనిమార్పులు కూడా ఉన్నాయి. అప్పటి వ్యవహారంలో ఉన్న అన్య దేశ్యపదాలు అనేకం నిక్షిప్తంచేయబడ్డాయి. కాబట్టి కడపజిల్లా కైఫియత్తులను పరిశోధనాత్మకంగా విశ్లేషించడంద్వారా 18, 19 శతాబ్దాలనాటి తెలుగు భాషా స్వరూపం తెలుస్తుంది. అని భావించి "కడప జిల్లా కైఫియత్తులు -భాషా పరిశీలన" అనే అంశం పై పరిశోధన చేశాను. దీనిని ఆచార్య డి. విజయలక్ష్మి గారి పర్యవేక్షణలో, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి , జూన్ 2018 లో సమర్పించాను.

పరిశోధన నేపథ్యం (Background of the research)

గతకాలంనాటి మానవాభ్యుదయాన్ని విశ్లేషించేది చరిత్ర. చరిత్ర లేని జాతిని ఊహించలేం. చరిత్ర ఒకతరంనుండి మరొక తరానికి సంక్రమించే వారసత్వపు సంపద. ఇలా ప్రతి తరానికి చరిత్ర అందాలంటే దానిని నిక్షిప్తం చేయడం అత్యంత అవసరం. చరిత్రను నిక్షిప్తం చేయాలంటే దానికి కొన్ని ఆధారాలు ఉంటాయి. మన దేశచరిత్ర నిర్మాణానికి, దాని రచనకు తోడ్పడే అనేక చారిత్రక ఆధారాలలో కైఫియత్తులు కూడా ఒకటి. వీటికే స్థానికచరిత్రలని కూడా పేరు. క్రీ.శ.1793-1816 ల మధ్యకాలంలో మెకంజీ(1754-1821) దక్షిణభారతదేశంలో సర్వేయరుగా ఉన్నప్పుడు కడపజిల్లా కైఫియత్తులు సేకరించాడు (హనుమచ్ఛాస్త్రి. కడప-6:viii) గ్రామాలకు ప్రాంతాలకు సంబంధించిన చారిత్రక, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక


కడపజిల్లా కైఫియత్తులు – భాషాపరిశీలన
(పిహెచ్.డి.పట్టాకోసం హైదరబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంతగ్రంథం)

పరిశోధన
కొల్లేటి రవిబాబు
13HTPH07

పర్యవేక్షణ
డా. డి. విజయలక్ష్మి
అసోసియేట్ ప్రొఫెసర్

తెలుగు శాఖ
మానవీయ శాస్త్రాల విభాగం
హైదరాబాదు విశ్వవిద్యాలయం
హైదరాబాదు 500046
తెలంగాణ
జూన్ 2018

భాషావిశేషాలు తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. కైఫియత్తులని గ్రామస్తులు, కరణాలు రాయడంవల్ల అవి అప్పటి వాడుకభాషలోఉన్నాయి. ఇప్పుడు వ్యవహారంలోలేని ఎన్నో పదాలు వాటిలో కనిపిస్తున్నాయి. అంతేకాకుండా అప్పటి పాలనాభాష ప్రభావంవల్ల అరబ్బీ, పారశీ, ఉర్దూ, ఆంగ్లం మొదలైన అన్యదేశ్య పదాలు వందల సంఖ్యలో జనవ్యవహారంలో ఉన్నట్లు కడప జిల్లా కైఫియత్తులద్వారా తెలుస్తుంది.

పూర్వ పరిశోధనల సమీక్ష (Review of the literature)

కడపజిల్లా కైఫియత్తులను భాషాశాస్త్ర దృష్టితో అధ్యయనం చేసేందుకు పూర్వం జరిగిన పరిశోధనలు పరిశీలించడం జరిగింది. ఈ రంగంలో భాషాఅధ్యయనానికి సంబంధించి కె.కె. రంగనాథాచార్యులుగారు1600-1899 సంవత్సరాల శాసనాలపై చేసిన పరిశోధనలో కైఫియత్తులలోని ఆధారాలను పేర్కొన్నారు. దివాకర్ల వేంకటావధానిగారు 1984లో ''గ్రామ కైఫియత్తులు (గుంటూరు)'' పుస్తకంలోకైఫియతులందలి భాషపై ఒక వ్యాసం రాశారు. రాళ్లబండి రామశాస్త్రి గారు మెకంజీ తెలుగు సంకలనాల్లోని ఉరుదు, మరాఠి, ఒరియా పదాలు అన్న అంశంపై పరిశోధన చేశారు. (పిహెచ్.డి) (ముద్రితం1981). నడుపల్లి శ్రీరామరాజు గారు మెకంజీ కైఫియత్తుల సూచి (అముద్రితం) నిర్మించారు.

ఎస్. వాణీకుమారి కైఫియత్తులు–చారిత్రక, పౌరాణికాంశాలు అనే శీర్షికతోను 1991, వై. బాలరాజు కైఫియత్తులు గ్రామజీవన విధానం అనే శీర్షకతోను 1996, పరిశోధనలు చేశారు. వీటితోపాటు నాయని కృష్ణకుమారి మొదలైనవారు రచించిన వ్యాసాలు ఉన్నాయి.

పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక (Methodology and conceptual frame work)

కడప జిల్లా కైఫియత్తులలో భాషని శాస్త్రీయ దృష్టితో వర్ణనాత్మక పద్ధతిలో పరిశీలించడం వలన వర్ణ స్థాయి, పద, వాక్య స్థాయిలలోని లేఖన, బాషా నిర్మాణ పద్ధతులు నిరూపితమైనాయి. కైఫియత్తుల బాహ్య నిర్మాణంలో కనిపించే భాషా స్వరూపాన్ని విశ్లేషించి చూపడం నాలుగు అధ్యాయాలలో దీనిలో లేఖనంలో కనిపించే ప్రత్యేకతలు వాటికి శాస్త్రపరమైన విశ్లేషణలు, వర్ణాల విభజన, ధ్వని పరిణామాలు, పదాలలోని నామాల క్రియల వ్యాకరణ రూపాలు, సంధి సమాసాల విశ్లేషణ, వాక్య భేదాలు మొదలైనవి చూపబడ్డాయి. కైఫియత్తులు పరిచయం, చారిత్రక నేపథ్యం, వాటి స్వభావం, ఉనికిని వివరించడం ఆ తర్వాత స్వర, వ్యంజన, వర్ణవిజ్ఞానం, సంధి, సమాసం,నామ, క్రియవిజ్ఞానం, వాక్యనిర్మాణం, అన్యదేశ్యాల స్వరూపాలని సమగ్ర విశ్లేషణతో పరిశీలించడం మొదలైన పేర్కొనబడ్డాయి.

పరిశోధన ఉద్దేశం, లక్ష్యం (aims &objectives)

తెలుగు భాషాచరిత్రను పరిశీలించినట్లయితే 19వ శతాబ్దానికి చెందిన భాషాస్వరూపానికి, రాయవాచకంలో కనిపించే భాషా లక్షణాలకు, కైఫియత్తులలోని భాషకు సారూప్యం కనిపిస్తుంది. కాబట్టి కైఫియత్తులలోని భాషాస్వరూపాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలని నిర్ణయించుకున్నాను. కడపజిల్లా కైఫియత్తుల్లో నేటి వ్యవహారానికి దూరమైన అనేక ప్రాచీనపదాలు గుర్తించడం. ఆ నాటి వాడుకభాషా స్వరూపానికి నేటి ప్రమాణ భాషా స్వరూపానికి ఉన్న వైవిధ్యాన్ని తెలియజేయడం. అంతేకాకుండా నిఘంటువుల కెక్కని ఎన్నోపదాలను గుర్తించి వెలుగులోకి తేవడం ఈ పరిశోధనా లక్ష్యం. అంతేకాకుండా ఈ కైఫియత్తుల ఆధారంగా ఆనాటి భాషలోని ధ్వని, వర్ణం, సంధి, సమాసం, నామ, క్రియావిజ్ఞానం వాక్య నిర్మాణల స్వరూపాన్ని కూడా వివరించడం ఈ పరిశోధనా లక్ష్యంలో భాగమే.

అధ్యాయ విభజన (Chapter division)

ఈ పరిశోధన గ్రంథాన్ని ఈ పరిశోధనా గ్రంథంలో 7 అధ్యాయాలు ఉన్నాయి.

1. కైఫియత్తులు పరిచయం, 2. కడపజిల్లా కైపియత్తులు– స్వరూప స్వభావాలు, 3. లేఖన పద్ధతులు (Orthography) 4. వర్ణవిజ్ఞానం 5. సంధి, సమాసం 6. 1. నామ విజ్ఞానం. 2. క్రియా స్వరూప విశ్లేషణ, 7. వాక్య విజ్ఞానం. ముగింపు, ఉపయుక్త గ్రంథసూచి.

మొదటి అధ్యాయం – కైఫియత్తులు పరిచయం, **రెండవ అధ్యాయం** –కడపజిల్లా కైపియత్తులు–స్వరూప స్వభావాలు , **మూడవ అధ్యాయం**– లేఖన పద్ధతులు, **నాల్గవ అధ్యాయం**– వర్ణవిజ్ఞానం, **అయిదవ అధ్యాయం**–సంధి, సమాసం, **ఆరవ అధ్యాయం**– రూపవిజ్ఞానం, **ఏడవ అధ్యాయం** – వాక్య విజ్ఞానం (Syntax) ఆయా అధ్యాయాల వారీగా అంశాలు ప్రధానంగా విశ్లేషించబడ్డాయి. ఇందులో కైఫియత్తుల్లోని భాషాస్వరూపాన్ని సమగ్రంగా భాషాశాస్త్ర పద్ధతుల్ని అనుసరించి పరిశోధన చేశాను.

పరిశోధన ఫలితాంశాలు(research findings)

కైఫియత్తుల రచన సుమారు 19వ శతాబ్ది తొలినాళ్ళలో జరగడంచేత వాటిలోని సమాజ లక్షణాలు 18వ శతాబ్ది ఆంధ్రదేశానికి చెందినవిగాను భాషా లక్షణాలు 18/19వ శతాబ్ది తెలుగు భాషకు చెందినవిగాను గ్రహించదగును. ఈ పరిశోధన ద్వారా రెండు ఫలితాలు వచ్చాయి. అవి మొదటిది 18వ శతాబ్దికి చెందిన కడపజిల్లా సమాజాన్ని చూపడం. రెండోది తెలుగు భాషా పరిణామ చరిత్రలో 19 వ శతాబ్ది భాషా లక్షణం ఈ పరిశోధన ద్వారా వివరించే ప్రయత్నం చేశాను. కడపజిల్లా కైఫియత్తుల్లో వర్ణస్థాయి పదస్థాయి, వాక్య స్టాయి లలో ఉన్న భాషా నిర్మాణం కొంతవరకు ఈ పరిశోధన ద్వారా తెలిసింది. సామాజిక భాషాశాస్త్రదృష్టితో పరిశీలించినట్లైతే వ్యక్తినామాలు, గ్రామనామాలు, భూమికొలతల పేర్లు , పంటలపేర్లు, మండలికపదాలు, వాటి సామాజిక చారిత్రక భూమిక తెలుస్తుంది.

భావి పరిశోధనలకు సూచనలు (Suggestions for upcoming research)

కడప జిల్లా కైఫియత్తులలో చరిత్ర పరిశీలన సంగ్రహంగా పరిచయం చేయబడింది. వీటిని లోతైన అధ్యయనం చేయవలసి ఉంది. నామ విజ్ఞానం మీద ప్రత్యేక అధ్యయనం చేయవచ్చు. గ్రామనిర్మాణం, కైఫియత్తులలోని సామాజిక అంశాలు, కైఫియత్తులకాలంనాటి భౌగోళిక స్వరూపం, ఇప్పటి భౌగోళిక స్వరూపంతో పోల్చి అధ్యయనం చేయవలసి ఉంది. విజయనగర రాజుల వంశం, మట్లరాజుల వంశ చరిత్రలు మొదలైనవాటి గురించి పరిశీలన చేయవలసి ఉంది.

పరిశోధకుని వివరాలు: డా. కొల్లేటి రవిబాబు, బివిపురం, శ్రీకాళహస్తి మండలం, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ నంబర్: 9494398884, kolletiravi@gmail.com.

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007